



సమగ్ర సమాచార పత్రిక

www.mudranews.in

# ముద్ర

హైదరాబాద్
శుక్రవారం, 27.03.2026

www.mudranews.in | @mudranews

సంపుటి:13
సంచిక: 154
పేజీలు: 12
వెల: రూ. 5




# మళ్లీ లాక్ డౌన్?

## మోడీ బిగ్ ప్లాన్?

- త్రివిధ దళాధిపతులు.. సీఎంలతో మోడీ కీలకభేటీలు..
- పశ్చిమాసియా యుద్ధ ప్రభావం మధ్య దేశ భద్రత, ఆర్థిక స్థితిగతులపై కేంద్రం అలర్ట్
- చమురు సంక్షోభం, మార్కెట్ పతనం నేపథ్యంలో కేంద్ర-రాష్ట్రాల సమన్వయానికి మోదీ ప్రయత్నం
- గల్ఫ్‌లో భారతీయుల రక్షణ నుంచి ఇంధన ధరల వరకు కీలక చర్చలకు సిద్ధం కేంద్రం
- త్రివిధ దళాల భేటీ తర్వాత సీఎంలతో మోదీ మీటింగ్.. సంక్షోభ నిర్వహణపై దృష్టి

పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధ మేఘాలు భారత ఆర్థిక వ్యవస్థను, భద్రతను కలవరపెడుతున్నాయి. చమురు సంక్షోభం, స్టాక్ మార్కెట్ల పతనం నేపథ్యంలో దేశాన్ని కాపాడుకునేందుకు ప్రధాని మోదీ వరుస భేటీలతో బిజీ అయ్యారు. ఇప్పటికే త్రివిధ దళాధిపతులతో వ్యూహరచన చేసిన ప్రధాని, రేపు ముఖ్యమంత్రులతో జరపబోయే వీడియో కాన్ఫరెన్స్ ఇప్పుడు అత్యంత కీలకంగా మారింది. అసలు మోదీ ప్లాన్ ఏంటి? దేశంలో లాక్‌డౌన్ ప్రచారం నిజమేనా? దీనిపై స్పెషల్ స్టోరీ..

09 -ముద్ర డెస్క్ :

## కల్యాణం చూతము రారండి..

- సీతారాముల కల్యాణానికి పకడ్బందీ ఏర్పాట్లు
- భద్రాచలం అభివృద్ధికి ప్రణాళికలు
- ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం
- మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్‌ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని నేడు భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతారామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఘనంగా నిర్వహించనున్నారు.

-ముద్ర, భద్రాచలం : 03




- సౌత్ సెంటిమెంట్‌తో ఢిల్లీ రాజకీయాల్లో కొత్త చర్చకు నాంది
- దక్షిణ రాష్ట్రాల ఏకత కోసం రేవంత్ పిలుపు
- జనాభా ఆధారిత సీట్ల పెంపు.. దక్షిణాదికి అన్యాయం?
- తెలంగాణ ఫస్ట్ వ్యూహంతో జాతీయ రాజకీయాల్లో రేవంత్ దూకుడు
- ఉత్తర-దక్షిణ సమీకరణలో కాంగ్రెస్‌కు కత్తి మీద సాము పరిస్థితి
- కేసీఆర్ మార్గానికి భిన్నంగా రేవంత్ వ్యూహాలు
- ప్రాంతీయ ప్రయోజనాలే ప్రధానమా?
- కేంద్ర-రాష్ట్ర సంబంధాలపై ప్రభావం చూపే సున్నిత రాజకీయ అజెండా

# దక్షిణ యుద్ధం!

### ఢిల్లీలో మారుతున్న స్వరం

### డీలిమిటేషన్ రాజకీయాల్లో దక్షిణాది కార్డ్ ఆడుతున్న సీఎం రేవంత్ రెడ్డి




ముద్ర, తెలంగాణ బ్యూరో :

సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ రాజకీయాలను హీటెక్కిస్తున్నారు. రాష్ట్రంలో ఉన్నప్పుడు జాతీయ రాజకీయాల ఊసెత్తకున్నా.. హస్తినలో మాత్రం స్వరం మార్చారు. తాజాగా డీలిమిటేషన్ రాజకీయాల్లో సౌత్ అంశాన్ని సెంటిమెంట్‌గా మార్చాలని రేవంత్ అనుకుంటున్నారు. దక్షిణాదికి అన్యాయం నినాదాన్ని ఆయన అందుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.

**దక్షిణాదిన సంచలనం**

నియోజకవర్గాల పునర్విభజన , సీట్ల పెంపు అంశం ఇప్పుడు దేశవ్యాప్తంగా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో పెను సంచలనానికి కేంద్ర బిందువుగా మారింది. జనాభా ప్రాతిపదికన సీట్ల సంఖ్యను పెంచితే, జనాభా నియంత్రణను సమర్థవంతంగా అమలు చేసిన దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందనే వాదనను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బలంగా వినిపిస్తున్నారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఏకతాటిపైకి వచ్చి పోరాడాలని పిలుపునివ్వడం ఇప్పుడు జాతీయ రాజకీయాల్లో చర్చనీయాంశమైంది. అయితే, ఈ విషయంలో కాంగ్రెస్ అధిష్టానం ఇంకా అధికారికంగా ఎటువంటి స్పష్టమైన పాలసీని ప్రకటించలేదు.

**జాతీయ స్థాయి చిక్కుముడి**

కాంగ్రెస్ పార్టీకి ఇది కత్తి మీద సాము లాంటి వ్యవహారం. ఒకవేళ దక్షిణాదికి అన్యాయం జరుగుతోంది అని కాంగ్రెస్ గట్టిగా ఉద్యమిస్తే, అది ఉత్తరాది రాష్ట్రాల్లోని ఓటర్లను కించపరిచినట్లు అవుతుందనే భయం జాతీయ నాయకత్వంలో ఉంది. ఉత్తర ప్రదేశ్, బిహార్ వంటి రాష్ట్రాల్లో జనాభా ఎక్కువగా ఉన్నందున అక్కడ సీట్లు భారీగా పెరుగుతాయి. ఆ రాష్ట్రాల్లో కూడా పాగా వేయాలని చూస్తున్న కాంగ్రెస్‌కు, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కొంత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉంది. జాతీయ పార్టీగా దేశమంతటా ఒకే విధానాన్ని అనుసరించాల్సి ఉండటంతో, అధిష్టానం ఆచితూచి వ్యవహరిస్తోంది.

**రేవంత్ రెడ్డి తెలంగాణ ఫస్ట్ వ్యూహం**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ధోరణి చూస్తుంటే, ఆయన జాతీయ రాజకీయాల కంటే తెలంగాణ, దక్షిణాది ప్రయోజనాలకే పెద్దపీట వేస్తున్నట్లు కనిపిస్తోంది. జాతీయ నాయకత్వం ఆలోచనలతో సంబంధం లేకుండా, క్షేత్రస్థాయిలో ప్రజల సెంటిమెంటును పట్టుకోవడంలో ఆయన మిగతా 02లో

# ఎంఎంటీఎస్‌పై సీఎం ఫోకస్

### ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైళ్ల సేవలందించాలి: సీఎం రేవంత్ రెడ్డి



- స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి
- లాస్ట్ మైల్ కనెక్టివిటీపై ఫోకస్.. మినీ బస్సుల ప్రతిపాదన
- పీక్ అవర్స్‌లో రైళ్ల సంఖ్య పెంపు.. సమయపాలనపై ఆదేశాలు
- స్టేషన్లలో మెరుగైన వసతులు ఉంటేనే ప్రయాణికుల ఆకర్షణ
- స్వీయ ఆదాయం పెంపుకు కొత్త మార్గాలపై అధికారులకు సూచనలు

09

## మధ్యాహ్న భోజనంలో చేపల కూర

- ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు తీపికబురు
- అసెంబ్లీలో మంత్రి వాకిటి ప్రకటన

03





## అన్నయ్యనా.. బావగారా?

- మెగా కుటుంబ బంధాన్ని గుర్తుచేసుకున్న అన్నా..
- చిరంజీవి, నాగబాబులతో అనుబంధం పంచుకున్న అన్నా లెజినోవా.

12

## రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

### దావోస్ పర్యటనపై అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు

09



1.15 కోట్ల కుటుంబాలకు

## ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా

### అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

- రెండున్నరేళ్లలో పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు
- ఆరోగ్య శ్రీ, సీఎం రిలీఫ్ ఫండ్ కు భారీ కేటాయింపు
- రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం



ముద్ర, తెలంగాణ బ్యూరో :

ఎన్ని అడ్డంకులు ఎదురైనా రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని సీఎం రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. గతంలో జరిగిన తప్పులను సరిదిద్దుకుంటూనే, నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడానికి, అవసరమైతే మరిన్ని నిధులను సమకూర్చుతామని స్పష్టం చేశారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత పేదల వైద్యానికి ఎక్కడా నిధుల కొరత లేకుండా ఇప్పటివరకు అత్యధికంగా నిధులు వెచ్చించినట్టు వివరించారు. అసెంబ్లీ సమావేశంలో గడిచిన 27 నెలల కాలంలో ప్రజా ప్రభుత్వం.. రాజీవ్ ఆరోగ్యశ్రీ, సీఎం సహాయ నిధి, ఎల్ఓసీ మిగతా 02లో

## పాట పాడిన బండి



- సింగర్ గా మారి ఆర్ఎస్ఎస్ గీతాలను ఆలపించిన కేంద్ర మంత్రి
- సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్న ప్రోమోలు
- రేపు ఆ గీతాలను విడుదల చేయనున్న నేతలు

03

## దహించిన అగ్నికీలలు

### 14 మంది సజీవ దహనం



- మార్కాపురం జిల్లాలో భయానక రోడ్డు ప్రమాదం..
- క్షణాల్లో రెండు వాహనాలు అగ్నికి ఆహుతి
- మృత్యువుతో పోరాడుతున్న మరో ఐదుగురు
- బస్సు నుంచి క్షేమంగా బయటపడ్డ 10 మంది ప్రయాణికులు
- బాధితులను ఆదుకోవాలని అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం

ముద్ర డెస్క్ :

ఆంధ్రప్రదేశ్‌లోని మార్కాపురం జిల్లాలో గురువారం తెల్లవారుజామున జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం తీవ్ర విషాదాన్ని మిగిల్చింది. రాయవరం సమీపంలోని పలకల క్వారీల వద్ద టిప్పర్ లారీ, ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు ఢీకొనడంతో భారీ అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. క్షణాల్లోనే మంటలు బస్సు, టిప్పర్‌ను చుట్టుముట్టడంతో మిగతా 02లో

## ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ వచ్చేసింది

- మార్చి 28న ప్రారంభం.. మే 24తో లీగ్ ముగింపు
- మొత్తం 70 మ్యాచ్‌లతో ఐపీఎల్ 2026కు పూర్తి షెడ్యూల్ విడుదల

11





తమతో డీల్ కోసం ఇరాన్ అడుక్కుంటోందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తెలిపారు. కానీ బయటి ప్రపంచానికి మాత్రం మరోలా చెబుతోందని హెచ్చరించారు.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 27.03.2026
www.mudranews.in | @mudranews



## స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేయండి



రోజుకు ఒక గంటలోపే సామాజిక మాధ్యమాల వినియోగాన్ని ఉంచితే మానసిక ప్రశాంతత పెరుగుతుంది.

# దక్షిణ యుద్ధం!

(మొదటి పేజీ తరువాయి)
సిద్ధహస్తుడు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్ల కేటాయింపులో నష్టం జరిగితే, అది నిధుల కేటాయింపు, రాజకీయ ప్రాతినిధ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని ఆయన భావిస్తున్నారు. అందుకే, పార్టీ లైన్ కంటే ప్రాంతీయ ప్రయోజనాలకే ఆయన ప్రాధాన్యత ఇస్తున్నట్లు విశ్లేషకులు భావిస్తున్నారు.

**అన్యాయం జరుగుతుందా?**
నియోజకవర్గాల పునర్విభజన అనేది రాజ్యాంగబద్ధమైన ప్రక్రియ. 50 శాతం సీట్లు పెంచాలనే ప్రతిపాదన అన్ని రాష్ట్రాలకూ వర్తిస్తుంది కాబట్టి, దీన్ని కేవలం ఒక ప్రాంతానికి అన్యాయంగా చూడలేమని కొందరు నిపుణులు వాదిస్తున్నారు. అయితే, దక్షిణాది రాష్ట్రాలు కుటుంబ నియంత్రణను పాటించి అభివృద్ధి పథంలో దూసుకుపోతుంటే, జనాభా పెంచుకున్న రాష్ట్రాలకు ఎక్కువ సీట్లు ఇవ్వడం అనేది మంచి పని చేసిన వారికి శిక్ష వేయడమే అనే వాదనలోనూ పస ఉంది. ఈ క్లిష్టమైన సమస్యను నిపుణులు, మేధావులు లోతుగా విశ్లేషించాల్సిన అవసరం కనిపిస్తోంది.

**ప్రభావితమయ్యే జాతీయ రాజకీయాలు**
దేశవ్యాప్త ప్రభావం చూపే ఇటువంటి సున్నితమైన అంశాలపై ఒక ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి బహిరంగంగా ఉద్యమానికి పిలుపునివ్వడం సామాన్యమైన విషయం కాదు. ఇది భవిష్యత్తులో కేంద్ర–రాష్ట్ర సంబంధాలపై, అలాగే కాంగ్రెస్ అంతర్గత రాజకీయాలపై ప్రభావం చూపవచ్చు. ఉత్తరాది రాష్ట్రాల్లో బీజేపీ బలంగా ఉన్న తరుణంలో, రేవంత్ రెడ్డి వ్యాఖ్యలను బీజేపీ తనకు అనుకూలంగా మలుచుకునే అవకాశం ఉంది. కాంగ్రెస్ ఉత్తరాదిని వ్యతిరేకిస్తోంది అనే ముద్ర పడకుండా కాంగ్రెస్ అధిష్టానం ఎలా మేనేజ్ చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. డీలిమిటేషన్ అంశం కాంగ్రెస్ పార్టీలో అంతర్గత విభేదాలను లేదా భిన్నమైన ఆలోచనా ధోరణులను బయటపెట్టింది. రేవంత్ రెడ్డి తనదైన శైలిలో దక్షిణాది సెంటిమెంటును రగిలిస్తుంటే, జాతీయ నాయకత్వం మాత్రం ఆచితూచి అడుగులు వేస్తోంది.

**కేసీఆర్ కు వ్యతిరేక దిశగానే..!**
గతంలో తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ కూడా ఇలాంటి రాజకీయ వ్యూహాలను అమలు చేశారు. ఉత్తరాదిన మొదలు పెట్టి దక్షిణాది రాష్ట్రాల్లో నేతలను కలుపుకుని జాతీయ స్థాయిలో చక్రం తిప్పే ప్రయత్నాలు చేశారు. కానీ, అవి బెడిసి కొట్టాయి. దానికోసం పార్టీ పేరును కూడా మార్చుకున్నారు. ఈ పరిణామాలు సొంత రాష్ట్రంలోనే అధికారం కోల్పోయేలా చేశాయని ఓ వాదన. ఇలాంటి పరిస్థితుల్లో రేవంత్ రెడ్డి దక్షిణ వ్యూహం ఎలా ఉండబోతోందో చూడాల్సిందే.

## 1.15 కోట్ల కుటుంబాలకు
# ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా



(మొదటి పేజీ తరువాయి)
రూపంలో అందించిన ఆర్థిక సహాయానికి సంబంధించిన గణాంకాలను సీఎం గురువారం శాసనసభ ముందు వివరించారు. ప్రశ్నోత్తరాల సమయంలో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని అనేక అంశాలను వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉద్యోగ, రాజకీయ సర్వేలెక్కల ప్రకారం తెలంగాణలోని 1.15 కోటి కుటుంబాలకు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకాన్ని అమలు చేయబోతున్నట్లు చెప్పారు. పేదలకు జీవిత బీమాను అందించి పేదల్లో ధీమా కల్పించాలన్న లక్ష్యంతోనే ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెడుతున్నట్లు వెల్లడించారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పేదల వైద్యం కోసం రూ.4,500 కోట్లు ఖర్చు చేసినట్లు చెప్పారు. గడిచిన 27 నెలల కాలంలో ముఖ్యమంత్రి సహాయ నిధి కింద రూ. 2046 కోట్లు, రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద రూ. 2,400 కోట్లు మొత్తంగా రూ. 4,500 కోట్లు పేదల వైద్యం కోసం ఖర్చు చేశామన్నారు. 2014 నుంచి 6వ డిసెంబర్ 2023 వరకు రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద ప్రతి నెలా సగటున రూ.52 కోట్లు ఖర్చు పెట్టింది. అదే ఇప్పుడు ప్రజా ప్రభుత్వం సగటున ప్రతి నెలా రూ. 89 కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. గత ప్రభుత్వం బకాయిల భారాన్ని తమపై పెట్టిందన్నారు. గత ప్రభుత్వం నుండి రాజీవ్ ఆరోగ్యశ్రీలో వారసత్వంగా వచ్చిన భారం రూ.600.27 కోట్లు అన్నారు. అందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ.240.11 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ360.16 కోట్ల బకాయి ఉందన్నారు ఆ భారాన్ని మోస్తూనే.. రాజీవ్ ఆరోగ్యశ్రీ రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచినట్లు చెప్పారు. ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత నుంచి ఈరోజు వరకు రూ.2,408.51 కోట్ల ఆరోగ్యశ్రీ నిధులను చెల్లించినట్లు చెప్పారు. ఇందులో ప్రభుత్వ ఆస్పత్రులకు రూ927.99 కోట్లు, ప్రైవేట్ ఆస్పత్రులకు రూ 1,480.52 కోట్లు చెల్లించామన్నారు. నెలకు ప్రభుత్వ ఆసుపత్రులకు రూ. 34 కోట్లు, ప్రైవేటు ఆస్పత్రులకు రూ. 54 కోట్లు అందించామన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద మొత్తం రూ. 725.75 కోట్లు బకాయి ఉంటే, అందులో గత ప్రభుత్వం బకాయి పెట్టిన మొత్తం రూ. 600 కోట్లు అన్నారు గత ప్రభుత్వ బకాయి పోగా గడిచిన 28 నెలల కాలంలో ఈ ప్రభుత్వ బకాయి కేవలం రూ100 కోట్లు మాత్రమేనన్నారు.. ఇందులోనూ ప్రభుత్వ ఆస్పత్రులకే ఎక్కువగా రూ.496.31 కోట్లు బకాయి ఉంటే, ప్రైవేటు ఆస్పత్రులకు రూ231.44 కోట్లు ఉందన్నారు.

**1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా**
రాష్ట్రంలో నిరుపేదలను ఆదుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల ప్రయత్నాలు చేస్తోందని సీఎం వెల్లడించారు. ఇందులో భాగంగా పేదల్లో ధీమా కల్పించాలన్న సంకల్పంతోనే 1.15 కోట్ల కుటుంబాలకు జీవిత బీమా తెస్తున్నట్లు చెప్పారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ ఇవ్వకపోవడంతో చికిత్స అందడం లేదన్న వాదన అవాస్తవం అన్నారు. సీఎంఆర్ఎఫ్ గతంలో ఎలా దుర్వినియోగమైందో అందరికీ తెలిసిందేనన్న సీఎం.. మరింత పారదర్శకంగా ప్రజాప్రతినిధులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేయడానికి వీలు కల్పించామన్నారు. నిమ్స్, సనత్‌నగర్, అల్వాల్, ఎల్బీనగర్, వరంగల్ టిమ్స్ వంటి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రులతో పాటు రూ. 3 వేల కోట్లతో కొత్తగా నిర్మిస్తున్న ఉస్మానియా ఆస్పత్రి కలిపి రాష్ట్రంలో కొత్తగా 10 వేల పడకల సామర్థ్యంతో అత్యాధునికంగా వైద్యం అందించేలా తీర్చిదిద్దుతున్నట్లు రేవంత్ రెడ్డి వెల్లడించారు. ఆ పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ కింద పేదలు వైద్యం కోసం టీచింగ్ హాస్పిటల్స్‌కు పంపిస్తే తద్వారా అక్కడున్న నిపుణులైన వైద్యులతో చికిత్స అందించడానికి అలాగే వైద్య విద్యార్థులకు వృత్తిరీత్యా ఎంతో అనుభవం వస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. చికిత్స అందించే అనుభవం కలిగిన వైద్యులకు ప్రోత్సాహకాలు కూడా ఇచ్చే ఆలోచన చేస్తున్నామని చెప్పారు. పేదలకు మరింత వేగవంతమైన నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆస్పత్రుల నిర్వహణ విధానంలో కూడా మార్పులు చేస్తున్నట్లు చెప్పారు వైద్యులకు హాస్పిటల్ నిర్వహణ బాధ్యత అప్పగించడంతో వైద్యంపై దృష్టి సారించలేని పరిస్థితులు ఉంటున్నాయన్న రేవంత్ రెడ్డి.. నిర్వహణ విభాగాన్ని వేరు చేయాలన్న ఆలోచన చేస్తున్నామన్నారు. ఆస్పత్రుల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమిస్తామని ప్రకటించారు. విదేశాల్లో గొప్ప పేరు గడించిన వైద్యులు రాష్ట్రానికి వచ్చినప్పుడు వెసులుబాటును బట్టి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఉచితంగా పేదలకు వారి సేవలను అందించడానికి వీలుగా మెడికల్ అండ్ హెల్త్ వెబ్‌సైట్ ద్వారా ఒక వేదికను రూపొందిస్తున్నామన్నారు. వైద్య రంగం ఎప్పటికప్పుడు కొత్త సవాళ్లను ఎదుర్కొంటోందని సీఎం తెలిపారు. ఈ విషయంలో ప్రజలకు ఉపయోగపడే సూచనలను స్వీకరిస్తామన్నారు. అలాగే విద్య పరంగా నర్సరీ నుంచి పైస్థాయి వరకు, వైద్యం పరంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి స్పెషాలిటీ హాస్పిటల్స్ వరకు ఒక ప్రత్యేక ప్రణాళికతో ముందుకు వెళుతున్నామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. మంచి రోల్ మాడల్‌గా రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ముందుకెళుతున్నామని ముఖ్యమంత్రి వివరించారు.

# దహించిన అగ్నికీలలు..




(మొదటి పేజీ తరువాయి)
బస్సులో ఉన్న ప్రయాణికులు బయటకు రావడానికి అవకాశం లేకుండా పోయింది. ఈ ప్రమాదంలో ఇప్పటి వరకు 14 మంది ప్రయాణికులు సజీవదహనమయ్యారని అధికారులు ధృవీకరించారు. మరో 15 మందికి తీవ్ర గాయాలు కాగా వారిని సమీపంలోని మార్కాపురం ప్రైవేట్ ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని వైద్యులు తెలిపారు. హైదరాబాద్ నుంచి పామూరు వైపు వెళ్తున్న హరికృష్ణ ట్రావెల్స్‌కు చెందిన బస్సు మలుపు తిరుగుతున్న సమయంలో అతివేగంగా వస్తున్న టిప్పర్ లారీ ఢీకొట్టినట్లు ప్రాథమిక సమాచారం. ఢీకొన్న వెంటనే ఇరువాహనాల్లో మంటలు చెలరేగడంతో పరిస్థితి నియంత్రణలో లేకుండా పోయింది. బస్సు వెనుక భాగంలో కూర్చున్న ప్రయాణికులు బయటకు రాలేక మంటల్లో చిక్కుకుని ప్రాణాలు కోల్పోయినట్లు తెలుస్తోంది. అయితే ముందు భాగంలో ఉన్న కొందరు ప్రయాణికులు ప్రాణాలతో బయటపడగలిగారు.

# 'సీఎస్ఆర్'కు కొత్త పాలసీ




ముద్ర, తెలంగాణ బ్యూరో :
కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) నిధుల సమీకరణతో పాటు సమర్థ వినియోగానికి ప్రత్యేక పాలసీ రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. సీఎస్ఆర్ నిధుల విరాళాలతో రాష్ట్రంలో అభివృద్ధి, ప్రజోపయోగ కార్యక్రమాలు చేపట్టే కార్పొరేట్ సంస్థలను ప్రభుత్వం తరఫున అభినందించాలని సూచించారు. ప్రతి ఏడాది అత్యుత్తమ భాగస్వామ్యం పంచుకున్న సంస్థల ప్రతినిధులను అభినందించేందుకు ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేయాలని చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి ఫండ్స్ పై గురువారం శాసన మండలి కాన్ఫరెన్స్ హాల్‌లో సీఎం సమీక్షా సమావేశ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.రాష్ట్ర ఆవిర్భావ వేడుకల్లో భాగంగా ఈ అభినందన ఉత్సవానికి ఏర్పాట్లు చేయాలన్నారు. రాష్ట్ర స్థాయిలో సీఎస్ఆర్ సెల్ ఏర్పాటు చేయాలని, ప్రత్యేక కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. రాష్ట్రంలోని కార్పొరేట్ కంపెనీలు సీఎస్ఆర్‌తో చేపడుతున్న కార్యక్రమాల వివరాలు, అన్ని ప్రభుత్వ విభాగాల్లో అందుబాటులో ఉన్న ప్రాజెక్టులు, సీఎస్ఆర్ ద్వారా చేపట్టేందుకు వీలున్న కార్యక్రమాల వివరాలన్నీ సమన్వయం చేసే బాధ్యతలను రాష్ట్ర స్థాయి సెల్ నిర్వర్తిస్తుందన్నారు. ప్రభుత్వానికి, కార్పొరేట్ సంస్థలకు అనుసంధానంగా ఉండేలా ప్రత్యేకంగా తెలంగాణ సీఎస్ఆర్ పోర్టల్ రూపొందించాలని సీఎం ఆదేశించారు. కార్పొరేట్ సంస్థలు సీఎస్ఆర్ విరాళాలను ఇచ్చేందుకు, వివిధ విభాగాల పరిధిలో చేపట్టేందుకు వీలున్న ప్రాజెక్టుల వివరాలన్నీ పోర్టల్ లో పొందుపరచాలన్నారు. కార్పొరేట్ సంస్థలు ప్రభుత్వాన్ని సంప్రదించేందుకు, తమకు అనువైన ప్రాజెక్టులను ఎంచుకునేందుకు వీలుగా ఈ పోర్టల్ ఆకర్షణీయంగా తయారు చేయాలని చెప్పారు. జాతీయ స్థాయిలో సీఎస్ఆర్ విరాళాల వాటా మన రాష్ట్రంలో కేవలం 3 శాతం మాత్రమే ఉందని అధికారులు సీఎంకు నివేదించారు. ఇప్పటి వరకు వచ్చిన సీఎస్ఆర్ ఫండ్స్ ఆశించిన స్థాయిలో లేవని, తెలంగాణలో కంపెనీలు, పరిశ్రమలు ఏర్పాటు చేసి సీఎస్ఆర్ ఫండ్స్ వేరే చోట ఖర్చు పెడితే ఎలా? అని సీఎం అన్నారు. రాష్ట్రానికి మరిన్ని సీఎస్ఆర్ ఫండ్స్ రావాల్సిన అవసరం ఉందని, మన రాష్ట్రంలో ఉన్న కార్పొరేట్ సంస్థలు, పరిశ్రమలు తెలంగాణలోనే ఎక్కువ సీఎస్ఆర్ ఖర్చు పెట్టేలా చూడాలన్నారు. ఇతర రాష్ట్రాల్లో సీఎస్ఆర్ సమీకరణకు అనుసరిస్తున్న విధానాలను అధ్యయనం చేయాలని చెప్పారు. ఈ వాటాను పెంచుకునేందుకు వీలుగా కొత్త పాలసీ ఉండాలని, కార్పొరేట్ సంస్థలను ఆకర్షించే విధానాలను అనుసరించాలని చెప్పారు. ఈ సమీక్షలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచిఘోష్, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం స్పెషల్ సెక్రెటరీ అజిత్ రెడ్డి, సీఎం సెక్రెటరీ మాణిక్యరాజ్, యోగితారాణా, శశాంక, భవేష్ మిశ్రా, నిఖిల్ చక్రవర్తి, అధికారులు పాల్గొన్నారు.



## అబుదాబీలో క్షిపణి దాడి.. భారతీయుడి మృతి

ముద్ర డెస్క్ :
పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు కొనసాగుతూనే ఉన్నాయి. అబుదాబీపై ఇరాన్ జరిపిన క్షిపణి దాడుల్లో ఇద్దరు ప్రాణాలు కోల్పోగా.. వీరిలో ఒకరు భారతీయుడు ఉన్నట్లు వెల్లడైంది. ఇరాన్ నుంచి వచ్చే క్షిపణులను యూఏఈ గగనతల రక్షణ వ్యవస్థలు సమర్థమంతంగా అడ్డుకున్నప్పటికీ.. క్షిపణి శిథిలాలు మీద పడి వీరిద్దరూ చనిపోయినట్లు సమాచారం. చనిపోయిన మరో వ్యక్తిని పాక్‌కు చెందిన వ్యక్తిగా గుర్తించారు. అయితే, ఈ ఘటనపై భారత విదేశాంగశాఖ నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. అబుధాబీ క్షిపణి దాడి ఘటనలో మరో ముగ్గురు గాయపడగా.. వీరిలోనూ ఒకరు భారతీయుడు ఉన్నట్లు యూఏఈ మీడియా విభాగం వెల్లడించింది. మరో ఇద్దరు యూఏఈ, జోర్డాన్‌లకు చెందిన వారని పేర్కొంది. ఈ దాడులకు సంబంధించి ఎలాంటి వదంతులను పౌరులు నమ్మవద్దని, అధికారుల నుంచి ధ్రువీకరించుకోవాలని సూచించింది. మరోవైపు, యూఏఈపై ఇరాన్ దాడులను జోర్డాన్ ఖండించింది. ఆ దేశ సార్వభౌమత్వాన్ని ఉల్లంఘించడమే కాకుండా ఈ ప్రాంత భద్రత, స్థిరత్వానికి తీవ్ర ముప్పు కలిగించే చర్యలేనని పేర్కొంది.

## తెలంగాణ భూపాలనలో
# సరికొత్త శకం
### ఏప్రిల్ 2నుంచి 5 మండలాల్లో ఇంటిగ్రేటెడ్ భూభారతి
### రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి

ముద్ర, తెలంగాణ బ్యూరో :
త్వరలోనే తెలంగాణ భూపరిపాలనలో సరికొత్త శకం ఆరంభం కాబోతోందని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో ధరణి తెచ్చిన చిక్కుముడులను విప్పుతూ, రైతులకు అత్యంత పారదర్శకంగా, సులభతరమైన సేవలు అందించడమే లక్ష్యంగా కొత్తగా రూపొందించిన ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్ (ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ల్యాండ్ రికార్డ్స్ మేనేజిమెంట్ సిస్టమ్)ను ఏప్రిల్ 2వ తేదీ నుంచి ఐదు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు. గురువారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ, సర్వే, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ , ఎన్ఐసి అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా భూపరిపాలన సేవలను మరింత వేగవంతంగా అందించడానికి రెవెన్యూ. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ , సర్వే విభాగాలను ఒకే గొడుగు కిందకు తెస్తూ భూభారతి పోర్టల్‌ను అభివృద్ధి చేశామన్నారు. ప్రతి భూలావాదేవీ వివరాలు కనిపించేలా పారదర్శకంగా ఈ పోర్టల్ రూపొందించినట్లు వెల్లడించారు. ఈ ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను నారాయణపేట జిల్లా కొస్గి, రంగారెడ్డి జిల్లా అమన్‌గల్, సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి, ఖమ్మం జిల్లా కుసుమంచి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట మండలాల్లో వచ్చేనెల 2వ తేదీ నుంచి ప్రయోగాత్మకంగా అమలు చేస్తామని తెలిపారు. ఈ పైలట్ మండలాల్లో మెరిట్–డీమెరిట్ లను క్షుణ్ణంగా పరిశీలించి వాటికి అవసరమైన మార్పులు చేర్పులు చేసి రెండవ దశలో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేస్తామని తెలిపారు.
ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు భూభారతి చట్టాన్ని తీసుకువచ్చామని చెప్పారు. అలాగే ధరణి పోర్టల్‌ను బంగాళాఖాతంలో కలిపి భూభారతి పోర్టల్‌ను కూడా తీసుకువచ్చామన్నారు. భూభారతి చట్టంలో పేర్కొన్నవిధంగా వ్యవసాయ భూములకు సంబంధించి క్రయవిక్రయదారులకు ఇబ్బంది లేకుండా రిజిస్ట్రేషన్ సమయంలో సర్వే మ్యాపును జతపరచే నిబంధనను ఈ ఐదు మండలాల్లో అమలు చేస్తున్నట్లు వెల్లడించారు. తద్వారా రాష్ట్రంలో భూవివాదాలకు పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ ఐదు మండలాల్లో ప్రతి సర్వే నెంబరుకు ఆధార్ నెంబర్ మాదిరిగానే భూధార్ నెంబర్‌ను కూడా ఇస్తామని తెలిపారు. ఇప్పటికే ప్రయోగాత్మకంగా నక్షాలేని ఐదు గ్రామాల్లో రీసర్వే నిర్వహించి భూధార్ నెంబర్‌ను కేటాయించడం జరిగిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకున్నాకూడా ప్రజా కోణంలోనే ఉంటుందన్నారు.
ఒక క్లిక్‌తో రైతులకు సంబంధించిన భూముల పూర్తి సమాచారం లభించేలా చాలా సులువుగా, సులభతరంగా ఉండేలా ఇంటిగ్రేటెడ్ భూభారతి పోర్టల్‌ను రూపొందించామని ఆధార్ నెంబర్‌తో అనుసంధానమైన మొబైల్ నెంబర్ ద్వారా లాగిన్ అయిన వెంటనే కావలసిన సమాచారం లభిస్తుందన్నారు.
అదేవిధంగా ఈ పోర్టల్‌లో ప్రధానంగా సమాచారం సేవలు, సర్వే సేవలు, కరెక్షన్ సేవలు, అప్పీల్ సేవలు, రిజిస్ట్రేషన్ సేవలతోపాటు సిటిజన్ డాష్‌బోర్డు సేవలకు సంబంధించి మై ల్యాండ్ పోర్ట్‌ఫోలియో, నాలా ఆర్డర్స్, రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ వివరాలు, ఫీడ్‌బ్యాక్, సంబంధిత అధికారుల వివరాలు, ఆర్వోఆర్, భూధార్ నెంబర్, దరఖాస్తు వివరాలు, మ్యూటేషన్, ఈసీ, మార్కెట్ విలువ, విలేజ్ మ్యాప్, ప్రతి సర్వేనెంబర్‌కు మ్యాప్, ఆర్వోఆర్, గ్రామాల నక్షా, పాస్ బుక్ కరెక్షన్, వంటి పూర్తి సమాచారం, సేవలు లభించేలా మూడు విభాగాలను అనుసంధానం చేస్తూ భూభారతి పోర్టల్‌ను పూర్తి స్థాయిలో ప్రజలకు చేరువ చేయబోతున్నామని తెలిపారు. రిజిస్ట్రేషన్, ఇతర భూసేవలకు సంబంధించి దరఖాస్తు చేసుకున్నప్పటి నుంచి ఆ ప్రక్రియ పూర్తయ్యేవరకు ప్రతి స్టేజ్‌లో దాని వివరాలను తెలియజేస్తూ ఎస్ఎమ్ఎస్ ద్వారా ఖాతాదారునికి సమాచారం కూడా అందుతుందన్నారు. ధరణి పోర్టల్‌లో 36 మాడ్యూల్స్ ఉండగా భూభారతి పోర్టల్‌లో ఒకే ఛాప్టర్ కింద తీసుకువచ్చామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ కార్యదర్శి డిఎస్ లోకేష్ కుమార్, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఐజీ రాజీవ్ గాంధీ హనుమంతు, ఎన్ఐసి అధికారులు పాల్గొన్నారు.




## నిర్మల్‌లో వైద్యునిపై దాడి.. నిరసనగా ధర్నా

ముద్ర ప్రతినిధి, నిర్మల్:
నిర్మల్ పట్టణంలో గురువారం రాత్రి ఒక వైద్యునిపై కొందరు దాడి చేసిన ఘటనతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. దాడిని నిరసిస్తూ జాతీయ రహదారి 44 పై ధర్నా, రాస్తా రోకో నిర్వహించటంతో రాకపోకలు స్తంభించి పోయాయి.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**అవసరమైన పనులకే ఆన్‌లైన్ వాడకం**

కమ్యూనికేషన్, నేర్చుకోవడం వంటి ఉపయోగకర పనులకే ప్రాధాన్యం ఇవ్వాలి.



# సింగర్ సంజయ్



- ఆర్ఎస్ఎస్ గీతాలను ఆలపించిన కేంద్ర మంత్రి బండి
- సోషల్ మీడియాలో హల్ చల్ చేస్తున్న ప్రోమో
- నేడు ఆ గీతాలను విడుదల చేయనున్న నేతలు

**ముద్ర, కరీంనగర్ :**
కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ గాయకుడి అవతారమెత్తారు. రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) స్థాపించి శత వసంతాలు పూర్తయిన నేపథ్యంలో ఆర్ఎస్ఎస్ గీతాలను ఆలపించారు. బండి సంజయ్ రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ లో పని చేశారు. జాతీయవాదం, హిందుత్వ సిద్ధాంతాలను పూర్తిగా పుణికి పుచ్చుకున్న బండి సంజయ్... ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను సామాన్య ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలనే లక్ష్యంతో ఆ గీతాలను ఆలపించారు. బండి సంజయ్ పాడిన ఆర్ఎస్ఎస్ గీతాలకు సంబంధించిన ప్రోమో విడుదలైంది. సోషల్ మీడియాలో బండి సంజయ్ గీతాలాపన ప్రోమో హల్ చల్ చేస్తోంది. శ్రీరామ నవమి సందర్భంగా కరీంనగర్ లో బండి సంజయ్ పాడిన పాటలను అధికారికంగా విడుదల చేయనున్నారు.

# రాములోరి కళ్యాణానికి వేళాయే

- పకడ్బందీగా ఏర్పాట్లు
- భద్రాచలం అభివృద్ధికి ప్రణాళికలు
- పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



**ముద్ర, భద్రాచలం :**
దక్షిణ అయోధ్యగా పేరొందిన భద్రాచలం శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థానాన్ని ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు వెల్లడించారు. గోదావరి వరదలను దృష్టిలో ఉంచుకొని కరకట్టల ఎత్తు పెంపు, ఘాట్‌ల నిర్మాణం, రెండో పీట నిర్మాణం వంటి పనులు చేపట్టినట్లు తెలిపారు. భవిష్యత్తులో భక్తుల రాకను మరింత సులభతరం చేసే దిశగా మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. శ్రీరామ నవమిని పురస్కరించుకొని శుక్రవారం భద్రాచలంలోని మిథిలా స్టేడియంలో నిర్వహించనున్న శ్రీ సీతా రామచంద్ర స్వామి వారి కల్యాణం, మహా పట్టాభిషేకం ఏర్పాట్లను మంత్రి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ పవిత్ర క్షేత్రానికి దేశ విదేశాల నుంచి భారీగా భక్తులు విచ్చేసే అవకాశం ఉన్నందున ఎలాంటి లోటుపాట్లు లేకుండా సమగ్ర ఏర్పాట్లు చేయాలని మంత్రి అధికారులకు సూచించారు. ఉదయం 10:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు స్వామివారి కల్యాణం, 28వ తేదీన అదే సమయాల్లో మహా పట్టాభిషేకం నిర్వహించనున్నట్లు మంత్రి తెలిపారు. భక్తుల రాకను దృష్టిలో ఉంచుకొని అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అలాగే ఈ మహోత్సవానికి సీఎం రేవంత్ రెడ్డి హాజరై... ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పిస్తారని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా యంత్రాంగం సమన్వయంతో ప్రతి శాఖ తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలని, వీఐపీలు, వీవీఐపీలు, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా మర్యాదపూర్వకంగా సేవలు అందించాలని మంత్రి ఆదేశించారు. భద్రాచలం దేవస్థానం అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రూ.351 కోట్లు మంజూరు చేసినట్లు మంత్రి వెల్లడించారు. స్వామివారి కల్యాణం అనంతరం ముఖ్యమంత్రి చేతుల మీదుగా భూమి పూజ నిర్వహించి అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టనున్నట్లు తెలిపారు. దేవాలయ అభివృద్ధితోపాటు భద్రాచలం పట్టణాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు రహదారులు,



రైల్వే, నదీ మార్గాల అభివృద్ధి పై చర్యలు తీసుకుంటున్నామని, అమరావతి–జగదల్పూర్ మధ్య రవాణా సౌకర్యాల విస్తరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం భద్రాచలం అభివృద్ధికి సంబంధించిన ప్రణాళికల ఫోటోలను మంత్రి పరిశీలించారు.ఈ కార్యక్రమంలో దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఐటీడీఏ పీవో రాహుల్, సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, జాయింట్ కలెక్టర్ వేణుగోపాల్, దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఎస్పీ రోహిత్ రాజ్, ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ పాల్గొన్నారు.

## ఏర్పాట్లపై కలెక్టర్ సమీక్ష

మంత్రి పర్యటన తర్వాత మిథిలా స్టేడియం వద్ద జిల్లా కలెక్టర్ అంకిత్ సెక్టార్ అధికారులు, వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా తలంబ్రాల కౌంటర్లు, ప్రసాదాల కౌంటర్లు, పారిశుధ్యం, మంచినీటి సరఫరా, వైద్య సదుపాయాలు వంటి అన్ని అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సెక్టార్ అధికారులు, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి



అధికారి క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండి తమకు కేటాయించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించాలని, ఎక్కడైనా లోపాలు గమనించిన వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ స్పష్టం చేశారు. శ్రీరామనవమి ఉత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# ఏసీబీ వలలో మామడ ఎస్సై



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:**
నిర్మల్ జిల్లా మామడ పోలీస్ స్టేషన్ ఎస్ ఐ తీగల అశోక్ రూ.20వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ డీఎస్పీ మధు ఆధ్వర్యంలో పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. భూ తగాదా విషయంలో ఓ వ్యక్తిపై చీటింగ్ కేసు నమోదు చేయకుండా ఉండేందుకు ఎస్సై అశోక్ రూ. 20 వేలు డిమాండ్ చేశారు. ఈ మొత్తాన్ని అందజేస్తున్న క్రమంలో ముందస్తు సమాచారం ఉన్న ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి కరీంనగర్ కోర్టు లో హాజరు పరచనున్నట్లు డీఎస్పీ మధు తెలిపారు. ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే వాట్సాప్ నంబర్ 9440446106 కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

# జగ్గారెడ్డికి ఊరట

**మానవ అక్రమ రవాణా కేసు కొట్టివేత**



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి ఊరట లభించింది. మానవ అక్రమ రవాణా కేసులో జగ్గారెడ్డితో పాటు కాంగ్రెస్ నేత కుసుమ కుమార్ పై నమోదైన కేసును ప్రజా ప్రతినిధుల ప్రత్యేక కోర్టు కోట్టివేసింది. బీఆర్ఎస్ ప్రభుత్వ హాయంలో నమోదు చేసిన ఈ కేసులో ఏ 1 గా ఉన్న జగ్గారెడ్డి, ఏ 3గా ఉన్న కుసుమ కుమార్ పై కేసులో నేరాలు రుజువు కాలేదని వారిని నిర్దోషులుగా ప్రకటిస్తూ తీర్పు వెలువరించింది. కేసు పూర్వపరాలు చూస్తే.. కాగా 2004లో తాను ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జగ్గారెడ్డి నకిలీ డాక్యుమెంట్లు సమర్పించి భార్య పిల్లలుగా పేర్కొంటూ వేరే ముగ్గురు వ్యక్తులను అమెరికాకు తీసుకువెళ్లారని ఆరోపణలు ఉన్నయి. తన వెంట ఒక మహిళ ఒక యువకుడిని అమెరికా తీసుకువెళ్లిన జగ్గారెడ్డి తిరిగి ఆయన ఒక్కరే భారత్‌కు తిరిగి వచ్చారనే ఆరోపణలు ఉన్నాయి. నాడు ఎమ్మెల్యేగా, విప్ గా అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ 2018లో ఆయన్ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం బెయిల్ పై ఆయన బయటకు వచ్చారు. తాజాగా ఈ కేసుకు సంబంధించి కోర్టు తీర్పు వెలువరించింది.

# మధ్యాహ్నం చేపల కూర

- ప్రభుత్వ బడుల్లోని విద్యార్థులకు అందజేత
- అసెంబ్లీలో మంత్రి వాకిటి శ్రీహరి ప్రకటన

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ప్రభుత్వ బడుల్లో చదివే విద్యార్థులకు రేవంత్ సర్కార్ తీపి కబురు అందించింది. మధ్యాహ్న భోజన పథకం ద్వారా ఇప్పటికే సన్నబియ్యంతో నాణ్యమైన పౌష్టికాహారం అందిస్తుండగా.. ఇక నుంచి చేపలు కూడా అందించనున్నట్లు మంత్రి వాకిటి శ్రీహరి తెలిపారు. గురువారం అసెంబ్లీలో పశుసంవర్ధక, మత్స్య, క్రీడల శాఖలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇచ్చారు. రాష్ట్రంలో బలమైన పశుసంపద ఉందని, గుడ్ల ఉత్పత్తిలోనూ తెలంగాణ అగ్రస్థానంలో ఉందని చెప్పారు. సర్కార్ బడుల్లో చదివే విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. అందులో భాగంగానే వారి కోసం ప్రత్యేక జాతికి చెందిన చేపల్ని పెంచి మధ్యాహ్న భోజనంలో అందించనున్నట్లు వెల్లడించారు. 'మధ్యాహ్న భోజన పథకంలో చేపల కర్రీ అందిస్తాం. ఇప్పటికే కేబినెట్‌లో ఈ అంశంపై చర్చించాం. విద్యార్థులకు అందించేందుకు తిలాపియా అనే చేప రకాన్ని ప్రత్యేకంగా పెంచుతాం. ఈ చేపలో మధ్యలో వెనుముల్లు మాత్రమే ఉంటుంది. పిల్లలు తినే సమయంలో ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఈ తిలాపియా చేపను ప్రత్యేకంగా పెంచి పిల్లలకు పౌష్టికాహారం అందిస్తాం. అన్ని రంగాల్లోనూ తెలంగాణను అగ్రభాగాన నిలిపేందుకు చర్యలు తీసుకుంటున్నాం. గ్రామస్థాయిలో క్రీడలను బలోపేతం చేసే దిశగా ప్రత్యేక కార్యచరణ రూపొందించాం.' అని వాకిటి శ్రీహరి తెలిపారు.



# కాంట్రాక్టు ఉద్యోగుల శ్రమ దోపిడీ

- కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు
- సమస్యల పరిష్కారం కోరుతూ మహా ధర్నా
- కనీస వేతనాలు ఇవ్వాలని డిమాండ్




**ముద్ర, హైదరాబాద్:**
టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు చావ రవి ధర్నాకు అధ్యక్షత వహించారు. సిపిఐ శాసన సభా పక్ష నాయకులు, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివ రావు హాజరై మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్షా ఉద్యోగులకు నామ మాత్రపు వేతనాలతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు శ్రమ దోపిడీకి పాల్పడుతున్నాయని ఆరోపించారు. కాంట్రాక్టు ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శాసనసభలో ప్రస్తావించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరాటానికి సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

పూర్వ శాసన మండలి సభ్యులు కె నాగేశ్వర్ మాట్లాడుతూ... కెజిబివిలలో అనాథలు, పాక్షిక అనాథ బాలికలకు నాణ్యమైన విద్యను అందిస్తూ అద్భుతమైన ఫలితాలను సాధిస్తున్నారని, వీధి బాలల పునరావాసానికి అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలు కృషి చేస్తున్నాయని, విద్యా గణాంకాల సేకరణ, ప్రాథమిక పాఠశాలలకు అకడమిక్ సహకారం అందించడానికి సమగ్ర శిక్షా ఉద్యోగులు విశేషంగా కృషి చేస్తున్నారని వీరందరికీ కనీస వేతనాలు అమలు చేయాలని, సర్వీసులు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. గత ఇరవై సంవత్సరాలుగా తాను ఇందిరా పార్క్ ధర్నా చౌక్ లో పోరాటాల్లో పాల్గొంటున్నానని. పాలకులు ప్రతిపక్షంలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరోమాట మాట్లాడటం అలవాటుగా మారిందని విమర్శించారు.

జాతీయ మహిళా ఉపాధ్యాయ నాయకులు ఎం సంయుక్త మాట్లాడుతూ.. సెలవుల విషయంలో రెగ్యులర్, కాంట్రాక్టు వివక్ష సమంజసం కాదన్నారు. కెజిబివి, యుఆర్ఎస్ ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మరణిస్తే కనీసం మట్టి ఖర్చులు కూడా ఇవ్వడం లేదని, రూ 10 లక్షలు ఎక్స్ గ్రేషియా ఇవ్వాలని డిమాండ్ చేశారు. చావ రవి మాట్లాడుతూ తెలంగాణ తొలి పిఆర్సీ సిఫారసు చేసిన విధంగా కాంట్రాక్టు ఉద్యోగులకు రూ 1000 వార్షిక ఇంక్రిమెంట్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కెజిబివి ఉద్యోగులకు ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధంగా వేతనాలు ఇస్తున్నారని, కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకంలో ఈ వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని దేశవ్యాప్తంగా ఒకేరకమైన వేతనాలు అమలు చేయాలని, అందుకు అవసరమైన అదనపు నిధులను కేటాయించాలని డిమాండ్ చేశారు. టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎ వెంకట్ మాట్లాడుతూ కెజిబివి, యుఆర్ఎస్ ఉద్యోగుల సమస్యలపై లోగడ టిఎస్ యుటిఎఫ్ ఆధ్వర్యంలో పలు పోరాటాలు నిర్వహించామని, 12 నెలల వేతనాలు, వీక్లీ ఆఫ్, 180 రోజుల ప్రసూతి సెలవులు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు సాధించుకున్నామని, ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ముఖ్యమైన సమస్యలను సానుకూలంగా పరిష్కరిస్తుందని ఆశించామన్నారు. రెండు సంవత్సరాల సమయం ఇచ్చినా సమస్యలు పరిష్కరించలేదని, అందుకే మరోసారి మూడు దశల పోరాటానికి పిలుపునిచ్చామన్నారు. రెండు దశల పోరాటం నిర్వహించినా ప్రభుత్వం నుండి స్పందన లేదని, మూడవ దశగా ఈ రోజు (మార్చి 26న) చలో అసెంబ్లీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ వెంటనే చొరవ తీసుకుని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకుంటే తదుపరి కార్యాచరణను ప్రకటిస్తామన్నారు. సిఐటియు రాష్ట్ర కార్యదర్శి బి.మధు, టిఎస్ యుటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గా భవాని, కోశాధికారి టి.లక్ష్మారెడ్డి, కెజిబివి, యుఆర్ఎస్, సమగ్ర శిక్ష నాయకులు విశాలాక్షి, లక్షి , మంజుల, గోపిలత, యాదగిరి, పాషా, సురేందర్, కుమార స్వామి, గంగామణి, మంజులత, సుమన చైతన్య, మంజుల, వెంకటప్ప, రాజు, రవికుమార్, సింహాచలం, విశాలి, చిన్నయ్య, వివిధ జిల్లాల టిఎస్ యుటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, వేలాది మంది ఉద్యోగులు పాల్గొన్నారు.

# డిలిమినేషన్ పై చర్చకు రావాలి

- రఘునందన్ రావు సవాల్

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
కాంగ్రెస్ పార్టీకి దమ్ముంటే పార్లమెంట్‌లో డీలిమిటేషన్ పై కేంద్రం నిర్వహించతలపెట్టిన చర్చకు ముందుకు రావాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ అనేది ఎన్నికల అంశం కాదన్న ఆయన ఇప్పటికే దానిని పార్లమెంట్‌లో అన్ని పార్టీల దృష్టికి తీసుకువచ్చామని చెప్పారు. నియోజక వర్గాల పునర్విభజనతో దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందన్న సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలపై ఆయన స్పందించారు. ఈ మేరకు గురువారం ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. ముందుగా రేవంత్ రెడ్డి ఒక మంచి లెక్కల టీచర్‌ను పెట్టుకోవాలని సలహా ఇచ్చారు. ప్రస్తుతం డీలిమిటేషన్‌లో భాగంగా ఉన్న స్థానాల్లో సగం స్థానాలు పెరుగుతాయని స్పష్టత ఇచ్చారు. మొదటి నుంచి నరేంద్ర మోడీ ఏది చేసినా కాంగ్రెస్ పార్టీ గుడ్డిగా వ్యతిరేకించడమే పనిగా పెట్టుకుందని విమర్శించారు. ఉత్తరాదిన జనాభా ఎక్కువగా ఉంది కాబట్టి అక్కడ సీట్లు పెరుగుతాయని, దక్షిణాదిన సీట్లు తగ్గుతాయని చెప్పారు. ఇలా అర్థం లేని వాదనలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. జనాభా ప్రాతిపదికన నియోజక వర్గాల పునర్విభజన చేస్తామన్నా వ్యతిరేకించారని ఆరోపించారు. ఇప్పుడు 50 శాతం సీట్లు పెంచుతామంటే ఒప్పుకోమంటున్నారని మండిపడ్డారు.

# రెవెన్యూ డివిజన్ స్థాయిలో ప్రజావాణి

- కార్యాచరణ రూపకల్పనకు సీఎం ఆదేశాలు
- ఒకే పోర్టల్ లో అన్ని పథకాల వివరాలు
- ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే బృందంతో సీఎం భేటీ



**ముద్ర, తెలంగాణ బ్యూరో :**
ప్రజా సమస్యల పరిష్కారానికి అమలు చేస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయిలో కూడా నిర్వహించడానికి సంబంధించి అవసరమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని సీఎం రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.ప్రముఖ సామాజిక కార్యకర్త నిఖిల్ డే నేతృత్వంలోని ప్రతినిధి బృందం సీఎంతో గురువారం శాసనమండలి సమావేశ హాలులో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఈ సందర్భంగా ప్రజా సమస్యల పరిష్కారానికి అనుసరిస్తున్న విధానాలు, ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను నిఖిల్ డే ప్రశంసించారు. తెలంగాణలో ప్రస్తుతం రాష్ట్ర స్థాయిలో చేపడుతున్న ప్రజావాణి కార్యక్రమాన్ని రెవెన్యూ డివిజన్ స్థాయికి తీసుకెళ్లడంపై ఈ సమావేశంలో చర్చించారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అన్ని పథకాలకు సంబంధించిన వివరాలను ఒకే చోట అందుబాటులో ఉండే విధంగా ఈ పోర్టల్ రూపొందించనున్నారు. ఈ చట్టం దేశంలోనే చారిత్రాత్మకంగా నిలుస్తుందని అన్నారు. ఈ సమావేశంలో తెలంగాణ ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావుతో పాటు ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
www.mudranews.in
@mudranews
mudratv
27.03.2026 శుక్రవారం, హైదరాబాద్



నా తెలంగాణ కోటి రతనాల వీణ అన్నాడు 'దాశరథి'.. నైజాం పాలనలో 'బండెనక బండి కట్టి'.. పాటలతో ఉద్యమాన్ని రగిలించిన నేల ఇదీ.. తెలంగాణ రక్తంలోనే కవిత్వం ఉంది.. కవులు, కళాకారులకు ఈ నేల పుట్టినిల్లు.. అందుకే మీలోని రచయితను మేల్కొలపండి.. కవితలు, వ్యాసాలు, సంపాదకీయాలు ఏవైనా సరే.. మేం ప్రచురిస్తాం.. మన 'ముద్ర'లో ఎడిటోరియల్‌గా మీ భావాలను వ్యక్తీకరించండి..

మీ 'ముద్ర' వేయండి

మీ రచనలు పంపాల్సిన వాట్సాప్ నం.: +91 98496 23744
అలాగే ఈ-మెయిల్ కూడా చేయొచ్చు: mudradaily@gmail.com

# జగదబి రాముడు శ్రీ రాముడే

## మార్చి 27 న శ్రీరామ నవమి సందర్భంగా

రామ కథను వినరయ్య శ్రీ రామ కథను వినరయ్య అయోధ్య నగరానికి రాజు దశరత మహారాజు ఆ రాజుకు నలుగురు కుమారులు ఆ ఆ అంటూ చిన్ననాటి నుండి లవ కుశ సినిమా లో పాటలు వింటాం పాడతాం ఆ సినిమా చూస్తే రామాయణం అంతా అర్ధము అవుతూ ఉంది ప్రతీ ఒక్కరూ



రాముణ్ణి ఆదర్శం గా తీసుకుంటారు ర రా అక్షరాల తో పేర్లు పెట్టుతూ ఉంటారు మనం జరుపుకునే పండగల్లో ముఖ్య పండగ శ్రీ రామ నవమి ప్రధానంగా హిందూ పండుగ , ఇది శ్రీరాముని జన్మదినోత్సవాన్ని తెలుపుతుంది .చైత్ర మాసం లోని శుక్ల పక్షంలోని తొమ్మిదవ రోజున జరుపుకుంటారు.శ్రీ రామ నవమి మార్చి 27 న జరుపుకుంటున్నాము

రామ కథా పఠనాలు, శ్రీరాముడికి అంకితం చేయబడిన ఊరేగింపు నిర్వహించడం, దేవాలయాలలో మరియు ఇళ్లలో ప్రార్థనలు చేయడం ముఖ్య ఉద్దేశ్యం

రామ నవమి అనేది త్రేతా యుగంలో అయోధ్యలో శ్రీరామచంద్రుని ఆవిర్భావాన్ని స్మరించుకునే హిందూ పండుగ. శ్రీకృష్ణుడు లేదా విష్ణువు రామచంద్రుడు అనే ప్రియ అవతారంగా వ్యక్తమయ్యాడని, సంస్కృతి, వీరత్వం, సూత్రాలు, నైతికత, సుపరిపాలన, వినయం మరియు త్యాగాలను ప్రతిబింబించే విభిన్న కాలక్షేపాలలో నిమగ్నమయ్యాడని వేద గ్రంథాలు ధృవీకరిస్తున్నాయి.

భారతదేశపు పురాతన గ్రంథాలన్నింటిలోనూ, భక్తులను ఆకర్షించడానికి మరియు దుష్టులను నిర్మూలించడానికి విష్ణువు వివిధ అవతారాలలో అవతరిస్తాడని నొక్కి చెప్పబడింది. లీలఅని పిలువబడే అతని కార్యకలాపాలను అతని ప్రియమైన భక్తులు గౌరవిస్తారు, జరుపుకుంటారు మరియు ధ్యానం చేస్తారు. విష్ణువు రామ అవతారం లేదా అవతారం, దేశవ్యాప్తంగా తన బోధనలను వ్యాప్తి చేయడానికి ఇటువంటి దైవిక లీలలతో వర్గీకరించబడింది.

రామ నవమి అనేది భారతదేశం అంతటా, ముఖ్యంగా రాముడి జన్మస్థలమైన ఉత్తర ప్రదేశ్‌లోని పవిత్ర నగరమైన అయోధ్యలో, భగవంతుడు మానవ మరియు దైవిక రూపాల్లో కనిపించడాన్ని సూచిస్తుంది. రామ నవమికి ముందు, హిందువులు చైత్ర నవరాత్రి సమయంలో తొమ్మిది రోజుల ఉపవాసం ఉంటారు, మద్యం, ధూమపానం మానేయడం మరియు శరీర నిర్విషీకరణ కోసం ప్రార్థన మరియు ధ్యానంలో పాల్గొంటూ సాత్విక శాఖాహార ఆహారాన్ని తీసుకుంటారు. తొమ్మిదవ మరియు చివరి రోజున, అయోధ్య మరియు భారతదేశంలోని ఇతర నగరాలు ప్రార్థన మరియు వేడుకలలో మునిగి తేలే వధువులా అలంకరించబడతాయి. రామ నవమి రాముడి జీవితంలోని ప్రతి అంశాన్ని గౌరవిస్తుంది.


**రామ నవమి వెనుక చరిత్ర**

హిందూ పురాణాల ప్రకారం, శ్రీరాముడు ఈ రోజున అయోధ్యలో జన్మించాడని విస్తృతంగా నమ్ముతారు. మరికొందరు భక్తులు శ్రీరాముడు విష్ణువు యొక్క అవతారమని, ఈ రోజున స్వర్గం నుండి శిశువుగా అయోధ్యకు దిగివచ్చాడని నమ్ముతారు.ఈ రోజున ప్రజలు సాధారణంగా దేవాలయాలను సందర్శించి ఆశీస్సులు పొందుతారు. అయోధ్య వంటి ప్రదేశాలలో, రాముడి చిన్న విగ్రహాలను ఊయల మీద ఉంచి ఊరేగింపులు నిర్వహిస్తారు. చాలా దేవాలయాలు "హవన"ను నిర్వహిస్తాయి ఇది మనస్సు, శరీరం మరియు ఆత్మను శుద్ధి చేసే లక్ష్యంతో అగ్నికి సంబంధించిన ఆచారం. పూజారులు భక్తులకు "ప్రసాదం" రూపంలో స్వీట్లు మరియు పండ్లను పంపిణీ చేస్తారు. సాధారణంగా, భక్తులు అర్ధరాత్రి వరకు రోజంతా ఉపవాసం ఉంటారు. సాధారణంగా స్వీట్లు మరియు పండ్లు తినడం ద్వారా ఉపవాసం విరమిస్తారు.

రామలీల —— రాముడు రావణుడిని ఓడించిన నాటక చిత్రణ దేశంలోని అనేక ప్రాంతాలలో ప్రదర్శించబడుతుంది. ఈ నాటకాన్ని సాధారణంగా బహిరంగ వేదికపై ప్రదర్శిస్తారు.

ఈ పండుగ దేశవ్యాప్తంగా జరుపుకున్నప్పటికీ, ప్రధాన వేడుకలు అయోధ్య, భద్రాచలం, రామేశ్వరం మరియు సీతామర్హిలలో జరుగుతాయి. ఈ రోజున రాముడితో పాటు, సీత, లక్ష్మణుడు మరియు హనుమంతుడి దేవతలను కూడా పూజిస్తారు.దేశ వ్యాప్తము గా ప్రతీ గ్రామం లో శ్రీ రామ నవమి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు సీతా రామ కళ్యాణం నిర్వహిస్తారు జై శ్రీ రామ్ నినాదాల తో మారు మోగుతూ వుంది మన రాష్ట్రం లో భద్రా చలం లో ఆంధ్ర ప్రదేశ్ లో ఒంటి మిట్ట లో సీతా రాముల కళ్యాణం పట్టాబిషేకము ఘనమూగ నిర్వహిస్తారు ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారు

కామిడి సతీష్ రెడ్డి భూపాల్ పల్లి జిల్లా
9848445134



# సీతా రాముల కళ్యాణం చూతం రారండి



శ్రీరామ నవమి హిందువుల ముఖ్యమైన పండుగలలో ఒకటి. ఈ పండుగను ప్రతి సంవత్సరం చైత్ర మాస శుక్ల పక్ష నవమి తిథిన జరుపుకుంటారు. ఈ రోజు భగవాన్ శ్రీరాముడు జన్మించిన పవిత్రమైన రోజు. శ్రీరాముడు ధర్మానికి ప్రతీకగా, సత్యనిష్ఠకు చిహ్నంగా, ఆదర్శపురుషుడిగా భావించబడతాడు. అందుకే ఆయనను "మర్యాద పురుషోత్తముడు" అని కూడా పిలుస్తారు.శ్రీరామ నవమి పండుగను భారతదేశమంతటా ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకుంటారు. ముఖ్యంగా ఆలయాలలో ప్రత్యేక పూజలు, హోమాలు, భజనలు నిర్వహిస్తారు. రామాయణ పారాయణం చేయడం ఈ రోజు ముఖ్యమైన ఆచారం. తెలంగాణలో భద్రాచలం, ఇల్లంతకుంట, ఆంధ్ర ప్రదేశ్ లోని ఒంటిమిట్ట దేవాలయాల్లో శ్రీసీతారామ కళ్యాణం ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా భక్తుల సమక్షంలో ఈ కళ్యాణ మహోత్సవం ఎంతో వైభవంగా జరుగుతుంది. ప్రజలు కుటుంబ సమేతంగా ఈ వేడుకలో పాల్గొని ఆనందిస్తారు.శ్రీరాముడి జీవితం మనకు అనేక పాఠాలను నేర్పుతుంది. ఆయన తండ్రి మాట కోసం రాజ్యాన్ని వదలి అడవికి వెళ్లడం, సీతాదేవి కోసం రాక్షస రాజు రావణుడితో యుద్ధం చేయడం వంటి సంఘటనలు ఆయన ధైర్యం, నిబద్ధత, కర్తవ్యబోధను తెలియజేస్తాయి. ఆయన జీవితం మనకు సత్యం, ధర్మం, క్షమ, సహనం వంటి గుణాలను అలవాటు చేసుకోవాలని సూచిస్తుంది.ఈ పండుగ ద్వారా మనం కుటుంబ విలువలను, నైతికతను గుర్తుచేసుకుంటాం. సమాజంలో మంచి ఆచారాలను ప్రోత్సహించేందుకు ఇది ఒక మంచి అవకాశం. పిల్లలకు రామాయణంలోని కథలను చెప్పడం ద్వారా మంచి విలువలను నేర్పించవచ్చు.శ్రీరామ నవమి సందర్భంగా కొన్ని ప్రాంతాలలో పానకం, వడపప్పు వంటి ప్రసాదాలను తయారు చేసి భక్తులకు పంచుతారు. వేసవి కాలంలో ఈ పానీయాలు శరీరానికి చల్లదనం ఇస్తాయి. ఇది ఆరోగ్యపరంగా కూడా మంచిదే.మొత్తానికి, శ్రీరామ నవమి పండుగ భక్తి, శ్రద్ధ, ఆనందం కలయిక. ఇది కేవలం ఒక పండుగ మాత్రమే కాకుండా,మన జీవితాన్ని సన్మార్గంలో నడిపించే ఒక స్ఫూర్తి. మనం శ్రీరాముడి మార్గాన్ని అనుసరించి సత్యం, ధర్మం పాటిస్తే సమాజం సుఖశాంతులతో నిండిపోతుంది. శ్రీరామ నవమి మనకు ఆధ్యాత్మికతతో పాటు సద్గుణాలను పెంపొందించే ఒక మహత్తర పండుగ.



ఆళవందార్ వేణు మాధవ్
8686051752,హైదరాబాద్



# బలవంతుల 'చుట్టాలా'?

- **అట్రాసిటీ చట్టం నీరుగారుతోందా?**
- **అణగారిన వర్గాల రక్షణ కవచాలకు పదును తగ్గుతోందా?**

తెలంగాణ శాసనసభ బడ్జెట్ సమావేశాలు కేవలం ఆర్థిక లెక్కలకే పరిమితం కాకుండా, రాష్ట్ర సామాజిక ముఖచిత్రాన్ని మార్చే కీలక బిల్లుల ఆమోదానికి వేదికయ్యాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కేబినెట్ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందించిన హేట్ స్పీచ్ నిరోధక బిల్లు, గిగ్ వర్కర్ల సంక్షేమం, తల్లిదండ్రుల మద్దతు బిల్లు మరియు అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు వంటివి అసెంబ్లీలో సుదీర్ఘ చర్చల అనంతరం ఆమోదం పొందాయి. అయితే, చట్టసభలు ముక్తకంఠంతో ఆమోదముద్ర వేస్తున్న ఈ చట్టాలు క్షేత్రస్థాయిలో సామాన్యుడి కన్నీరు తుడిచే అస్త్రాలుగా మారుతాయా? లేక గత అనుభవాల రీత్యా అగ్రవర్ణాలకు, రాజకీయ బలవంతులకు అనుకూలమైన 'చుట్టాలుగా' మిగిలిపోతాయా? అన్నదే ఇప్పుడు మేధావుల ముందున్న ప్రధాన ప్రశ్న.

**చట్టం పదును - అమలులో వైఫల్యం**

సభలో ప్రవేశపెట్టిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్ ప్రివెన్షన్ బిల్లు 2026' విద్వేషపూరిత ప్రసంగాలను, మత కలహాలను ప్రేరేపించే వారిని కట్టడి చేయడానికి ఉద్దేశించినదే. కానీ, ఇలాంటి చట్టాలు కేవలం ప్రతిపక్షాల గొంతు నొక్కడానికో లేదా సామాన్యుల భావప్రకటన స్వేచ్ఛను హరించడానికో ఆయుధాలుగా మారుతాయనే భయం ప్రజల్లో బలంగా ఉంది. మరోవైపు, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల బాధ్యతను విస్మరించిన ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగుల వేతనాల నుండి 15 శాతం కోత విధించి వారికి అందజేసే 'తల్లిదండ్రుల మద్దతు బిల్లు' మానవీయ కోణంలో అద్భుతమైనదే అయినా, అది కుటుంబ వ్యవస్థలోకి పోలీసుల జోక్యానికి దారితీస్తుందన్న విమర్శలు కూడా ఉన్నాయి. గిగ్ వర్కర్ల కోసం తెచ్చిన కొత్త చట్టం ద్వారా 4.2 లక్షల మంది అసంఘటిత కార్మికులకు చట్టబద్ధమైన గుర్తింపు, సామాజిక భద్రత లభించడం హర్షించదగ్గ పరిణామం.

**అట్రాసిటీ చట్టం.. నీరుగారుతున్న రాజ్యాంగ స్ఫూర్తి?**

అసెంబ్లీలో కొత్త చట్టాలపై చర్చ జరుగుతున్న వేళ, సామాజిక వర్గాల్లో వినిపిస్తున్న ప్రధాన ఆవేదన 'ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ నిరోధక చట్టం' అమలుపైనే. రాజ్యాంగం కల్పించిన ఈ కఠిన చట్టం ప్రకారం కేసు నమోదైతే నిందితుడికి ముందస్తు బెయిల్ లభించడం అసాధ్యం. కానీ, నేడు రాజకీయ ప్రభావం



ఉన్న చోట పరిస్థితి అత్యంత దారుణంగా ఉంది. పోలీస్ స్టేషన్లపై దాడులు చేసి నిందితులను విడిపించుకుపోతున్నా, బహిరంగంగా బాధితులను బెదిరిస్తున్నా పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోంది. అరెస్టులు ఉండవు, పైగా ఉన్నత న్యాయస్థానాల నుండి 'ప్రొటెక్షన్' లేదా 'స్టే' ఆర్డర్లు తెచ్చుకోవడం బలవంతులకు వెన్నతో పెట్టిన విద్యగా మారింది. చట్టం ధనవంతుల కోసం తన రూపు మార్చుకుంటోందనడానికి ఇవే నిదర్శనాలు. అణగారిన వర్గాల కోసం రూపొందించిన చట్టాలు నేడు అగ్రకులాలకు అండగా నిలుస్తున్నాయనే ఆవేదన దళిత, గిరిజన మేధావుల్లో వ్యక్తమవుతోంది.

**రాజకీయ కోణం - బెయిల్ సవరణల మతలబు**

చట్టాలను సవరించడం ద్వారా నిందితులకు అనుకూలంగా బెయిల్ వచ్చేలా లొసుగులు సృష్టిస్తున్నారన్న ఆరోపణలు తీవ్రంగా ఉన్నాయి. ఒకప్పుడు అట్రాసిటీ కేసు అంటేనే నేరస్తులు భయపడే పరిస్థితి ఉండేది, కానీ ఇప్పుడు రాజకీయ పలుకుబడి ఉంటే ఏ చట్టాన్నైనా మేనేజ్ చేయవచ్చన్న ధీమా పెరిగిపోయింది. అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు వంటివి న్యాయవాదులకు రక్షణ కల్పించినా, సామాన్య బాధితుడికి న్యాయం చేకూర్చడంలో ఇవి ఎంతవరకు తోడ్పడతాయనేది ప్రశ్నార్థకమే. చట్టం ముందు అందరూ సమానమే అన్న సూత్రం పోలీస్ స్టేషన్ గడప దాటి లోపలికి వెళ్లడం లేదని సామాన్యులు వాపోతున్నారు.

**మార్పు ఎక్కడ రావాలి?**

అసెంబ్లీలో బిల్లులు ఆమోదం పొందడం ఒక ఎత్తు అయితే, అవి నిజాయితీగా అమలు కావడం మరో ఎత్తు. రోహిత్ వేముల చట్టం విధివిధానాల కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం వేయడం మంచిదే, కానీ విద్యాలయాల్లో వివక్ష పోవాలంటే కేవలం కమిటీలు చాలవు, పటిష్టమైన అమలు యంత్రాంగం మరియు సామాజిక చైతన్యం కావాలి. చట్టం అనేది బలవంతుడి పాదాలకు తొడిగే చెప్పు కాకూడదు, అది బలహీనుడి కన్నీరు తుడిచే కర్చీఫ్ కావాలి. రాజకీయ జోక్యం లేని పోలీసు వ్యవస్థ, నిష్పక్షపాతమైన న్యాయ విచారణ జరిగినప్పుడే ఈ కొత్త చట్టాలకు సార్థకత లభిస్తుంది. లేదంటే సామాన్యుడికి చట్టం మీద నమ్మకం పోయి, అరాచకత్వం పెరిగే ప్రమాదం ఉంది.

వెంక గారి భూమయ్య సీనియర్ జర్నలిస్ట్
విశ్లేషణ 9848559863a

**నిరర్థక స్క్రోలింగ్‌ను తగ్గించండి**

సరదా కోసం నిరంతరం స్క్రోలింగ్ చేయడం ఆనందాన్ని తగ్గిస్తుంది.

## సంక్షిప్తంగా..

### పాఠశాలకు మైక్ సెట్ వితరణ

**ముద్ర, గద్వాల:**

ధరూర్ మండలం వామన్ పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు గ్రామ సర్పంచ్ పర్నికా కృపాకర్ రెడ్డి మైక్ సెట్ వితరణ చేశారు. గురువారం పాఠశాలలో నిర్వహించిన వార్షికోత్స కార్యక్రమంలో మైక్ సెట్ ను విద్యార్థుల సమక్షంలో ప్రధానోపాధ్యాయులు ముస్తాక్ కు అంద జేశారు. అంగన్ వాడి టీచర్ శోభారాణి గ్రామ ఉపసర్పంచ్ శిరీషరాజు, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### గురుకుల ఫలితాల్లో మెరిసిన విద్యార్థులు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన మొదటి విడత గురుకుల ఫలితాల్లో తుడుకుర్తి ఎంపీపీఎస్ విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. ఈ పాఠశాల నుండి మొత్తం 9 మంది విద్యార్థులు గురుకుల సీట్లను సాధించారు. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే తో పాటు హెచ్ఎం రమావతి, ఉపాధ్యాయులు రాజేందర్ రెడ్డి, నహీదా, మాధవి, హరీష్ విద్యార్థులను అభినందించారు.

### దరఖాస్తులకు గడువు పొడిగింపు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

ఎస్సీ యాక్షన్ ప్లాన్ ఫేజ్-1 కింద స్వయం ఉపాధి పథకాల కోసం దరఖాస్తు గడువును ఏప్రిల్ 2 వరకు పొడిగించినట్లు ఎస్సీ కార్పొరేషన్ ఈడి ఎస్. గోపాల్ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు టీజీఓబీఎంఎంఎస్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

### అసెంబ్లీని సందర్శించిన విద్యార్థులు

**ముద్ర, మల్కాజిగిరి:**

అల్వాల్ పరిధిలోని ప్రభుత్వ జిల్లా ఉన్నత పాఠశాల విద్యార్థులు గురువారం అసెంబ్లీని సందర్శించారు. ఇటీవల ఈ పాఠశాలను సందర్శించిన మల్కాజ్‌గిరి ఎమ్మెల్మే మర్రి రాజశేఖర్ రెడ్డి విద్యార్థులకు ఇచ్చిన మాట ప్రకారం ఈ సందర్భన ఏర్పాటు చేశారు. అసెంబ్లీ కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించిన విద్యార్థులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని ఎమ్మెల్యే సూచించారు. హెచ్ఎం లక్ష్మణ్, ఇతర బోర్డు సభ్యులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

### జర్నలిస్టు సంఘం సభ్యత్వాల నమోదు

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి:**

పాలమూరు జర్నలిస్టుల సంక్షేమ సంఘం సభ్యత్వాల నమోదు ప్రక్రియ ప్రారంభించినట్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వాకిట అశోక్ కుమార్, మల్లు మధుసూదన్ రెడ్డి తెలిపారు. గురువారం మహబూబ్ నగర్ లో సంఘం సభ్యులు మొదటగా సభ్యత్వం తీసుకొని సభ్యత్వాల నమోదు ప్రక్రియను ప్రారంభించినట్లు వెల్లడించారు.

### అన్నప్రసాదం పంపిణీ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

శ్రీరామనవమి పురస్కరించుకొని రాంనగర్ కాలనీలో ఉన్న శ్రీ సీతారామ చంద్ర స్వామి కళ్యాణోత్సవం అనంతరం భక్తులకు అన్నప్రసాద పంపిణీ నిర్వహించనున్నట్లు మున్నూరు కాపు తాలూకా సంఘం అధ్యక్షుడు తీగల సుభాష్, కార్యదర్శి పాలమూరు సతీష్, కోశాధికారి తీగల జగదీష్ తెలిపారు.

# సలేశ్వరం జాతర ఏర్పాట్లు

**–కలెక్టర్ బాదావత్ సంతోష్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



లింగాల మండల పరిధిలోని నల్లమల అడవిలో వెలసిన లింగమయ్య స్వామి ఆలయంలో జరగనున్న సలేశ్వరం జాతరకు జిల్లా యంత్రాంగం విస్తృత స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. ఏప్రిల్ 1 నుంచి 3 వరకు జరిగే ఈ జాతరకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు భారీగా తరలివచ్చే అవకాశమున్నందున అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. గురువారం అధికారులతో కలిసి నల్లమల అటవీ ప్రాంతాన్ని సందర్శించి జాతర ఏర్పాట్లు, ట్రెక్కింగ్ మార్గాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అడవిలోని క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రతి సంవత్సరం భక్తుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో ఈసారి మరింత రద్దీ ఉండే అవకాశముందని తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తాగునీటి సరఫరా, వైద్య సేవలు, తాత్కాలిక శిబిరాలు, భద్రతా ఏర్పాట్లు వంటి అంశాలను సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. అడవి మార్గాల్లో స్పష్టమైన మార్గదర్శక బోర్డులు ఏర్పాటు చేయడం, ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక సూచనలు ఉంచడం, అవసరమైన చోట్ల సిబ్బందిని నియమించడం వంటి చర్యలు చేపట్టాలని సూచించారు. శుభ్రత నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, చెత్త నియంత్రణ చర్యలు తీసుకోవాలని తెలిపారు. వైద్య బృందాలు, అత్యవసర సేవల సిబ్బందిని, అగ్నిప్రమాదాల నివారణ కోసం ఫైర్ సిబ్బంది, ఫైర్ ఇంజిన్లను అందుబాటులో ఉంచాలన్నారు. పోలీస్ శాఖ ద్వారా ప్రత్యేక ఔట్ పోస్ట్ ఏర్పాటు చేసి భద్రత కట్టుదిట్టం చేయాలని సూచించారు. తప్పిపోయిన భక్తులను గుర్తించి కుటుంబ సభ్యులకు చేరవేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వేసవి పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా విస్తరించడం, చల్లని నీడ కల్పించే శిబిరాలు ఏర్పాటు చేయడం, విశ్రాంతి కోసం తాత్కాలిక షెడ్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని సూచించారు. మహిళలకు ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. భక్తుల భద్రత దృష్ట్యా గర్భిణులు, వృద్ధులు, శ్వాసకోశ వ్యాధులతో బాధపడుతున్న వారు జాతరకు రాకుండా ఉండాలని విజ్ఞప్తి చేశారు. నల్లమల అడవిలోని ట్రెక్కింగ్ మార్గాలు, ఎత్తైన ప్రదేశాలు, అధిక ఉష్ణోగ్రత కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉందని తెలిపారు. జిల్లా యంత్రాంగం సమగ్ర ప్రణాళికతో ముందుకు సాగుతోందని స్పష్టం చేశారు. జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర, అదనపు ఎస్పీ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## స్పోర్ట్స్ స్కూల్‌ప్రవేశాలకు జిల్లా స్థాయి ఎంపికలు



**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**

తెలంగాణ ప్రభుత్వం జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో స్పోర్ట్స్ స్కూల్, హకీంపేట్‌లో 2026-27 విద్యా సంవత్సరానికి నాల్గవ తరగతి ప్రవేశాల కోసం జిల్లా స్థాయి ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా యువజన మరియు క్రీడల అధికారి వి. సీతారాం తెలిపారు. ఈ నెల 30 న నాగర్ కర్నూల్ పట్టణంలోని జిల్లా పరిషత్ హైస్కూల్(బాలుర) క్రీడా మైదానంలో నిర్వహించబడతాయని తెలిపారు. సెప్టెంబర్ 1 2017 నుంచి ఆగస్టు 31, 2018 మధ్య జన్మించిన బాల, బాలికలు ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. ప్రతి విభాగంలో 10మంది బాలురు, 10మంది బాలికలను ఎంపిక చేయనున్నారు. పాఠశాల నుండి 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, స్టడీ సర్టిఫికెట్, ఎమ్మార్వో/మున్సిపాలిటీ ధృవీకరణ పత్రం, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, సర్టిఫికెట్లు ఒటరిజినల్స్‌తో పాటు రెండు జతల జిరాక్స్ కాపీలు, ఎత్తు, బరువు, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్, వర్టికల్ జంప్, స్టాండింగ్ బ్రాడ్ జంప్, మెడిసిన్ బాల్ త్రో, 30 మీటర్ల ఫ్లైయింగ్ స్టార్ట్, 6×10 మీటర్ల షటిల్ రన్, 800 మీటర్ల పరుగు పందెం వంటి పరీక్షలు నిర్వహించబడతాయని తెలిపారు. అర్హత గల విద్యార్థులు నిర్ణీత తేదీన హాజరై ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

## నేషనల్ గ్రీన్ కార్ప్స్ తో డిగ్రీ కళాశాలల ఎంఓయూ

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



జిల్లాలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు కీలక నిర్ణయం తీసుకున్నాయి. నేషనల్ గ్రీన్ కార్ప్స్ తెలంగాణ డైరెక్టర్ డబ్ల్యూ.జి. ప్రసన్నకుమార్ ను నాగర్ కర్నూల్ ప్రభుత్వ సైన్స్ డిగ్రీ కళాశాల, నోడల్ కళాశాల, ప్రిన్సిపల్ మదన్ మోహన్ కలిసి భేటీ అయినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాలోని ఏడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు నేషనల్ గ్రీన్ కార్ప్స్ తెలంగాణ శాఖతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నట్లు వెల్లడించారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థుల్లో పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం, పచ్చదనం ప్రోత్సాహం, స్వచ్ఛత కార్యక్రమాలు, వృక్షారోపణ వంటి కార్యక్రమాలను సంయుక్తంగా నిర్వహించనున్నారు. ప్రిన్సిపల్ మదన్ మోహన్ మాట్లాడుతూ ఈ ఒప్పందంతో కళాశాలల్లో గ్రీన్ క్లబ్ కార్యకలాపాలు మరింత చురుకుగా సాగడంతో పాటు విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై ప్రాయోగిక శిక్షణ అందే అవకాశం ఉంటుందని తెలిపారు. అలాగే నేషనల్ గ్రీన్ కార్ప్స్ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి శిక్షణా శిబిరాలు, అవగాహన కార్యక్రమాలు, పర్యావరణ దినోత్సవాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనే అవకాశాలు కల్పించబడతాయన్నారు. ఈ చర్యల ద్వారా యువతలో పర్యావరణంపై బాధ్యతాభావం పెంపొందించి, సమాజంలో పచ్చదనం పరిరక్షణకు తోడ్పడేలా ప్రోత్సహించడమే లక్ష్యమని ఆయన వివరించారు.

## ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై ఖాళీ సిలిండర్లతో ధర్నా

**ముద్ర, తాండూర్:**





తాండూర్ పట్టణంలోని ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ పక్కనే ఉన్న అంబా భవాని గ్యాస్ ఏజెన్సీ వద్ద వంట గ్యాస్ సిలిండర్ల కోసం రోడ్డుకు అడ్డంగా ఖాళీ సిలిండర్లతో బైఠాయించి ఆందోళన చేశారు. బుకింగ్ చేసుకున్నా గ్యాస్ సరఫరా చేయడం లేదని వినియోగదారులు ఆందోళనకు దిగారు. రోడ్డుపైన అరగంట సేపు రాకపోకలు స్తంభించిపోయాయి. పట్టణ సిఐ సంతోష్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకొని ధర్నాకు దిగిన వినియోగదారులకు సర్ది చెప్పి రోడ్డుకు అడ్డంగా ఉంచిన సిలిండర్లను తొలగింప చేసి వాహనాలు ప్రయాణించేందుకు ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## విద్యుత్ ఆర్టిజన్ కార్మికుల ధర్నా

**సమస్యలు పరిష్కరించాలని డిమాండ్**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



తెలంగాణ విద్యుత్ ఆర్టిసన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం నాగర్ కర్నూల్ డివిజన్ కార్యాలయం ఎదుట ఆర్టిజన్ మరియు పీస్ రేట్ కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్-82 రాష్ట్ర ఉపాధ్యక్షుడు దశరథం మాట్లాడుతూ తెలంగాణ విద్యుత్ శాఖలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఏపీఎస్ఈబీ సర్వీస్ రూల్స్‌ను ఆర్టిజన్ కార్మికులకు వర్తింపజేయాలని, విద్యార్హతల ఆధారంగా వారిని రెగ్యులర్ పోస్టుల్లోకి మార్చాలని కోరారు. అలాగే పీస్ రేట్ కార్మికులకు జీఓ నెం.11 ప్రకారం వేతనాలు చెల్లించాలన్నారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను విద్యుత్ శాఖ యాజమాన్యం తక్షణమే పరిష్కరించకపోతే సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. కార్మికుల సమస్యల పరిష్కారంలో యాజమాన్యం చొరవ చూపాలని, లేనిపక్షంలో సమ్మెకు ట్రేడ్ యూనియన్ల పూర్తి మద్దతు ఉంటుందని వారు స్పష్టం చేశారు. ధర్నాకు మద్దతుగా 327 యూనియన్ జిల్లా కార్యదర్శి లాలయ్య, డివిజన్ అధ్యక్షుడు లక్ష్మయ్య, 1104 యూనియన్ జిల్లా కార్యదర్శి నిరంజన్ యాదవ్, హెచ్-82 యూనియన్ జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్, ఎస్సీ, ఎస్టీ యూనియన్ డివిజన్ కార్యదర్శి నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నాగర్ కర్నూల్ జేఏసీ డివిజన్ చైర్మన్ మిద్దె శ్రీనివాసులు, కన్వీనర్లు జయాకర్, మల్లయ్య, జేఏసీ కంపెనీ నాయకులు సైదులు, డివిజన్ నాయకులు ప్రభాకర్, శంకర్, జితేందర్ రెడ్డి, నాగరాజు, వెంకటయ్య, రాజు, రంజిత్ కుమార్, అమర్నాథ్ తదితరులు పాల్గొన్నారు.


## ఓట్ల కోసమే మాజీ మంత్రి రాజకీయ డ్రామా

**- పేదల భోజనం షెడ్ పడగొట్టిందే మాజీ మంత్రి**

**- పేదలంటే ఇప్పుడు గుర్తుకొచ్చారా..**

**- పాలమూరు మున్సిపల్ డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి**

**ముద్ర, ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి :**



తన హయాంలో పేదలు భోజనం చేసే కొత్త భవనం కూల్చి వేసి అధికారం పోయిన వెంటనే భోజన శాల చినిగిన టెంట్ చూపిస్తూ రాజకీయ డ్రామా ఆడుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పద్ధతి మార్చుకోవాలని పాలమూరు మున్సిపల్ డిప్యూటీ మేయర్ మారేపల్లి సురేందర్ రెడ్డి హితవు పలికారు. గురువారం రేకులతో షెడ్ వేయించి స్థానిక మేయర్ గుమాల మమత ప్రారంభించి అక్కడే భోజనం చేశారు. అనంతరం సురేందర్ రెడ్డి మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ భోజనం చేసేందుకు రూ. కోటి తో భవనాన్ని నిర్మించారని, ఇది నిర్మించిన కొద్ది రోజులకే మాజీ మంత్రి కూల్చి వేయించారని పేర్కొన్నారు. భవనం కూల్చి తాత్కాలికంగా టెంట్ వేశారని, ప్రస్తుతం దానికి రంధ్రాలు పడడంతో భోజనం చేసేవారికి నీడ కరువైందని ఆయన మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మాజీ మంత్రి కి పేదలంటే ప్రేమ కాదని, ఆయనకు వారిపై ఉన్నది ఓట్ల డ్రామా అని అన్నారు. ఈ నియోజకవర్గం ప్రజలు ఆయనను ఛీ కొట్టినా ఇంకా మార్పు రాలేదన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి సహకారం తో భోజనం చేసే వద్ద ఒక్క రోజులోనే కొత్త షెడ్ వేయించామన్నారు. కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, నేతలు మున్నూర్ రవి, మైత్రి యాదయ్య, రాములు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు మోసిన్, ప్రవీణ్ కుమార్, కిషన్ నాయక్, రమేష్ రెడ్డి, పెద్ద గొల్ల నర్సింహులు,సందీప్, గూడెం ఆంజనేయులు, సంజీవ్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న ఎంపీ ఈటల రాజేందర్



**ముద్ర, మల్కాజిగిరి:**

హుజురాబాద్ పర్యటన ముగించుకుని హన్మకొండకు వెళ్తున్న సమయంలో ఈటల రాజేందర్ మానవత్వాన్ని చాటుకున్నారు. మార్గమధ్యంలో ఒక ఆటో రిక్షా బోల్తాపడిన ఘటనను గమనించిన ఆయన వెంటనే తన వాహనాన్ని ఆపించి స్పందించారు. అప్రమత్తంగా వ్యవహరించిన ఈటల రాజేందర్, గాయపడిన వారికి తక్షణ సహాయం అందించి, వారిని సమీప ఆసుపత్రికి తరలించే ఏర్పాట్లు చేశారు. ఈ ఘటనను చూసిన స్థానికులు ఆయన మానవతా దృక్పథాన్ని శంసించారు. సమయస్ఫూర్తితో స్పందించిన ఈటల రాజేందర్ చర్యల వల్ల గాయపడిన వారికి వెంటనే వైద్యం అందినట్లు సమాచారం.

## ఇద్దరు అంతర్రాష్ట్ర ఫోన్ దొంగల అరెస్ట్

**ముద్ర, కూకట్‌పల్లి:**



రద్దీగా ఉండే బస్టాప్‌లలో ప్రయాణికులే లక్ష్యంగా సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్ప డుతున్న ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలను కేపీహెచ్‌బీ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. గురువారం జేఎన్టీయూ బస్టాప్ వద్ద నిర్వహించిన ప్రత్యేక 'డీకాయ్' ఆపరేషన్‌లో నిందితులు పట్టుబడ్డారు. వీరి నుంచి రూ. 1.50 లక్షల విలువైన నాలుగు మొబైల్ ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో విజయనగరం జిల్లాకు చెందిన అవుల నరేంద్ర (24) ప్రస్తుతం మీర్‌పేట్‌లో నివసిస్తున్నాడు. పశ్చిమ గోదావరి జిల్లా ఆకువీడుకు చెందిన చింత ప్రభు @ మేఖల రాజు (26) పెయింటర్. ఇరువురు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ ముఠా వెనుక ఉన్న ఇతర నెట్‌వర్క్ గురించి దర్యాప్తు కొనసాగుతోంది.

## వేం నరేందర్ రెడ్డికి ఎమ్మెల్సీ అభినందనలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



రాజ్యసభ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన వేం నరేందర్ రెడ్డిని, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణ హోటల్‌లో జరిగిన ఈ సమావేశంలో నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ వేం నరేందర్ రెడ్డి ప్రజాసేవలో మరింత ఉన్నత స్థానాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో విజయవంతంగా ముందుకు సాగాలని తమ ఆశీస్సులు తెలిపారు.

## బస్ స్టేషన్ శంకుస్థాపన చేయాలి

**ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి**

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్ :**



నాగర్ కర్నూల్‌లో కొత్తగా మంజూరైన బస్ స్టేషన్ నిర్మాణానికి తక్షణమే శంకుస్థాపన తేదీని ఖరారు చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డి కోరారు. హైదరాబాద్ అసెంబ్లీలోని కమిటీ హాల్‌లో నిర్వహించిన టీజీ ఆర్టీసీ సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొని నియోజకవర్గానికి సంబంధించిన పలు రవాణా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. తెల్కపల్లి, తిమ్మాజీపేట బస్సు డిపోల మరమ్మతులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల విన్నపం మేరకు నాగర్ కర్నూల్ నుంచి నల్గొండకు కొత్త బస్సు సర్వీసును ప్రారంభించాలని, అలాగే నియోజకవర్గంలోని కీలక మార్గాల్లో బస్సుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ సమావేశంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, టీజీ ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఎమ్మెల్యే చేసిన విజ్ఞప్తులపై మంత్రి సానుకూలంగా స్పందిస్తూ, సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## కంటి శిబిరంలో 86 మందికి పరీక్షలు

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో గురువారం పాత కలెక్టరేట్ భవనంలో కంటి చికిత్స శిబిరం నిర్వహించారు. 86 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, వారిలో 41 మంది లయన్ రాంరెడ్డి కంటి ఆసుపత్రికి తరలించినట్లు జిల్లా అంధత్వ నివారణ ప్రోగ్రాం అధికారి డాక్టర్ హెచ్. ప్రదీప్ తెలిపారు. తెలిపారు. రోగులకు ఆప్తాలమిక్ అధికారి కోట్ర బాలాజీ ప్రత్యేకంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది వై. శ్రీనివాసులు, సుకుమార్ రెడ్డి, నరసింహ, చెన్నకేశవులు, ప్రకాష్, సురేష్, ఎన్. వెంకటేశ్వర చారి, సురేష్ చారి, కళ్యాణ్, సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
శుక్రవారం 27.03.2026
www.mudranews.in | @mudranews



నెగెటివ్ కంటెంట్ ను ఫిల్టర్ చేయండి

అసలు జీవితానికి దూరంగా ఉన్న ఇన్ఫ్లుయెన్సర్లను అన్‌ఫాలో లేదా మ్యూట్ చేయండి.

# శ్రీరామ నవమికి ముస్తాబైన మహాశక్తి ఆలయం

- ఆలయంలో నేడు వైభవంగా జరగనున్న సీతారామ కల్యాణం
- భద్రాద్రి స్థాయిలో ఏర్పాట్లకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శ్రీకారం
- వేడుకల్లో పాల్గొననున్న బండి సంజయ్ దంపతులు



**ముద్ర, కరీంనగర్:** తెలుగు రాష్ట్రాల్లో శ్రీరామ నవమి వేడుకలు పేరు వినగానే భద్రాచలం గుర్తొస్తుంది. భద్రాద్రిలో అంగరంగ వైభవంగా సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలు జరుగుతాయి. వేలాది మంది భక్తులు ఆ పెళ్లి వేడుకలను స్వయంగా వీక్షించేందుకు ఎండను సైతం లెక్క చేయకుండా భద్రాద్రి వెళ్లుతారు. ఇప్పుడు భద్రాద్రి తరువాత ఆ తరహాలో సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలు జరిపేందుకు కరీంనగర్ వేదికగా మారింది. కరీంనగర్ లో రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ శ్రీకారం చుట్టారు. హంపి పీఠాధిపతి విద్యారణ్యభారతి స్వామి ఆశీస్సులతో ముగ్గురమ్మలు కొలువైన శ్రీ మహాశక్తి ఆలయాన్ని రామయ్య, సీతమ్మ పెళ్లి వేడుకల కోసం సుందరంగా ముస్తాబు చేశారు.

### చలువ పందిళ్ల ఏర్పాటు..

పెళ్లంటే పందిళ్లు, తప్పట్లు, తాళాలు, తలంబ్రాలు అనే నానుడిని నిజం చేస్తూ అమ్మవారి ఆలయంలో పెద్ద ఎత్తున చలువ పందిళ్లను ఏర్పాటు చేశారు. ఇక తప్పట్లు, తాళాలు సరేసరి. ఒకేసారి 25 వేల మంది భక్తులు ప్రత్యక్షంగా వీక్షించేలా ఎల్ ఈడీ స్క్రీన్లు అమర్చారు. సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులందరికీ వేద పండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలు అందజేయనున్నారు. ఉదయం 9 గంటలకు సీతారామచంద్రుడి పెళ్లి వేడుకలు ప్రారంభం కానున్నాయి. వేడుకలు నిర్వహించే అర్చకులు సామాన్యులకు సైతం అర్ధమయ్యేలా ఒక్కో ఘట్టాన్ని వివరించనున్నారు. మధ్యలో స్వామి వారికి గాన సేవ చేస్తారు.

### తీరొక్క పూలతో అలంకరణ...

రామయ్య-సీతమ్మ పెళ్లి వేడుకల కోసం శ్రీ మహాశక్తి ఆలయాన్ని అత్యంత సుందరంగా పూలతో ముస్తాబు చేశారు. తీరొక్క పూలతో దేవాలయాన్ని సుందరంగా అలంకరిస్తున్నారు. విద్యుత్ కాంతులతో ధగధగలాడేలా ఆలయాన్ని అందంగా తీర్చిదిద్దారు. విశాలమైన పెళ్లి పందిరిని ఏర్పాటు చేసి పూలతో అలంకరిస్తున్నారు.

### మజ్జిగ, మంచినీళ్లు సిద్ధం..

ఎండాకాలం కావడంతో నవమి వేడుకలకు హాజరయ్యే భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండేందుకు కూలర్లను ఏర్పాటు చేశారు. వచ్చే ప్రతి ఒక్క భక్తుడి దాహార్తిని తీర్చేందుకు మంచి నీళ్లు, మజ్జిగను అందుబాటులో ఉంచారు.

### 25 వేల మంది భక్తులకు అన్నదానం..

శ్రీ మహాశక్తి ఆలయంలో సీతమ్మ-రామయ్య పెళ్లి వేడుకలకు హాజరయ్యే భక్తులకు భోజన, ప్రసాదాలు సైతం అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. దాదాపు 25 వేల మంది భక్తులు నవమి వేడుకలకు హాజరవుతారని అంచనా వేస్తున్న ఆలయ నిర్వాహకులు అందరికీ సరిపడా భోజ నాలు, ప్రసాదాలను సిద్ధం చేయనున్నారు. పులిహోర, మూడు రకాల కూరలు, సాం బార్, పెరుగు, స్వీట్ సహా ప్రత్యేక వంటకా లను వడ్డించేందుకు సిద్ధమయ్యారు. భక్తులకు భోజన సమయంలో క్యూ కట్టే పనిలే కుండా ఐదు స్టాళ్లు ఏర్పాటు చేయనున్నారు.

### వేడుకలకు తరలిరండి..

శ్రీమహాశక్తి ఆలయంలో నిర్వహించే సీతారామచంద్రస్వామి పెళ్లి వేడుకలకు ప్రతి ఒక్కరూ తరలిరావాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ పిలుపునిచ్చారు. భక్తు లకు ఇబ్బందులు లేకుండా ఏర్పా ట్లు చేసినట్లు తెలిపారు. భక్తులం దరికీ వేద పండితుల ఆశీర్వచనంతోపాటు తలంబ్రాలు అందజేసేందుకు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

## ఇంధన కొరత లేదు



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** జిల్లాలో ఇంధన కొరత లేదని కలెక్టర్ అభిలాష అభినవ్ ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. యుద్ధం నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరత ఉందన్న పుకార్లు నమ్మవద్దని సూచించారు. జిల్లాలో అన్నింటి నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలిపారు. ఇటీవల కొన్ని పెట్రోల్ బంకుల వద్ద క్యూ లైన్లు కనిపిస్తున్న నేపథ్యంలో పరిస్థితిని సమీక్షించి సంబంధిత అధికారులకు తక్షణ సూచనలు జారీ చేసినట్లు వెల్లడించారు. జిల్లాలో ఇంధన కొరత ఉందంటూ వస్తున్న వార్తలు పూర్తిగా అపోహలేనని స్పష్టం చేశారు. అవసరం లేకపోయినా ప్రజలు బంకుల వద్దకు చేరుకోవడం వల్ల అనవసర రద్దీ ఏర్పడుతోందన్నారు. పెట్రోల్, డీజిల్ సరఫరా సజావుగా కొనసాగుతోందన్నారు. పెట్రల్ బంకుల అసోసియేషన్ ప్రతినిధులు కూడా తమ వద్ద తగిన నిల్వలు ఉన్నట్లు ధృవీకరించినట్లు తెలిపారు.

### ఎల్పీజీ గ్యాస్ సరఫరా సాధారణం..

జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరత లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. గ్యాస్ సిలిండర్ల బుకింగ్, సరఫరా ప్రక్రియ యథావిధిగా కొనసాగుతోందని, వినియోగదారులు ఆందోళన చెందవద్దని సూచించారు. పరిస్థితిని గమనించేందుకు అదనపు కలెక్టర్లు పలు ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. అవసరమైన చోట్ల టనే చర్యలు తీసుకునేలా అధికారులను అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు. సోషల్ మీడియా తదితర మాధ్యమాల్లో వ్యాపిస్తున్న అసత్య ప్రచారాలను నమ్మి ప్రజలు అనవసర కొనుగోళ్లకు పాల్పడవద్దని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. జిల్లా యంత్రాంగం నిరంతరం పరిస్థితిని పర్యవేక్షిస్తోందని, ప్రజలకు అవసరమైన ఇంధన వనరులు నిరంతరం అందుబాటులో ఉంటా యని భరోసా ఇచ్చారు.

## బార్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక




**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బర్ల శుభకరన్ ఎన్నికైనట్లు ప్రధాన ఎన్నికల అధికారి వోస మహేందర్, సహాయ ఎన్నికల అధికారి వంగ శ్యామ్ సుందర్ రెడ్డి ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా అబ్బడి నర్సారెడ్డి, ప్రధాన కార్యదర్శిగా కటకం అజయ్ కుమార్, సంయుక్త కార్యదర్శిగా ఆర్. రత్నం, కోశాధికారిగా చిన్నబోని అర్చన, కల్చరల్ సెక్రెటరీగా పి.వంశీ, గ్రంథాలయ కార్యదర్శిగా కె. నివేదిత ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు తెలిపారు.

## 54 సిలిండర్లు స్వాధీనం



**ముద్ర ప్రతినిధి, నిర్మల్:** నిర్మల్ పట్టణంలోని ఈద్గాం గ్యాస్ ఏజెన్సీ యజమాని ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 54 సిలిండర్లను స్వాధీనం చేసుకున్నట్లు పౌర సరఫరాల శాఖ ఏఎస్వో స్వామి తెలిపారు. అక్రమంగా నిల్వ ఉంచినట్లు సమాచారం మేరకు తనిఖీ చేశామని పేర్కొన్నారు. ఈ దాడుల్లో ఆర్ఐలు మొయినుద్దీన్, రమణ పాల్గొన్నారు.

# అడెల్లి రోడ్డు దుస్థితి ఇంకెన్నాళ్లు..?

- పూర్తికాని ఘాట్ రోడ్డు పనులు
- వాహనదారులకు తప్పని తిప్పలు



**బోథ్, ముద్ర:** ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గాన్ని నిర్మల్ జిల్లాతో అనుసంధానం చేసే బోథ్ - అడెల్లి రోడ్డు నిర్మాణ పనులు ఏళ్లు గడుస్తున్నా ముందుకు సాగడంలేదు. దీంతో ఈ మార్గం గుండా ప్రఖ్యాత అడెల్లి పోచమ్మ ఆలయ దర్శనానికి వెళ్లే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బోథ్ మండలంలోని రఘునాథ్ పూర్ అటవీ ప్రాంతంలో ఉన్న సుమారు ఆరు కిలో మీటర్ల రోడ్డు నిర్మాణం కోసం అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం 2021-22 ఆర్థిక సంవత్సరంలో నాబార్డ్ ఆర్ఐడీఎఫ్ - ఎక్స్ ఎక్స్ వీఐ కింద రూ. 9.80 కోట్లు మంజూరు చేసింది. పనులు దక్కించుకున్న కాంట్రాక్టర్ ఘాట్ కటింగ్ పనులు పూర్తి చేశారు. రోడ్డు పై మట్టి, మొరం పోయించి తాత్కాలికంగా రాకపోకలకు వీలు కల్పించారు. ఘాట్ ప్రాంతంలో రోడ్డు పూర్తి కాక పోవడంతో రోడ్డు పై గుంతలు పడి వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వర్షకాలమైతే ఈ రోడ్డు గుండా వెళ్లేందుకు జంకుతున్నారు. ఘాట్ ప్రాంతంలో సుమారు అర కిలోమీటర్ల వరకు సీసీ రోడ్డు నిర్మాణం మంజూరు అయినప్పటికీ, నిధులు విడుదల కాకపోవడంతో పనులు పెండింగ్ లో ఉన్నట్లు తెలుస్తోంది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి త్వరితగతిన ఘాట్ ప్రాంతంలో సీసీ రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

## సహకార సంఘాలు బలోపేతం కావాలి




**ముద్ర, ఆదిలాబాద్:** సహకార సంఘాల బలోపేతం ద్వారానే గ్రామీణ ఆర్థిక వ్యవస్థ పురోగతి సాధిస్తుందని కలెక్టర్ రాజర్షి షా పేర్కొన్నారు. గురువారం స్థానిక జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయంలో 98వ మహాజన సభను నిర్వహించారు. బ్యాంకు ఆర్థిక స్థితిగతులు, బడ్జెట్ అంచనాలు, ఉద్యోగుల వేతన సవరణ ఒప్పందాలపై ఆయన చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు అభివృద్ధికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సూచించారు. బ్యాంకు నిర్వహణలో పారదర్శకతను పెంచేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని తెలిపారు. బ్యాంకు ఖర్చులను తగ్గించి, లాభాల బాటలో నడిపించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో డీసీసీబీ కీలక పాత్ర పోషిస్తోందన్నారు.

## సీతారామచంద్ర స్వామి కల్యాణ ఏర్పాట్ల పరిశీలన



**ముద్ర, కరీంనగర్:** కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట సీతారామచంద్ర స్వామి ఆలయంలో నిర్వహించనున్న స్వామివారి కల్యాణ ఏర్పాట్లను గురువారం కాంగ్రెస్ పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గం ఇంచార్జి ప్రణవ్ పలు శాఖల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తైనట్లు తెలిపారు. స్వామివారి కల్యాణాన్ని వీక్షించేందుకు భారీ సంఖ్యలో భక్తులు హాజరవుతారని చెప్పారు. ఈ నేపథ్యంలో భక్తులకు జమ్మికుంట నుంచి ఇల్లందకుంట వరకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశామన్నారు. జమ్మికుంట రైస్ మిల్లర్లు, కాటన్ మిల్లర్ల ఆధ్వర్యంలో ఉచిత మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్వామి వారి కల్యాణానికి మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరై ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పిస్తారని ఆయన తెలిపారు. వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, కాటన్ రైస్ మిల్లర్ల అసోసియేషన్ సభ్యులు మల్లారెడ్డి, బి.భాస్కర్, జి.రాజమౌళి, ఎం.జితేందర్, ఎం.శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలి

- పెద్దపల్లి డీఈవో శారద



**ముద్ర, పెద్దపల్లి:** విద్యార్థులు లక్ష్యంతో ముందుకెళ్లాలని డీఈవో శారద సూచించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లి గ్రామంలోని మహేశ్వర ఫంక్షన్ హాల్లో ధర్మారం సాయి మణికంఠ మోడ్రన్ హై స్కూల్ జోష్ పేర-23 వ వార్షికోత్సవ వేడుకలను గురువారం నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన డీఈవో శారద మాట్లాడుతూ పిల్లల చదువులపై తల్లిదండ్రులు ఎప్పటికప్పుడు దృష్టి సారించాలన్నారు. పాఠశాలలకు తమ పిల్లలు వెళ్లి చదువుకుంటున్న క్రమంలో వారిపై తల్లిదండ్రులు దృష్టి సారించి వారు ఎలా విద్యను అభ్యసిస్తున్నారనే దానిని గమనించాల్సిన అవసరం ఉందని అన్నారు. ముఖ్యంగా పిల్లలను మొబైల్ ఫోన్ లకు తల్లిదండ్రులు దూరంగా ఉంచాలని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించాలని ఆమె సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎంతో ముందు జాగ్రత్తగా దూసుకెళ్లాలని ఆమె కోరారు. పెరుగుతున్న శాస్త్ర, సాంకేతిక రంగాలకు అనుగుణంగా విద్యార్థులు కూడా పోటీ పడాల్సి ఉంటుందని వివరించారు. విద్యలో ప్రతిభ కనబరిస్తే ఎంతో ఉజ్వల భవిష్య త్ ఉంటుందన్నారు. ఈ విషయాన్ని విద్యార్థులు గమనించాలని ఆమె పేర్కొన్నారు. విద్యార్థులకు చదువుతో పాటు క్రమశిక్షణ కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. గత ఏడాది పదో తరగతి లో పాఠశాల వంద శాతం ఉత్తీర్ణత సాధించడం అభి నందనీయమన్నారు. అదే స్ఫూర్తితో ఈ ఏడాది కూడా ఉత్తీర్ణత సాధించాలని ఆమె ఆకాంక్షించారు. అనంతరం పలువురు అథితులు మాట్లాడారు. ఈ కార్యక్ర మానికి పాఠశాల కర స్పాండెంట్ జైన సురేష్ కుమార్ అధ్యక్షత వహించగా మండల విద్యాధికారి పొతు ప్రభాకర్, పాఠశాల ఎండీ జైన రమాదేవి, పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి.

## అవయవ దానంపై అపోహలు వీడాలి




**ముద్ర, మంచిర్యాల:** అవయవ దానంపై అపోహలు వీడాలని బెల్లంపల్లి ఎమ్మెల్యే వినో ద్ సూచించారు. గురువారం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి మున్సిపల్ ఆధ్యంలో చేపట్టిన అవగాహన ర్యాలీని ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి కాంటా చౌరస్తా వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలంతా అవయవ దానానికి ముందుకు రావాలని కోరారు. నేత్రదానం చేస్తే ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ స్వాతి, వైస్ చైర్మన్ సత్యనారాయణ, కమిషనర్ సంపత్, జనహిత సంస్థ అధ్యక్షుడు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

**భోజన సమయంలో పోన్ వాడవద్దు**

భోజనం సమయంలో ఫోన్ దూరంగా పెట్టండి ఫుడ్ టైమ్‌లో ఫోన్ వాడకపోవడం మైండ్‌ఫుల్ నెస్‌ను పెంచుతుంది.



# విద్యుత్ ఆర్టిజన్ ఉద్యోగుల ధర్నా





__ముద్ర ప్రతినిధి, భువనగిరి:__

తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ భువనగిరి డివిజన్ కమిటీ ఆధ్వర్యం లో శుక్రవారం విద్యుత్తు డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు ఏపీఎస్బీబి సర్వీస్ రూల్స్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. మిగిలిపోయిన అన్మాండ్ కార్మికులు, సొసైటీ కార్మికులను ఆర్టిజన్ గా గుర్తించాలని, పిసు రేటు కార్మికులు ప్రవేట్ కలెక్షన్ ఏజెంట్లు, ప్రైవేట్ మీటర్ రీడర్లు, ఎస్పీఎం కార్మికులు, హమాలీలు కార్మికులకు జీవో నెంబర్ 11 ప్రకారం కనీస వేతనం అమలు చేయాలని అలాగే 2026 పిఆర్సీ కమిటీని వేయాలన్నారు. విద్యుత్ ఉద్యోగ సంఘాలు 1104, 327, టి ఆర్ వి కెఎస్, బిసి అసోసియేషన్, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ సంఘాలు మద్దతు తెలిపాయి.

ఈ కార్యక్రమంలో టిజిఎస్పీడీసీఎల్ కంపెనీ కో చైర్మన్ బొక్క పాండరీ రెడ్డి, ఉమ్మడి జిల్లాకు చైర్మన్ భాస్కర్ నాయక్, భువనగిరి డివి జన్ చైర్మన్ ఇంజ మహేష్, కో చైర్మన్ ఎడ్ల వెంకటేశు, కన్వీనర్ బోట్ల రమేష్,కో కన్వీనర్ హరికృష్ణ, సాగిన రమేష్, భువనగిరి సబ్ డివిజన్, బింగి శ్రీకాంత్ దాతరపు భాస్కర్, వైస్ చైర్మన్ బొట్ల నర్సింగరావు, బండ రవి, కోశాధికారి హేమలత, మహిళ ప్రతినిధి మహేశ్వరి, కార్యనిర్వాహక కార్యదర్శి అమరేందర్, ఈదయ్య, బాలకృష్ణ సంయుక్త కార్యదర్శి భాస్కర్, శోభన్ బాబు, మల్లేష్ పాల్గొన్నారు.

# కాలువలోని పైపులను తొలగించ వద్దు

**- సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ్మా**

__ముద్ర ప్రతినిధి, భువనగిరి:__



కాలువపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా పైపులను తొలగించ వద్దని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండమడుగు నర్సింహ్మా డిమాండ్ చేశారు. మండలంలోని ముత్తిరెడ్డిగూడెంలోని రైతుల వ్యవసాయ పొలాల మధ్య నుంచి బస్వాపురం ప్రాజెక్టు నుండి ఇతర ప్రాంతాలకు నీళ్లు వెళ్ళడానికి తవ్విన కాలువను రాకపోకలు కొనసాగించడానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టకుండా కాలువలో ఉన్న పైపులను తొలగించాలన్న ప్రతిపాదనను ఎమ్మెల్యే కుంభం అనిల్ రెడ్డి, అధికారులు వెంటనే విరమించుకోవాలని అన్నారు. బ్రిడ్జి నిర్మాణం చేయకుండా పైపులను తొలగిస్తే గ్రామస్తులతో కలిసి కాలువను పూడ్చడానికి కూడా వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు. గురువారం భువనగిరి మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో కాల్వపై బ్రిడ్జి నిర్మాణం చేయాలని, కాలువలో ఉన్న పైపులను అక్రమంగా తొలగించవద్దని సర్పంచ్, మాజీ సర్పంచ్, ప్రజాప్రతినిధులు, రైతులు, వ్యవసాయ కూలీలు, వృత్తిదారులతో కలిసి కాల్వ దగ్గర నిరసన కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్, మాజీ సర్పంచ్ రాంపల్లి కృష్ణ, మాకోల్ల సత్యం మాట్లాడుతూ ఇప్పటికే చాలామంది రైతులు కాలువ కోసం తమ భూములను కోల్పోయారని అన్నారు.

ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నర్సింహ, ఉప సర్పంచ్ అందె మల్లేశం, వార్డు మెంబర్లు జక్కుల మల్లేశం, కొండమడుగు అశోక్, గజ్జి కవితా కుమార్, సీపీఎం మండల కార్యదర్శివర్గ సభ్యులు కొండా అశోక్, సీపీఎం శాఖ కార్యదర్శి కూకుట్ల కృష్ణ కాంగ్రెస్, టిఆర్ఎస్ నాయకులు, రైతులు, వ్యవసాయ కార్మికులు పాల్గొన్నారు.

## జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్పీజీ కొరత లేదు..

__ముద్ర ప్రతినిధి, భువనగిరి:__

జిల్లాలో పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ (ఎల్పీజీ) కొరత లేదని భయాందోళనలతో కొనుగోలు చేయవద్దని రెవెన్యూ అదనపు కలెక్టర్ వెంకా రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. గురువారం అదనపు కలెక్టర్ తన ఛాంబర్ లో జిల్లాలోని సేల్స్ ఆఫీసర్స్, పెట్రోల్ బంకుల యజమానులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎక్కడ కూడా నో – స్టాక్ బోర్డులు పెట్టకూడదని, ముందస్తు స్టాక్ బుకింగ్ చేసుకోవాలని, స్టాక్ 24 గంటలలో డెలివరీ చేయాలని సేల్స్ ఆఫీస్సర్లకు సూచించారు. పెట్రోల్ లేదా డీజిల్ ను డబ్బాలు, క్యాన్లలో నిల్వ చేయడం పెసో నిబంధనలకు విరుద్ధమని ఇది అగ్ని ప్రమాదాలకు దారి తీయవచ్చని అన్నారు. అక్రమ నిల్వ, బ్లాక్ మార్కెట్ జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని అదనపు కలెక్టర్ వెంకారెడ్డి హెచ్చరించారు.

# ఘనంగా సాంబశివుడు వర్ధంతి



__ముద్ర ప్రతినిధి, భువనగిరి:__

మావోయిస్టు పార్టీ మాజీ రాష్ట్ర కార్యదర్శి, బీఆర్ఎస్ పార్టీ పొలిటి బ్యూరో సభ్యులు కూనపురి సాంబశివుడు వర్ధంతిని స్థానిక అమరవీరుల స్థూపం వద్ద శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా అధ్యక్షుడు పుట్ట వీరేష్ యాదవ్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వలిగొండ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కోనపురి కవిత రాములు, మాజీ జడ్పీటీసీ బీరు మల్లయ్య, శ్రీ కృష్ణ యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు గుండెబోయిన సురేష్ యాదవ్, నక్కల చిరంజీవి యాదవ్, బెల్లి సూర్యప్రకాశ్ యాదవ్, ర్యాకల రమేష్ యాదవ్, పర్వతం దశరథ, నల్లమాస దానయ్య గౌడ్, సిద్దులు యాదవ్ బతుక అశోక్ యాదవ్, వల్లపూ ప్రవీణ్ యాదవ్, కడారీ పరమేశ్ యాదవ్, శ్రీరాం శరత్ యాదవ్, కూనపురి అభిమానులు నాయకులు పాల్గొన్నారు.

**ధర్మబిక్షం విగ్రహాన్ని**

# ట్యాంక్ బండ్ పై ప్రభుత్వం ఏర్పాటు చేయాలి

**- గీత పనివారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బోలగాని సత్యనారాయణ**

__ముద్ర ప్రతినిధి, భువనగిరి:__





పేద బడుగు బలహీన వర్గాల పోరాట యోధుడు గీత కార్మికుల జన బాంధవుడు బొమ్మగాని ధర్మం బిక్షం విగ్రహాన్ని ప్రభుత్వం ట్యాంక్ బండ్ పై ఏర్పాటు చేయాలని గీత పని వారల సంఘం రాష్ట్ర కార్యదర్శి బిలగాని సత్యనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం భువనగిరి పట్టణంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో ధర్మం బిక్షం 15వ వర్ధంతి సందర్భంగా అయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ధర్మం బిక్షం జీవిత చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చి భవిష్యత్ తరాలకు తెలిసే విధంగా ప్రభు త్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎండి ఇమ్రాన్, జిల్లా కమిటీ సభ్యులు గాదెగాని మాణిక్యం, ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు సామల శోభన్ బాబు, సీపీఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేష్, నాయకులు సామల భాస్కర్, బద్దం వెంకట్ రెడ్డి, పిన్నం జగన్, ఎండి బాబా, మామిండ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

## ఉత్కంఠతగా సాగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు

**- డ్రాలో జ్ఞాన సుందర్ ను వరించిన అధ్యక్ష పదవి**

__ముద్ర, తుంగతుర్తి:__



మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో గురువారం జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికలు ఉత్కంఠ భరితంగా సాగాయి. అధ్యక్షుడిగా అన్నెపర్తి జ్ఞాన సుందర్, తాళ్లపల్లి సత్యనారాయణ ఇద్దరు బరిలో నిలవగా 16 ఓట్లకు గాను ఇద్దరికీ సమానం రావడంతో డ్రా తీయగా అన్నెపర్తి జ్ఞానసుందర్ ను అధ్యక్ష పదవి వరించిందని ఎన్నికల అధికారిగా వ్యవహరించిన ఎస్కే వజీర్ తెలిపారు. దీంతో జ్ఞాన సుందర్ నాలుగోసారి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జ్ఞాన సుందర్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన న్యాయవాదులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఆయనను పలువురు శాలువాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.

## రామన్నపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎండి మజీద్

**- ప్రధాన కార్యదర్శి యాదాసు యాదయ్య**

__ముద్ర, రామన్నపేట:__



రామన్నపేట బార్ సోసియేషన్ ఎన్నికలలో మూడోసారి అధ్యక్షుడిగా మజీద్, ప్రధాన కార్యదర్శిగా యాదాసు యాదయ్య ఎన్నికయ్యా రు. రామన్నపేట బార్ సోసియేషన్ ఎన్నికలలో మూడవసారి అధ్యక్షుడిగా ఎన్నికైన ఎండి మజీద్, కార్యద ర్శిగా యాదసు యాదయ్య, ఉపాధ్యక్షుడిగా సంగిశెట్టి బాలరాజు, సహాయ కార్యదర్శిగా దినేష్, కోశాధికారిగా కూనూరు శ్రీనివాస్, స్పోర్ట్స్ కార్యదర్శిగా శ్రవణ్ కుమార్, లేడీ రిప్రె సెంటివ్ గా రోసమ్మ థామస్, కార్యవర్గ సభ్యులుగా పాల్వంచ జగతయ్య, సోమ సతీష్ రెడ్డి, సయ్యద్ అజిజుద్దీన్ ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి యేళ్ల శ్రీశైలం ప్రకటించారు.

## శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయ కమిటీ

__ముద్ర, మోత్కూర్:__



మండలంలోని పాలడుగు గ్రామ శ్రీ సీతా రామచంద్ర స్వామి దేవస్థాన నూతన కమిటినీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పులగం వెంకట్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కొసన ఉప్పలయ్య, కొంపల్లి అంజయ్య,కార్యదర్శిగా శివరాత్రి కృష్ణయ్య, సహాయ కార్యదర్శిగా ముక్కముల రవి, బరిగెల రాజు, ప్రచార కార్యదర్శిగా ఆళ్ల సోమప్ప, ముక్కెర్ల మహేష్, కోశాధికారిగా ఎడ్ల భగవంత్ లను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అంతటి భగవంతు, ఉప సర్పంచ్ దడిపెల్లి సైదులు మాజీ ఎంపీటీసీ అంతటి నర్సయ్య, మాజీ సర్పంచ్ మర్రిపెల్లి యాదయ్య, ఆర్ టిడి ఎంఈఓ బద్దం యాదిరెడ్డి,బండ యాదగిరి, సింగిరెడ్డి నరసింహ రెడ్డి గంగుమల్లు, మచ్చగిరి, నర్సయ్య, శంకర్ పాల్గొన్నారు.

## ప్రపంచ స్థాయి సదస్సుకు సందీప్ కుమార్

__ముద్ర, మోత్కూర్:__

ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రాజకీయ శాస్త్రంలో పీహెచ్‌డీ చేస్తున్న సందీప్ కుమార్ పొట్టేపాక ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆక్స్ఫర్డ్ విశ్వావిద్యాలయంలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సులో తన పరిశోధన పత్రాన్ని సమర్పించేందుకు ఎంపికయ్యారు. మోత్కూర్ మండలం దాచారం గ్రామానికి చెందిన సందీప్ అంతర్జాతీయ సదస్సుకు ఎంపిక కావడం పట్ల గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

## ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత కల్పించాలని ధర్నా

__ముద్ర, తుంగతుర్తి:__

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు అభయహస్తం పేరుతో హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలకు ప్రస్తుత బడ్జెట్ సమావేశాల్లో చట్ట బద్ధత కల్పించాలని బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తాడికొండ సీతయ్య ఆధ్వర్యంలో అన్నారం గ్రామంలో ధర్నా చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు గుండగాని రాములు గౌడ్ మండల నాయకులు దొంగరి శ్రీనివాస్, సర్పంచ్ కుంచాల శ్రీనివాసరెడ్డి, నాయకులు మట్టిపెల్లి వెంకట్, మన్నూరు పోతరాజు, ఇసాకర్, సతీష్, బెడద రాములు, మాజీ సర్పంచ్ సోమశేఖర్, సైదులు, సరిత, బింగి వెంకన్న మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## మోత్కూరును నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలి

__ముద్ర, మోత్కూరు:__

మోత్కూరు మండలాన్ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని బిసి రిజర్వేషన్ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ గౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం మోత్కూరుకు వచ్చిన ఎమ్మెల్సీ నెల్లికంటే సత్యంకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ రిజర్వేషన్ సాధన సమితి నాయకులు కలిమెల నర్సయ్య, ఎడ్ల నరేష్, అన్నెపు భాస్కర్, ఎడ్ల పక్కిరు పాల్గొన్నారు.

# ధర్మ బిక్షం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

**- ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం**

__ముద్ర,మోత్కూరు:__



భూమికోసం, భుక్తి కోసం, తెలంగాణ విముక్తి కోసం సాయుధ పోరాటంలో కీలకపాత్ర పోషించిన మాజీ పార్లమెంట్ సభ్యులు బొమ్మగాని ధర్మభిక్షం ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పిలుపునిచ్చారు. గురువారం మోత్కూరులో గీత పనివారాల సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బొమ్మగాని ధర్మ బిక్షం వర్ధంతి పురస్కరించుకొని ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మాజీ ఎమ్మెల్యే సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, గీత పనివారల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొమ్మగాని ప్రభాకర్లతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం ధర్మ బిక్షం విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విగ్రహ దాత కప్పల రవికుమార్, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ నూనెముంతల విమల వెంకటేశ్వర్లు గౌడ్, వైస్ చైర్మెన్ లింగాల నర్సిరెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ గడ్డం స్వప్న సోమనర్సయ్య, వైస్ చైర్మెన్ పల్లెర్ల వెంకన్న గుప్తా,సి పిఐ జిల్లా కార్యదర్శి యానాల దామోదర్ రెడ్డి, సహాయ కార్యదర్శులు బోలగాని సత్యనారాయణ, చేడే చంద్రయ్య, బారాస జిల్లా అధ్యక్షుడు కంచర్ల రామకృష్ణారెడ్డి, రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షులు గుర్రంలక్ష్మి నరసింహారెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి అవిశెట్టి అవిలిమల్లు చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి పాశికంటి లక్ష్మి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

# డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పనులను పూర్తి చేయాలి

**- జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి**

__ముద్ర ప్రతినిధి, భువనగిరి:__



జిల్లా లో డబల్ బెడ్ రూమ్ ఇండ్లలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం మినీ మీటింగ్ హాల్ లో భువనగిరి మండలంలోని సింగన్నగూడెం, బీబీ నగర్, వంగపల్లి, నారాయణపూర్, పోచంపల్లి, జిబిలకపల్లిలోని డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మౌళిక వసతులపై జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర్ రావు, హౌసింగ్ అధికారులతో కలసి సమీక్షించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పిడి శ్రీ రాములు, ఆర్ అండ్ బి అధికారి సరిత, పి ఆర్. ఈ ఈ దసయ్య సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సఖి సెంటర్‌ను సందర్శించిన జిల్లా కలెక్టర్

గురువారం హౌసింగ్ బోర్డ్ లో గల సఖీ సెంటర్ ను కలెక్టర్ సందర్శించారు. సఖీ సెంటర్ లో ఎంత మంది సిబ్బంది పని చేస్తున్నారని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సెంటర్‌లో అందిస్తున్న సేవలను పరిశీలించి, బాధిత మహిళలకు అందుతున్న సహాయంపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. సఖీ సెంటర్ కు ఎలాంటి కేసులు వస్తున్నాయని, వచ్చిన కేసులకు ఎలా కౌన్సిలింగ్ ఇస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు సఖి సెంటర్ కీలక పాత్ర పోషించాలన్నారు. అనంతరం మాస్కుంట వద్ద నిర్మాణంలో ఉన్న సఖి భవనాన్ని కలెక్టర్ సందర్శించి పెండింగ్ లో ఉన్న పనులను పూర్తి చేయాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. తర్వాత సింగన్న గూడెంలో నిర్మాణంలో ఉన్న బాల సదనం భవనాన్ని సందర్శించి. పెండింగ్ పనుల త్వరగా పూర్తి చేయాలని టీఎస్ఈడబ్ల్యుఐడిసి డీఈని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



**రాత్రి డిజిటల్ కర్ఫ్యూ పెట్టుకోండి**

రాత్రి 9 తర్వాత సోషల్ మీడియా వాడకాన్ని నిలిపివేయడం నిద్ర నాణ్యతను మెరుగుపరుస్తుంది.



## స్పోర్ట్స్ స్కూల్ అడ్మిషన్లకు ఎంపికలు

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జిల్లా కలెక్టర్ సంగారెడ్డి ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ స్కూల్ హకీంపేట్, కరీంనగర్, ఆదిలాబాద్ మరియు హన్మకొండలో నాలుగవ తరగతి ప్రవేశాల కోసం ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించి సెప్టెంబర్ 1, 2017 నుంచి ఆగస్టు 31, 2018 మధ్య జన్మించి, ఆగస్టు 31, 2026 నాటికి 8 సంవత్సరాలు పూర్తి చేసుకున్న బాలబాలికలకు మండల స్థాయి ఎంపిక ప్రక్రియ ఈ నెల 13 నుంచి 17 వరకు నిర్వహించారు. మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు జిల్లాస్థాయి ఎంపిక ప్రక్రియ ఈ నెల 30న డా. బి.ఆర్. అంబేద్కర్ స్టేడియం, సంగారెడ్డి వద్ద ఉదయం 9.00 గంటలకు ప్రారంభమవుతుంది. మండల స్థాయిలో ఎంపికైన అభ్యర్థులు తప్పనిసరిగా హాజరు కావాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి సూచించారు.

**అభ్యర్థులు వెంట తీసుకురావలసిన ధ్రువీకరణ పత్రాలు ఇవి:**

ఆధార్ కార్డు ఒరిజినల్, ప్రస్తుతం చదువుతున్న పాఠశాల నుండి 3వ తరగతి బోనాఫైడ్, పుట్టిన తేదీ ధృవపత్రం, 3వ తరగతి ప్రోగ్రెస్ రిపోర్ట్, కమ్యూనిటీ సర్టిఫికేట్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు 5, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ మరియు మార్క్స్ షీట్. మరిన్ని వివరాలకు జిల్లా యువజన మరియు క్రీడల కార్యాలయం, సంగారెడ్డి ఫోన్ నంబర్ 7981798957 ను సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు.

## పాలకూర పప్పు పలుచగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం

**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట :**



దౌల్తాబాద్ మండలం శేరిపల్లి బంధారం గ్రామంలోని మహాత్మ జ్యోతిబా పూలే బీసీ బాలికల గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలను సిద్ధిపేట కలెక్టర్ కె. హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, బెండకాయ కూర, పాలకూర పప్పు, రసం, నెయ్యి, పెరుగు వంటి వంటకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాలకూర పప్పు మరీ పలుచగా ఉండటంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. "మీ ఇళ్లలో కూడా ఇలాగే వండుతారా" అంటూ వంట సిబ్బందిపై మండిపడ్డారు. ఆహార నాణ్యతలో లోపాలు ఉంటే సహించబోమని హెచ్చరించారు. వంటగది, డైనింగ్ హాల్ ఎల్లప్పుడూ శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. అనంతరం గురుకుల ప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మరుగుదొడ్లు మైదానంలో ఉండటంతో రాత్రి వేళల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రిన్సిపల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, వసతి గృహంలో మరుగుదొడ్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

## ప్రభుత్వ భూములు కబ్జా కాకుండా కాపాడాలి

- **కౌన్సిలర్ కోరబోయిన సరస్వతీ**

**ముద్ర ప్రతినిధి,సంగారెడ్డి :**

మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకు గురి కాకుండా చూడాలని మున్సిపల్ కౌన్సిలర్ కోరబోయిన సరస్వతి అన్నారు. గురువారం జరిగిన ఆందోల్ జోగిపేట మున్సిపల్ సర్వ సభ్య సమావేశంలో 12వ వార్డు కౌన్సిలర్ కోరబోయిన సరస్వతి మాట్లాడుతూ వేసవికాలం దృష్టిలో పెట్టుకొని వార్డులో మంచినీటి సమస్య తలెత్తకుండా మున్సిపల్ తరుపున అవసరమైన బోర్లు వేసి నీటిఎద్దడి రాకుండా పరిష్కారము చేయాలన్నారు. అలాగే మున్సిపల్ పరిధిలోని ప్రభుత్వ భూములు కబ్జాకోరుల వల్ల అన్యాక్రాంతం కాకుండా కాపాడు కోవాలన్నారు. ప్రభుత్వ భూములను గుర్తించి వాటి రక్షణకోసం చుట్టు పెన్సింగ్ వేసి కాపాడే బాధ్యత మున్సిపల్ అధికారులు తీసుకొని కాపాడాలన్నారు.

## యువత సామాజిక సేవ లక్ష్యంగా ఉండాలి

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

తారా ప్రభుత్వ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాలు రెండు, నాలుగు ఆధ్వర్యంలో కల్పకూర్, అంగడిపేట గ్రామాలలో, ఎన్ఎస్ఎస్3 ఆధ్వర్యంలో మల్కాపూర్‌లో రెండో రోజు శీతాకాల శిబిరం సందర్భంగా కెరీర్ గైడెన్స్‌పై అవగాహన నిర్వహించినట్లు తెలిపారు. అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, కళాశాల కెరీర్ గైడెన్స్ సెల్ సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్న అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్ అధికారి కుమార్ మాట్లాడుతూ పేద విద్యార్థులకు అజీమ్ ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం ద్వారా ఏడు కోర్సుల్లో ఉచితంగా హాస్టల్ సదుపాయంతో పాటు విద్య అందిస్తున్నామని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. మల్కాపూర్ గ్రామంలో బాలికల శీతాకాల శిబిరంలో హైస్కూల్ గెజిటెడ్ హెచ్ఎం యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు సామాజిక సేవలో భాగస్వాములు కావాలన్నారు.. ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్ సాంబశివుడు మాట్లాడుతూ విద్యార్థులు సామాజిక స్పృహ కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారులు డాక్టర్ జగదీశ్వర్, డాక్టర్ సదయకుమార్, డాక్టర్ వాణి, డాక్టర్ సిహెచ్ జోష్నా, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ కరుణ, అధ్యాపకులు మిథున్ కుమార్ రాథోడ్, టీఎస్‌కేసీ మెంటర్ రమణారావు, హెచ్ఎం యాదగిరి, హెచ్ఎం సాంబశివుడు, పాఠశాల అధ్యాపక బృందం తదితరులు పాల్గొన్నారు.

## సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

స్వాతంత్ర్య ఉద్యమ అమరవీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ 95వ వర్ధంతి సందర్భంగా సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో మెదక్ కేవల్ కిషన్ భవన్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని రిటైర్డ్ టీచర్ కొండల్ రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ. మల్లేశం, కోశాధికారి కే. నరసమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కే. మల్లేశం, వివిధ సంఘాల నాయకులు గౌరయ్య, సంతోష్, గణేశ్వరెడ్డి, నరేందర్, కవిత, వెంకట్ పాల్గొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి రక్తనిధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 'జిల్లాలో ఇంధన కొరత లేదు'

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

జిల్లాలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ వంటగ్యాస్‌కు ఎలాంటి కొరత లేదని అదనపు కలెక్టర్ మాధురి స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందకుండా వదంతులను నమ్మవద్దని ఆమె కోరారు. గురువారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పౌర సరఫరాల శాఖ అధికారులతో నిర్వహించిన సమావేశంలో పెట్రోల్, డీజిల్, ఎల్‌పీజీ వంటగ్యాస్ నిల్వలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో ఇంధన నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని, పెట్రోల్ బంకులు మరియు గ్యాస్ ఏజెన్సీలకు సరఫరాలు యథావిధిగా కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో డీఎం సివిల్ సప్లై అంబదాస్, ఏఎస్‌వో రాజేశ్వర్ తదితర అధికారులు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణాపై కఠిన చర్యలు

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

జిల్లాలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ ప్రతిమా సింగ్ హెచ్చరించారు. గురువారం మెదక్ కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సాండ్ కమిటీ సమావేశంలో అదనపు కలెక్టర్ నగేష్, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, మైనింగ్, ఇరిగేషన్, పంచాయతీ, హౌసింగ్ శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఏప్రిల్ 1 నుంచి 100 శాతం ఇసుక సరఫరాను 'మన ఇసుక వాహనం' ద్వారా ఆన్‌లైన్ విధానంలోనే నిర్వహించాలని స్పష్టం చేశారు. ఇసుక రవాణా పూర్తిగా ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా జరగాలని అధికారులను ఆదేశించారు. అక్రమంగా ఇసుక రవాణా చేసే వాహనాలు పట్టుబడితే బైండోవర్ కేసులు నమోదు చేసి జరిమానాలు విధించాలని సూచించారు. తహసీల్దార్లు వారానికి కనీసం రెండు సార్లు రీచ్‌లను సందర్శించాలని సూచించారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియలో పార్టీల సహకారం కీలకం

- **కలెక్టర్ ప్రావీణ్య**

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**




కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఏప్రిల్ నెలలో ప్రారంభం కానున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ ప్రావీణ్య కోరారు. గురువారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ ఎస్ఐఆర్ ప్రక్రియపై వివరించారు. ఓటరు జాబితా సవరణలో భాగంగా అర్హత ఉన్న ప్రతి పౌరుని పేరు తప్పకుండా నమోదు కావడం, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితా సిద్ధం కావడం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ ప్రక్రియలో బూత్ లెవెల్ ఆఫీసర్లతో పాటు రాజకీయ పార్టీల తరపున బూత్ లెవెల్ ఏజెంట్ల (బీఎల్ఏ) పాత్ర అత్యంత కీలకమని తెలిపారు. అందువల్ల అన్ని రాజకీయ పార్టీలు తమ బూత్ లెవెల్ ఏజెంట్లను ఈ నెల 30లోగా నియమించి, వారి జాబితాను నియోజకవర్గాల వారీగా సమర్పించాలని సూచించారు. బీఎల్ఏల నియామకం పూర్తయిన అనంతరం బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్ఓలు) మరియు బీఎల్ఏలకు సంయుక్త సమావేశం నిర్వహించి, ఎస్ఐఆర్ నిబంధనలు, విధానాలపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సాఫీగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ కోరారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ మాధురి, ఎన్నికల విభాగ అధికారులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రజా ఆరోగ్య సేవలపై కలెక్టర్ దృష్టి



ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా జిల్లాలో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ పి. ప్రావీణ్య పిలుపునిచ్చారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలలో స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న వైద్య స్క్రీనింగ్ శిబిరాలను కలెక్టర్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంగారెడ్డి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్, వివిధ విభాగాల పనితీరును పరిశీలించారు. ఆసుపత్రిలో డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ నమోదు ప్రక్రియ, డేటా ఎంట్రీ, రోగుల వివరాల సేకరణ విధానాన్ని పరిశీలించి, రోగులకు ఇబ్బందులు కలగకుండా ఓపీ రిజిస్ట్రేషన్ కౌంటర్లను పెంచాలని, ఇంటర్నెట్ వేగాన్ని మెరుగుపర్చాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు సూచించారు. తదుపరి స్థానిక రైతు బజార్ సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి, వందరోజుల ప్రత్యేక కార్యాచరణలో భాగంగా ఆర్‌బీఎస్‌కే నిర్వహిస్తున్న వైద్య శిబిరాన్ని తనిఖీ చేశారు. విద్యార్థులందరికీ ఆరోగ్య పరీక్షలు నిర్వహించారా అని అడిగి తెలుసుకున్న కలెక్టర్‌కు, సాధారణ ఆరోగ్య పరీక్షలతో పాటు రక్తహీనత, కంటి, చెవి, దంత సమస్యలు, పోషకాహార లోపాలను గుర్తించి అవసరమైన చికిత్సకు రిఫర్ చేస్తున్నట్లు వైద్యులు వివరించారు. అనంతరం మార్క్స్ నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌ను సందర్శించి, స్పెషలిస్ట్ వైద్యులతో నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ మురళీకృష్ణ, డీసీహెచ్ఎస్ కవిత, డాక్టర్ శశాంక్ తదితర వైద్యాధికారులు పాల్గొన్నారు.

## గ్రామసభలు పకడ్బందీగా నిర్వహించాలి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా వచ్చే నెల 2వ తేదీ నుంచి జిల్లాలో గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, డిప్యూటీ జెడ్పీ సీఈఓ స్వప్న, ఇరిగేషన్ ఈఈ జై భీమ్‌లతో కలిసి నిర్వహించిన వీడియో సమీక్ష సమావేశంలో గ్రామసభల ఏర్పాట్లు, తాగునీటి సరఫరాపై సమీక్షించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని గ్రామసభలను నిర్వహించాలని, లబ్ధిదారుల ఎంపికకు సంబంధించిన వివరాలను ముందుగానే సిద్ధం చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను ప్రజలకు సులభంగా అర్థమయ్యే విధంగా తెలియజేయాలని, సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదేశించారు. అనంతరం వేసవిలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ప్రతి గ్రామపంచాయతీ, మునిసిపాలిటీలలో తాగునీటి సమస్యలను క్షేత్రస్థాయిలో గుర్తించి ఎక్కడా నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగునీటి సమస్యలపై ఫిర్యాదుల కోసం టోల్ ఫ్రీ నంబర్ 1916 గురించి ప్రజలకు విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈ సమావేశంలో మునిసిపల్ కమిషనర్లు, మండలపరిషత్ అధికారులు, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈలు, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

## ప్రజల సహకారంతోనే ప్రమాదాల నివారణ

- **ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు**




**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అత్యంత కీలకమని ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు అన్నారు. మెదక్ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో గురువారం 'అరైవ్ అలైవ్' మూడో విడత కార్యక్రమంలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ విద్యార్థులు, యువతకు పలు సూచనలు చేశారు. రోడ్డు మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ తమ భద్రతతో పాటు ఇతరుల భద్రతను కూడా దృష్టిలో పెట్టుకొని ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ మహేందర్, డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ ఇన్‌స్పెక్టర్ మహేష్, అధ్యాపకులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**లైంగికదాడి కేసులో 20 ఏళ్ల కారాగార శిక్ష**

తుప్రాన్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన లైంగికదాడి కేసులో నిందితుడికి కోర్టు 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.1 లక్ష జరిమానా విధించినట్లు ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు తెలిపారు. జండపల్లి గ్రామానికి చెందిన సోమగారి భాస్కర్ (27) బాలికపై లైంగికదాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందడంతో అప్పటి ఎస్ఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేశారు. తదుపరి దర్యాప్తు అధికారి సీఐ శ్రీధర్ సమగ్రంగా విచారణ జరిపి సాక్ష్యాధారాలను సేకరించి, పక్కా ఆధారాలతో చార్జ్ షీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన మెదక్ ఫాస్ట్ ట్రాక్ పోక్సో కోర్టు న్యాయమూర్తి ఆర్.ఎం. సుభావల్లి నిందితుడికి 20 ఏళ్ల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.1 లక్ష జరిమానా విధించారు. జరిమానా మొత్తాన్ని బాధితురాలికి పరిహారంగా చెల్లించాలని కోర్టు ఆదేశించింది. కేసు విజయవంతంగా నడిపించడంలో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం. బాలయ్య, భరోసా లీగల్ ఆఫీసర్ అడ్వకేట్ కే. శ్వేత కీలక పాత్ర పోషించారు.

## సిద్దిపేట బార్ కౌన్సిల్ ఎన్నికలు

- **అధ్యక్షుడిగా రమేష్ బాబు ఘన విజయం**



**ముద్ర ప్రతినిధి,సిద్దిపేట :**

సిద్దిపేట బార్ కౌన్సిల్ ఎన్నికలు గురువారం సిద్దిపేట బార్ అసోసియేషన్ అధ్వర్యంలో జరిగాయి. సిద్దిపేట బార్ కౌన్సిల్ లో మొత్తం 205 మంది సభ్యులు ఉండగా, గురువారం జరిగిన ఎన్నికల్లో 203 మంది తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఈ ఎన్నికల్లో రమేష్ బాబు కు 106 ఓట్లు, ప్రత్యర్థి అభ్యర్థి, మాజీ అధ్యక్షుడు సిహెచ్ జనార్దన్ రెడ్డికి 96 ఓట్లు పోలయ్యాయి. రమేష్ బాబు 10 ఓట్ల మెజారిటీ తో ఘన విజయం సాధించారు. రమేష్ బాబు ప్యానెల్ సభ్యులు న్యాయవాదులు పిన్న రాములు, శివాజీ, జి రామకృష్ణ, మణి, వెంకన్న, మహేష్ తదితరులు ఉన్నారు.

## మెదక్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా జనార్ధన్ రెడ్డి విజయం

**ముద్ర ప్రతినిధి, మెదక్:**



మెదక్ జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా కే. జనార్ధన్ రెడ్డి 57 ఓట్ల భారీ మెజారిటీతో ఘనవిజయం సాధించారు. మొత్తం 88 ఓట్లు ఉండగా, 85 ఓట్లు పోలయ్యాయి. జనార్ధన్ రెడ్డికి 71 ఓట్లు రాగా, ప్రత్యర్థి రాములకు 14 ఓట్లు వచ్చాయి. ప్రధాన కార్యదర్శిగా శ్రీపతిరావు 14 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. శ్రీపతిరావుకు 49 ఓట్లు, వినోద్ కుమార్‌కు 35 ఓట్లు, నోటాకు 1 ఓటు లభించింది. ఉపాధ్యక్షుడిగా శోభన్ గౌడ్ 5 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. శోభన్ గౌడ్‌కు 45 ఓట్లు, పాండుకు 40 ఓట్లు వచ్చాయి. కార్యవర్గ సభ్యులుగా కె.ఎల్.ఎన్. దత్తు (75), ప్రశాంత్ (64), అసిఫ్ హుస్సేన్ (63) గెలుపొందారు. ఏకగ్రీవంగా సంయుక్త కార్యదర్శిగా వేణుగోపాల్ చారి, గ్రంథాలయ కార్యదర్శిగా డి. రమేష్, కోశాధికారిగా నర్సింలు, క్రీడలు, సాంస్కృతిక కార్యదర్శిగా రవి గౌడ్, మహిళా కార్యవర్గ సభ్యులుగా మమత, మంజుల ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి శిరిగి ప్రభాకర్ ప్రకటించారు. గెలుపొందిన వారికి తోటి న్యాయవాదులు శుభాకాంక్షలు తెలిపారు.

## కాంగ్రెస్ అభ్యర్థిపై హరీష్ రావు గెలిచి చూపించాలి

- **అత్తు ఇమామ్ సవాల్**
- **లక్ష మెజారిటీ దెబ్బతీశామని వ్యాఖ్య**

**ముద్ర ప్రతినిధి, సిద్ధిపేట:**

వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేటలో కాంగ్రెస్ అభ్యర్థిపై ఎమ్మెల్యే హరీష్ రావు గెలిచి చూపించాలని సిద్ధిపేట కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్ సవాల్ విసిరారు. గురువారం సిద్ధిపేటలో మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేసి హరీష్ రావు లక్ష మెజారిటీని దెబ్బతీసి చూపించామని తెలిపారు. సిద్ధిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోటీ చేసి గెలవాలని హరీష్ రావు బడాయిమాటలు మాట్లాడుతున్నారని విమర్శించారు. సమయం వచ్చినప్పుడు సిద్ధిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పోటీ చేస్తారని, మిమ్మల్ని ఓడించే బాధ్యత కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తీసుకుంటారని అన్నారు. సిద్ధిపేట నియోజకవర్గ ప్రజలు కల్వకుంట్ల కుటుంబ పాలన చూసి విసిగి పోయారని, త్వరలోనే ఆ కుటుంబ పాలనకు బుద్ధి చెబుతారని వ్యాఖ్యానించారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చివరివారని హరీష్ రావు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. బీఆర్ఎస్ పాలన నచ్చక ప్రజలు ఇప్పటికే తగిన బుద్ధి చెప్పారని, అయినా మీ పార్టీ నాయకులకు మార్పు రాలేదా అని ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసం బీఆర్ఎస్ నాయకులు పాకులాడుతున్నారని, ఎన్ని నాటకాలు, జిమ్మిక్కులు చేసినా ప్రజలు మీ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రజలకు ఇచ్చిన హామీలైన ఆరు గ్యారంటీలను అమలు చేశామని తెలిపారు. హామీలు అమలు చేస్తామనే భయంతో బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో సిద్ధిపేట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని, అక్కడి నుంచి గెలిచిన అభ్యర్థికి మంత్రి పదవి రావడం ఖాయమన్నారు.. అన్ని వర్గాల అభివృద్ధి కోసం మరో 10 ఏళ్ళు రేవంత్ రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో గ్యాదరి మధు, గయాసుద్దీన్, అర్షద్, నజ్జు, విజయ్ డానియల్, బాబా ఫరీద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
27.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఆఫ్‌లైన్ కార్యకలాపాలకు సమయం కేటాయించండి
క్రీడలు, పుస్తకాలు, హాబీలు ఆనందాన్ని పెంచే ఉత్తమ మార్గాలు.




# వైద్యరంగం బలోపేతం



- **రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు 9.45 లక్షల మందికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్య సేవలు అందించినట్లు రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ స్పష్టం చేశారు. గురువారం అసెంబ్లీలో క్వశ్చన్ అవర్ సందర్భంగా ఆరోగ్యశ్రీ బకాయిలు, సేవలపై సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన వివరణాత్మక సమాధానం ఇచ్చారు. గతంలో ఏడాదికి సగటున 2.5 లక్షల మందికి మాత్రమే సేవలు అందగా, ప్రస్తుతం ఆ సంఖ్య 4 లక్షలకు చేరిందని ఆయన పేర్కొన్నారు. తమ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు చెల్లింపులను భారీగా పెంచిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నెలకు సగటున రూ. 52 కోట్లు చెల్లిస్తే, ప్రస్తుతం నెలకు రూ. 89 కోట్లు రెగ్యులర్‌గా చెల్లిస్తున్నామని మంత్రి వెల్లడించారు.గత ప్రభుత్వం నుంచి వచ్చిన రూ. 600 కోట్ల ఆరోగ్యశ్రీ బకాయిలు, రూ. 130 కోట్ల ఈహెచ్‌ఎస్ బకాయిలను కూడా క్రమంగా తగ్గిస్తూ వస్తున్నామని మంత్రి తెలిపారు. 2023 డిసెంబర్ 8 నుంచి ఇప్పటివరకు సుమారు రూ. 2400 కోట్లకు పైగా పేమెంట్స్ చేశామని, ప్రస్తుతం ప్రైవేట్ ఆస్పత్రులకు కేవలం రూ. 250 కోట్ల బకాయిలు మాత్రమే ఉన్నాయని వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రులు ఆరోగ్యశ్రీ సేవలకు నిరాకరిస్తున్నాయన్న ప్రతిపక్షాల ఆరోపణలను ఆయన ఖండించారు. తాము అధికారంలోకి వచ్చే నాటికి 330గా ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్య ఇప్పుడు 537కు పెరగడమే తమ పనితీరుకు నిదర్శనమని మంత్రి పేర్కొన్నారు. ములుగు, నారాయణపేట వంటి మారుమూల జిల్లాల్లోనూ ప్రజలకు మెరుగైన వైద్యం అందేలా చర్యలు తీసుకున్నామని ఆయన స్పష్టం చేశారు.

# బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కలిసిరండి

- **విపక్షాలకు మంత్రి శ్రీధర్ బాబు పిలుపు**
- **ఢిల్లీ పోరాటంలో బీజేపీ కి భయపడే బీఆర్ఎస్ వెనకడుగు వేసింది**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల విషయంలో తాము ఢిల్లీలో పోరాటం చేస్తుంటే బీఆర్ఎస్.. కేంద్రంలోని బీజేపీకి భయపడి మాతో కలిసి రాలేదని తెలంగాణ అసెంబ్లీ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల సాధనకు తాము పోరాటం చేశామన్న ఆయన వాటిని సాధించే వరకు విశ్రమించే ప్రసక్తే లేదన్నారు. గురువారం శాసనసభలో బీసీ రిజర్వేషన్ల అంశంపై చర్చ సందర్భంగా శ్రీధర్ బాబు మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం కలిసి పోరాటం చేయాలనుకుంటే తమతో కలిసి రావాలని విపక్షాలకు పిలుపునిచ్చారు. ఇప్పటికే తాము డెడికేషన్ కమిటీని ఏర్పాటు చేసి కోర్టు తీర్పుకు అనుగుణంగా ఒక ప్రయత్నం చేశామన్నారు. బలహీనవర్గాల పక్షాన నిలడ్డ వ్యక్తి, తప్పును సరిచేయాలని ముందుకొచ్చిన వ్యక్తి రాహుల్ గాంధీ అన్నారు. గతంలో రాహుల్ గాంధీ హైదరాబాద్‌లో పర్యటించిన సందర్భంగా బీసీ రిజర్వేషన్ల అంశంపై పోరాటం చేస్తామని చెప్పారు. అందుకోసం అనుగుణంగా తమ ప్రయత్నం తాము చేశామన్నారు. కంకా చేస్తూనే ఉంటామన్నారు. ఎన్డీయే కూటమి సభ్యులు సైతం రాష్ట్రపతి వద్దకు వెళ్లి బీసీ రిడర్వేషన్ల అంశంపై ప్రయత్నం చేశామన్నారు. అంతే తప్ప తమ పోరాటాన్ని తమ కమిట్‌మెంట్‌ను శంకించాల్సిన అవసరం లేదన్నారు.

# ఇళ్ల కూల్చివేతలపై స్టే ఇవ్వలేం


- **అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది**
- **వెలుగుమట్ల పిటీషన్లపై హైకోర్టు విచారణ**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

ఖమ్మం జిల్లా వెలుగుమట్లలోని భూదాన్ భూముల్లో నిర్మించిన ఇళ్ల కూల్చివేతలపై మధ్యంతర ఉత్తర్వులు (స్టే) ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. సీసీఎల్ఏ జారీ చేసిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ దాఖలైన 23 పిటిషన్లపై కోర్టు గురువారం విచారణ చేపట్టింది. వెలుగుమట్ల భూముల్లో జరుగుతున్న కూల్చివేతలను అడ్డుకోవాలని, స్టే ఇవ్వాలని పిటిషనర్లు కోర్టును కోరారు. అయితే, ప్రస్తుతం అక్కడ అర్హులైన పేదలకు పట్టాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతున్నందున, ఈ దశలో మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టం చేసింది.

**311 పట్టాల మంజూరు..**

ప్రభుత్వ పక్షాన వాదనలు వినిపించిన గవర్నమెంట్ ప్లీడర్ మురళీధర్ రెడ్డి.. వెలుగుమట్ల ప్రాంతంలో ప్రభుత్వం ఇప్పటికే పారదర్శకంగా సర్వే నిర్వహించిందని తెలిపారు. అర్హులైన వారిని గుర్తించి ఇప్పటికే 311 మందికి పట్టాలను మంజూరు చేసినట్లు ఆయన కోర్టుకు వివరించారు. అర్హులకు న్యాయం జరుగుతున్న వేళ కూల్చివేతలపై స్టే ఇవ్వడం సరికాదని వాదించారు. ఇదిలా ఉంటే.. వెలుగుమట్ల భూదాన్ భూముల్లో అక్రమ నిర్మాణాలు ఉన్నాయంటూ గతంలో అధికారులు కూల్చివేతలు చేపట్టారు. దీనిపై బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. అయితే, ప్రభుత్వం అక్కడ అర్హులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేస్తుండటంతో, కోర్టు ప్రభుత్వ నిర్ణయానికే మొగ్గు చూపింది. పిటిషనర్ల అభ్యర్థనను తోసిపుచ్చుతూ తదుపరి విచారణను వాయిదా వేసింది.




# చిన్నారులకు నాణ్యమైన విద్య.. పోషకాహారం

- **ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్‌తో సీఎం రేవంత్ రెడ్డి**
- **సమగ్ర మానవాభివృద్ధి అంశంపై సమీక్ష**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**




రాష్ట్రంలోని ప్రతి చిన్నారికి నాణ్యమైన విద్య, పోషకాహారం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు. ప్రముఖ ఆర్థికవేత్త కార్తీక్ మురళీధరన్ గురువారం సీఎంతో భేటీ అయ్యారు.రాష్ట్ర శాసనమండలి హాల్‌లో జరిగిన ఈ సమావేశంలో ఇరువురు పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో 010 ఏళ్లలోపు పిల్లల్లో పోషకాహారం లోపం.. విద్యాభ్యాసన స్థాయి సామర్థ్యలోపాలకు సంబంధించి పలు నివేదికలను కార్తీక్ మురళీధరన్ సీఎం దృష్టికి తీసుకువచ్చారు. చిన్న వయస్సులో పోషకాహారం లోపంతో భవిష్యత్‌లో తలెత్తే ఆరోగ్య సమస్యలు.. ప్రాథమిక స్థాయిలో సరైన బోధన లభించకపోతే విద్యార్థి భావి జీవితంలో పడే మానసిక వేదనను ఆయన తెలియజేశారు. వాటిని అధిగమించడానికి తీసుకోవాల్సిన అంశాలను ఆయన సీఎంకు సూచించారు. ఆయా అంశాలపై తాము ఇప్పటికే ప్రత్యేక శ్రద్ధ పెట్టామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజనంతో పాటు అల్పాహారం పెట్టేందుకు బడ్జెట్ లో కేటాయింపులు చేసినట్లు వివరించారు. అంగన్‌వాడీల్లో కార్యకర్తలు, ఆయాలతో పాటు పోషకాహారం అందజేసేందుకు అదనంగా మరొకరిని నియమించాలని కార్తీక్ మురళీధరన్ సూచించారు. అంగన్‌వాడీల్లో పిల్లలకు పోషకాహారం అందజేసేందుకు పోషణ సఖి పేరుతో మరొకరిని నియమించేందుకు అవకాశం ఉందని అధికారులు తెలిపారు. కార్తీక్ మురళీధరన్ సూచించే అంశాలను కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలోని 29 స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలో ప్రయోగాత్మకంగా అమలు చేసేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని సీఎం అధికారులకు సూచించారు. కార్తీక్ మురళీధరన్‌తో సమన్వయం చేసుకొని ఈ అంశంపై ప్రత్యేక నివేదిక రూపొందించి సమర్పించాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఈవసమీక్షలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, ఆర్థిక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా, మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి అనితా రామచంద్రన్, ప్రణాళిక శాఖ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, సెర్ప్ సీఈవో దివ్య, డిప్యూటీ సీఎం కార్యదర్శి కృష్ణభాస్కర్, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ శ్రుతి ఓజా, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు పాల్గొన్నారు.

# ఎంఎంటీఎస్‌పై సీఎం ప్రత్యేక దృష్టి

- **ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా రైళ్ల సేవలందించాలి**
- **స్వీయ ఆదాయ వనరులు పెంచుకోవాలి**
- **సీఎం రేవంత్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**



హైదరాబాద్ కోర్ అర్బన్ ఏరియాలో ప్రయాణికుల అవసరాలకు అనుగుణంగా ఎంఎంటీఎస్ సర్వీసులు ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఎంఎంటీఎస్‌లో ఏటికేడు ప్రయాణికుల తగ్గుముఖంపై ముఖ్యమంత్రి ఆరాతీశారు. ఎంఎంటీఎస్ సర్వీసులపై శానసమండలి హాల్‌లో రేవంత్ రెడ్డి గురువారం సమీక్ష నిర్వహించారు. కార్యాలయాల సమయాల్లో ఎంఎంటీఎస్‌ల సంఖ్య పెంచడంతో పాటు క్రమంతప్పకుండా సమయ పాలన పాటిస్తూ సర్వీసులు నడపాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్ల వద్దకు ఆర్టీసీ బస్సులు వెళ్లేందుకు అవకాశం లేకపోవడం, స్టేషన్లు లోపలికి ఉన్నందున అక్కడకు రాకపోకలు సాగించేందుకు వీలుగా మినీ బస్సులు నడిపే అంశాన్ని పరిశీలించాలని సీఎం ఆదేశించారు. ఎంఎంటీఎస్ స్టేషన్లలో ప్రయాణికులకు అవసరమైన అన్ని వసతులు ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. మెరుగైన వసతులు ఉన్నప్పుడే ప్రయాణికులు ఎంఎంటీఎస్ వైపు మొగ్గు చూపుతారని సీఎం తెలిపారు. స్వీయ ఆదాయ వనరులు పెంచుకునేందుకు ప్రయత్నించాలని అధికారులకు సీఎం సూచించారు. లాస్ట్ మైల్ కనెక్టివిటీ పెంపుతో పాటు ప్రయాణికుల సంఖ్య పెంపు.. వసతులు మెరుగుకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసి నివేదిక సమర్పించాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఈ సమీక్షలో రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు, ఎంఏయూడీ స్పెషల్ సెక్రటరీ జయేష్ రంజన్, ఆర్ అండ్ బీ వికాస్ రాజ్, సీఎం స్పెషల్ సెక్రటరీ అజిత్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్‌రాజ్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హెచ్‌యూఎంటీఏ ఎండీ జీవన్ బాబు, దక్షిణ మధ్య రైల్వే డీసీఎం చరణ్ నాయక్ పాల్గొన్నారు.

# మళ్లీ లాక్ డౌన్..? మోడీ బిగ్ ప్లాన్?

- **త్రివిధ దళాధిపతులు.. సీఎంలతో మోడీ కీలకభేటిలు.. సంక్షోభ నిర్వహణపై దృష్టి**
- **యుద్ధ ప్రభావాలపై దేశవ్యాప్తంగా చర్యలు?**
- **మోదీ సమావేశాలపై పెరుగుతున్న ఆసక్తి**

**ముద్ర డెస్క్ :**



పశ్చిమాసియా యుద్ధ ప్రభావం భారత్‌పై పడుతోంది. యుద్ధంలో పాల్గొనకపోయినా చమురు, గ్యాస్ సంక్షోభం ఎదుర్కొంటోంది. ఎల్‌పీజీ ధరలను కేంద్రం ఇప్పటికే పెంచింది. మరోవైపు స్టాక్ మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. లక్షల కోట్ల సంపద ఆవిరవుతోంది. భారత్‌కు సమీపంలో హిందూ మహా సముద్రంలో కూడా యుద్ధం జరిగింది. ఇక యుద్ధ ప్రభావంతో లాక్‌డౌన్ అంటూ కూడా సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సంక్షోభాన్ని ఎదుర్కొనేందుకు ప్రధాని మోదీ రెండు రోజుల క్రితం ప్రకటన చేశారు. ఇక నిన్న త్రివిధ దళాల అధికారులతో సమావేశం నిర్వహించారు. రేపు ముఖ్యమంత్రులతో సమావేవం కాబోతున్నారు. సాయంత్రం 6:30 గంటలకు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నారు.

**మునుపటి చర్చలు**

రెండు రోజుల క్రితం త్రివిధ దళాధిపతులతో కేంద్రం సమావేశం, మునుపటి రోజు ఆల్ పార్టీ మీటింగ్ పూర్తి చేశారు. ఈ సందర్భాల్లో భారతీయుల భద్రత, ఇంధన సరఫరా, ఆర్థిక ప్రభావాలపై చర్చలు జరిగాయి. సీఎంలతో ఈ సమావేశం రాష్ట్రస్థాయి సమన్వయాన్ని బలోపేతం చేస్తుంది. గల్ఫ్ దేశాల్లో భారతీయుల రక్షణ, ఇంధన ధరల నియంత్రణ, ప్రజా సంక్షోభ నిర్వహణపై దిశానిర్దేశం చేయబోతున్నారు.పశ్చిమాసియా సంక్షోభం ఊహించని సవాళ్లు తీసుకొస్తున్న నేపథ్యంలో మోదీ నిర్ణయాలు కేంద్ర-రాష్ట్రాల మధ్య ఐక్యతను పెంచుతాయి. ఇది ఆర్థిక స్థిరత్వం, ప్రజా భద్రతకు దారి తీస్తుంది. అయితే మోదీ భేటీ ఇంకా ఏమైనా కీలక ప్రకటనలు చేస్తారా అన్న ఉత్కంఠ కూడా నెలకొంది.

# కల్తీ లేని ఉత్తర తెలంగాణను నిర్మించాలి

- **ప్రభుత్వ పథకాలకు ఇందిరా గాంధీ పేరు పెట్టి అవమానించవద్దు**
- **అసెంబ్లీలో మీడియాతో ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

కల్తీ లేని ఉత్తర తెలంగాణను నిర్మించాలని ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి డిమాండ్ చేశారు. మద్యం బ్రాండ్లలాగే ఇప్పసారాకు పింక్ లేబుల్ వంటి పేర్లు పెట్టి ప్రభుత్వమే సరఫరా చేయాలని సూచించారు. గురువారం అసెంబ్లీ ఆవరణలో ఆయన మీడియాతో మాట్లాడారు.ఉత్తర తెలంగాణలో కల్తీ కల్లు మరణాలు, గల్ఫ్ కార్మికుల సమస్యలు, ప్రభుత్వ పథకాలకు పెడుతున్న పేర్లపై దుమ్మెత్తిపోశారు. ఉత్తర తెలంగాణలో ఆల్‌ఫ్రాజోలం కల్తీ కల్లుతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రతి పథకానికి మాజీ ప్రధాని ఇందిరా గాంధీ పేరు పెట్టడం ద్వారా ఆమెను అవమానించవద్దని రాకేష్ రెడ్డి హితవు పలికారు. సోషల్ మీడియాలో ఆమెపై వస్తున్న అభ్యంతరకర వీడియోలను ఖండించిన ఏకైక ఎమ్మెల్యేను తానేనని గుర్తు చేశారు. ప్రభుత్వ పథకాలకు తెలంగాణ అమరవీరుల పేర్లు, మాజీ సీఎంల పేర్లు మీకు దొరకడం లేదా అని ప్రశ్నించారు. సోనియా గాంధీని బలిదేవత అన్న వ్యక్తే ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో సీఎం అయ్యారని చురకలంటించారు. 40 ఏళ్లుగా పార్టీకి సేవ చేసిన జీవన్ రెడ్డి వంటి సీనియర్ నేతలను అవమానిస్తూ బయటకు పంపుతున్నారని మండిపడ్డారు. కౌలుదారులు వచ్చి కాంగ్రెస్‌ను నాశనం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై పరోక్ష ఆరోపణలు చేశారు. జీవన్ రెడ్డి మాటలకు ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. చనిపోయిన 120 మంది గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఇంకా పరిహారం అందలేదని, వారు సచివాలయం చుట్టూ తిరుగుతున్నా ప్రభుత్వానికి కనికరం లేదని ధ్వజమెత్తారు. బడ్జెట్‌లో గల్ఫ్ సంక్షేమ నిధికి రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని రాకేశ్ రెడ్డి డిమాండ్ చేశారు.



# రాష్ట్రానికి రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు

- **దావోస్ పర్యటనపై అసెంబ్లీలో మంత్రి శ్రీధర్ బాబు**

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

దావోస్ పర్యటనల ద్వారా తెలంగాణకు రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు వెల్లడించారు. 2024, 2025 దావోస్ పర్యటనల్లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం మొత్తంగా రూ.2.19 లక్షల కోట్ల పెట్టుబడులను సముపార్జించిందన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం సభలో దావోస్ పర్యటనలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులపై బీజేపీ సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పారు. మొత్తం 44 ఎంవోయూలను వివిధ కంపెనీలతో కుదుర్చుకున్నామని పేర్కొన్నారు. ఆయా పెట్టుబడుల గ్రౌండింగ్ వివిధ దశల్లో ఉన్నాయని వివరించారు. ఫలితంగా కొత్తగా 68,150 మంది నిరుద్యోగులకు ప్రత్యక్షంగా ఉపాధి లభించనుందని తెలిపారు.2024లో 18 ఎంవోయూలతో రాష్ట్రానికి రూ.40,232 కోట్ల పెట్టుబడులు రాగా, 2025లో 26 ఎంవోయూలతో రూ.1,78,950 కోట్లు కలుపుకుని మొత్తం 44 ఎంవోయూలతో రూ.2,19,182 కోట్ల పెట్టుబడులు వచ్చాయని అన్నారు.దావోస్ పర్యటనల్లో రూ.81,800 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ఎంవోయూలు కుదుర్చుకున్న 6 కంపెనీలకు ఇప్పటికే భూములు కేటాయించామని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా ప్రభుత్వానికి రూ.1,540 కోట్ల ఆదాయం సమకూరిందని వెల్లడించారు. నిజామాబాద్ ఐటీ టవర్ మొత్తం 681 సీట్ల సామర్థ్యం ఉందని, ప్రస్తుతం అక్కడ 11 కంపెనీలు 276 మంది ఉద్యోగులతో కార్యకలాపాలు నిర్వహిస్తున్నాయని మంత్రి శ్రీధర్ బాబు సభలో ప్రస్తావించారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
27.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



ఇతరులతో పోల్చుకోవడం మానండి సోషల్ మీడియాలో కనిపించే జీవితాలు నిజానికి ప్రతిబింబం కావని గుర్తుంచుకోండి.

# ప్రభుత్వ ఉద్యోగులకు నిరాశ

- సెప్టెంబర్ నెలాఖరు వరకు పీఆర్సీ గడువు పెంపు
- ప్రభుత్వానికి చేరని కొత్త పీఆర్సీ నివేదిక

**ముద్ర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణలో ప్రభుత్వ ఉద్యోగులకు మరోసారి నిరాశే మిగిలింది. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన సవరణ కమిషన్ గడువును ప్రభుత్వం పెంచింది. పీఆర్సీ గడువు సెప్టెంబర్ నెలాఖరు వరకు పొడిగించింది. ప్రస్తుత పీఆర్సీ కమిటీ గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఈ నేపథ్యంలో మరో ఆరు నెలల పాటు కమిటీ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం నిర్ణయం తీసుకుంది. కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు కొత్త పీఆర్సీ కోసం చాలాకాలంగా ఎదురుచూస్తున్నారు. కానీ కొత్త పీఆర్సీ నివేదిక ఇంకా ప్రభుత్వానికి చేరలేదు. ఈ తరుణంలో కొత్త పీఆర్సీ కోసం ఉద్యోగ సంఘాల నేతలు ప్రభుత్వానికి పలుమార్లు వినతిపత్రాలు సమర్పించారు.

**రెండు రోజుల క్రితం అసెంబ్లీలో..**


ప్రస్తుతం బడ్జెట్ సమావేశాల సందర్భంగా రెండు రోజుల క్రితం శాసనసభలో బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు ఈ విషయంలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన మూడు నెలల్లోగా కొత్త పీఆర్సీ ఇస్తామని ఎలక్షన్ మేనిఫెస్టోలో చెప్పారని, కానీ అధికారంలోకి వచ్చి రెండున్నరేండ్లు కావొస్తున్నా పీఆర్సీ ఇవ్వలేదని, మళ్లీ ఎక్స్‌టెన్షన్ ఇస్తారా..? కనీసం ఇప్పుడైనా రిపోర్ట్ తీసుకుని ఉద్యోగులకు కొత్త పీఆర్సీ ఎప్పటిలోగా ఇస్తారో స్పష్టంగా చెప్పాలని అడిగారు. అయితే ప్రభుత్వం మాత్రం మరోసారి పీఆర్సీ కమిటీ పొడిగింపుకే మొగ్గు చూపింది.

# వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ 2026కు ఎంపిక

**ముద్ర ప్రతినిధి, నాగర్ కర్నూల్:**



శ్రీ ఉమామహేశ్వర గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్, కొండనాగులలో నిర్వహించిన జిల్లా స్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ 2026 పోటీల్లో ఆర్ట్స్, కామర్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. “50 సంవత్సరాల భారత ప్రజాస్వామ్యంలో అత్యవసర పరిస్థితి నుంచి నేర్చుకున్న పాఠాలు” అనే అంశంపై జరిగిన ఈ పోటీల్లో బీఏ మొదటి సంవత్సరం విద్యార్థి జి. లోకేష్, బీకాం మూడవ సంవత్సరం విద్యార్థిని ఎస్. మాధవి ఉత్తమ ప్రతిభను కనబర్చారు. ఈ నెల 28 నుంచి 29 వరకు హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవాభివృద్ధి వనరుల కేంద్రం (MCRHRD) లో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యూత్ పార్లమెంట్ ఫెస్టివల్‌లో జి. లోకేష్ పాల్గొననున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. కె. గీతాంజలి, అధ్యాపకులు నరేష్, డా. కృష్ణ, ఇతర బృంద సభ్యులు విద్యార్థులను అభినందించారు. భవిష్యత్తులో విద్యార్థులను జాతీయ స్థాయికి తీసుకెళ్లే లక్ష్యంతో కళాశాలలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు.



# అసెంబ్లీలో మీ గొప్పలేంది?

- భట్టి విక్రమార్క ఘాటు వ్యాఖ్యలు
- పద్దులపై చర్చ మళ్లిస్తున్న బీఆర్ఎస్‌పై విమర్శలు

**ముద్ర, హైదరాబాద్ :**

అసెంబ్లీలో మహిళా శిశు సంక్షేమం, పంచాయతీరాజ్ పద్దులపై జరుగుతున్న చర్చ సందర్భంగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ప్రతిపక్ష బీఆర్ఎస్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. పద్దులపై సార్థక చర్చ జరగాల్సిన సమయంలో, గత పదేళ్ల కేసీఆర్ ప్రభుత్వ పనితీరును గొప్పలు చెప్పుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాట్లాడటం సరికాదని ఆయన అన్నారు. ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిందిపోయి, గత పాలనను ప్రశంసించడం సమంజసం కాదని స్పష్టం చేశారు. కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల అమలుపై వచ్చిన ఆరోపణల విషయంలో ప్రభుత్వం స్పందన చూపుతుందని తెలిపారు. “పెళ్లై బిడ్డ సంకలోకి వచ్చినా చెక్కు అందలేదు” అన్న వ్యాఖ్యలు నిజమైతే, ఆలస్యానికి గల కారణాలను ఖచ్చితంగా పరిశీలిస్తామని చెప్పారు. సాధారణంగా ఈ పథకాల అమలులో ప్రభుత్వ స్థాయిలో జాప్యం ఉండదని, ఎక్కడైనా ఆలస్యం జరిగితే అది ఎమ్మెల్యే సంతకం లేకపోవడం, దరఖాస్తు ఆలస్యం లేదా అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఉండవచ్చని వివరించారు. దీనిపై పూర్తి వివరాలను సభ ముందు ఉంచుతామని హామీ ఇచ్చారు. మిషన్ భగీరథ పథకంపై కూడా భట్టి విక్రమార్క ప్రశ్నలు లేవనెత్తారు. ప్రజలకు నీళ్లు అందించడానికే ఈ పథకం తీసుకువచ్చారా? లేక పైపుల కంపెనీల ప్రయోజనాల కోసంనా? అని ప్రశ్నించారు. దాదాపు రూ.40 వేల కోట్లకు పైగా ఖర్చు చేసి లక్షా 23 వేల కిలోమీటర్ల పైపులు వేశామని చెప్పినా, క్షేత్రస్థాయిలో నీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని విమర్శించారు. రాష్ట్రంలోని ఏ జిల్లాలోనూ మిషన్ భగీరథ సమర్థవంతంగా పనిచేయడం లేదని, ఎక్కడ చూసినా పైపుల లీకేజీలు, పగిలిన పైపులతో నీరు వృథా అవుతుండగా ప్రజలకు మాత్రం అందడం లేదని అన్నారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల నుంచి ఎర్రుపాలెం వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా సరైన నీటి సరఫరా జరగడం లేదని ఉదాహరణగా పేర్కొన్నారు. కొత్త పథకాల పేరుతో స్థానిక నీటి వనరులను నిర్లక్ష్యం చేయడంతో పాటు, ఇప్పటికే పనిచేస్తున్న పాత పథకాలను నిలిపివేసి ప్రజలను ఇబ్బందులకు గురిచేశారని విమర్శించారు. మిషన్ భగీరథ పనితీరుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు సిద్ధమైతే కమిటీ ఏర్పాటు చేసి, గ్రామాల వారీగా క్షేత్రస్థాయిలో పరిస్థితులను పరిశీలిద్దామని సవాల్ విసిరారు. అంతేకాకుండా ప్రతిపక్ష నేతలు సభా మర్యాదలను పాటిస్తూ మాట్లాడాలని, ముఖ్యమంత్రి, మంత్రులను గౌరవించడం అవసరమని సూచించారు. సభలో బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు.

# రాత్రి అయితే రై రై

- మసక చీకట్లో ఇసుక రవాణా
- రాత్రి 10 దాటితే చీకటి దందా
- ఆంధ్ర నుంచి తెలంగాణకు ఆగని ఇసుక రవాణా
- ఇసుక వాహనాల ముందు వెనుక ప్రైవేట్ ఎస్కార్ట్ వాహనాలు.
- ఇసుక వాహనాలకు విచ్చలవిడిగా అనధికారిక అనుమతులు.
- కాసుల కురిపిస్తున్న ఇసుక రవాణా
- సరిహద్దులో కాసుల వర్షం

**ముద్ర, జోగులాంబ గద్వాల జిల్లా ప్రతినిధి:**



సూర్యుడు అస్తమిస్తే చాలు.. అక్కడ ఇసుక అసురుల వేట మొదలవుతుంది. రాత్రి 10 దాటిందంటే చాలు.. సరిహద్దు దాటి వచ్చే ప్రతి టిప్పర్ ఒక బంగారు గనిలా మారుతుంది. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు సాగుతున్న ఈ ‘ఇసుక దందా’ ఇప్పుడు మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఏపీలో కేవలం రూ. 3,500 కే లభించే 20 టన్నుల ఇసుక.. గద్వాల జిల్లా సరిహద్దు దాటేసరికి రూ. 35,000 కు చేరుతోంది. అంటే పదింతల లాభం! ఈ భారీ లాభాల వేటలో ప్రైవేట్ ఎస్కార్ట్ వాహనాల పహారా మధ్య, మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారుల కళ్ళు గప్పి లేదా వారి కళ్ళ ముందే వేల కోట్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. తుంగభద్ర, కృష్ణా నదీ తీరాల నుంచి అక్రమంగా తరలిస్తున్న ఈ ఇసుకను నిలువ చేసేందుకు సరిహద్దు గ్రామాల్లో రహస్య డంపులు వెలిశాయి. నిబంధనలు గాలికొదిలేసి, పన్నులు ఎగ్గొట్టి సాగుతున్న ఈ నల్లబజారు దందాపై 'ముద్ర' అందిస్తున్న ప్రత్యేక కథనం.

ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. కర్నూల్, మంత్రాలయం, నాగల్ దిన్నె ప్రాంతాల తుంగభద్రా నదీతీరం నుంచి ఆంధ్ర, తెలంగాణకు చెందిన ఇసుక మాఫియా రాత్రివేళలో జోగులాంబ గద్వాల జిల్లాకు అక్రమంగా తరలిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణకు నిబంధనలకు విరుద్ధంగా, ఎటువంటి పన్నులు చెల్లించకుండా తరలిస్తూ, తెలంగాణ ప్రభుత్వ ఖజానాకు కోట్లలో గండి కొడుతున్నారు. ప్రధానంగా కర్నూల్ జిల్లా గద్వాల జిల్లా మధ్య అంతరాష్ట్ర చెక్ పోస్టు మీదుగా అక్రమ ఇసుక రవాణా అవుతున్న జిల్లామైనింగ్, పోలీస్, రెవెన్యూ శాఖల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అలాగే కర్ణాటక రాష్ట్ర సరిహద్దులో తుంగభద్ర, కృష్ణానదీ తీరాల నుంచి టిప్పర్ల ద్వారా ఇసుకను అక్రమంగా అయిజ,గట్టు, కేటిదొడ్డి, ధరూర్ మండలాలకు రాత్రివేళలో ఆయా పోలీస్ స్టేషన్ల మీదుగా తరలిస్తున్నారు. గట్టు, కేటిదొడ్డి మండలాల శివారు గ్రామాలలో ఇసుక డంపులు నిలువ చేసి అక్కడ నుంచి అక్రమ రవాణాకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా, దందా సాఫీగా నడవడానికి అధికారులుకు మాముళ్లు అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా మైనింగ్, రెవెన్యూ, పోలీసు అధికారులు అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పలువురు కోరుతున్నారు

**ఏపీలో ఉచితం.. తెలంగాణలో డిమాండ్**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కర్నూల్, మంత్రాలయం వద్ద గల గోదావరి నది నుంచి ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమార్కులు ఇసుకను తరలిస్తున్నారు. ఏపీలో 20 టన్నుల ఇసుక రూ.3,500 నుంచి రూ.4 వేల మధ్య లభిస్తుండటంతో కర్నూల్ ఇసుక మాఫియాకు వరంగా మారింది. గద్వాల జిల్లాలో తుంగభద్రనది తీరాన ఇసుక రీచ్ లు తరలించేందుకు అనుమతులు పొందిన కాంట్రాక్టర్, రాజకీయ నాయకుల మధ్య సయోధ్య కుదరకపోవడంతో ఇసుక రవాణా నిలిచిపోయింది. ఇదే అదునుగా తీసుకుని ఏపీ రాష్ట్రానికి చెందిన ఇసుక మాఫీయా గద్వాల జిల్లా ఇసుక బ్రోకర్ల ద్వారా ఏపీ ఇసుకను టిప్పర్ ల ద్వారా గద్వాల పట్టణంతో పాటు వివిధ మండలాలకు, మారుమూళ్ల గ్రామాలకు తరలిస్తున్నారు. ఏపీలో ఇసుక తక్కువ ధరకు లభిస్తుంది. తెలంగాణలో ఇసుకకు ఉన్న విపరీతమైన డిమాండ్ ను ఆంధ్ర ఇసుక మాఫియా క్యాష్ చేసుకునేందుకు, రాత్రికి రాత్రే భారీ టిప్పర్ ల ద్వారా గద్వాల జిల్లాకు తరలిస్తూ కోట్ల రుపాయాలు గడిస్తున్నారు. గద్వాల్ జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల మీదుగా టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణ చేస్తున్నా అధికారుల్లో మాత్రం చలనం లేదు.





**సరిహద్దులో అక్రమ ఇసుక డంపులు**

తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల సరిహద్దును ఆసరాగా చేసుకొని అక్రమార్కులు ఇసుక అక్రమ రవాణకు తెరలేపారు. ఏపీలోని మంత్రాలయం వద్ద తుంగభద్ర నదీ, కర్ణాటక రాష్ట్రా కృష్ణానదీ తీరాల నుంచి టిప్పర్ల ద్వారా అక్రమంగా తెచ్చుకున్న ఇసుకను పట్టపగలే గద్వాల్ జిల్లా గట్టు, కేటిదొడ్డి, అయిజ మండలాల సరిహద్దుల్లో డంపు చేస్తున్నారు. అక్కడ నుంచి టిప్పర్లలో రాత్రికి రాత్రికే గట్టు, కేటిదొడ్డి, అయిజ, ధరూర్ మండలాలకు తరలిస్తున్నారు. ఇందుకు అధికారుల అండదండలు మెండుగా ఉండడంతో ఇసుక అక్రమ రవాణా మూడు పువ్వులు ఆరు కాయలుగా విరాజిల్లుతోంది. ఓవైపు ప్రభుత్వం ఇసుక అక్రమ రవాణను అరికట్టాలని మొత్తుకుంటున్నా అక్రమార్కులు, అధికారులు వాటిని తుంగలో తొక్కేస్తున్నారు.

**గస్తీని పెంచి అక్రమ రవాణాను అరికడతాం**

ఏపీ, కర్ణాటక సరిహద్దు రాష్ట్రాల నుంచి తెలంగాణలోకి అక్రమ ఇసుక తరలింపుపై నిఘా పెడతాం. రాత్రివేళలో టిప్పర్ల ద్వారా ఇసుక అక్రమ రవాణాను అరికట్టేందుకు పెట్రోలింగ్‌ను పెంచుతాం. ఇసుక డంపులు నిలువ చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం.

– వై.మొగిలయ్య, డీఎస్పీ, గద్వాల

# జోగిపేటలో విద్యుత్ కార్మికుల సమ్మె

**ముద్ర ప్రతినిధి, సంగారెడ్డి :**

విద్యుత్ సంస్థల్లో పని చేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జోగిపేట్ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఆర్టిజన్ కార్మికులకు ప్రభుత్వం నిబంధన ప్రకారం ఏపీఎస్సిబి రూల్స్ వర్తింపజేయాలని, సమాన పనికి సమాన వేతనం అందజేయాలన్నారు. ఆర్టిజన్ కార్మికుల ను విద్యార్హతను బట్టి కన్వర్షన్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మీటర్ రీడింగ్ వర్కర్లను మరియు పోల్ టు పోల్ వర్కర్లను. ఎఫ్ఓసి వర్కర్లను కూడా విద్యుత్ సంస్థలో విలీనం చేసుకోవాలని జిల్లా జేఏసీ కన్వీనర్ దుర్గ్య నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కార్మికులు రజిత, జోగినాథ, రాజేందర్, సాయిలు, పవన్, నారాయణ, మల్లేశం, సుధీర్, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.



# పరిపాలనలో రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకం

- భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలి
- సీజ్ చేసిన ఇసుక వాహనాలను వదలొద్దు
- కలెక్టర్ ప్రతీక్ జైన్

**ముద్ర, నారాయణపేట:**




జిల్లా పరిపాలన లో రెవెన్యూ వ్యవస్థ అత్యంత కీలకమని, రెవెన్యూ అధికారులు పారదర్శకంగా పని చేసి ప్రజలకు సేవలు అందించాలని కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో జిల్లాలోని అన్ని మండలాల తహసీల్దార్లతో ఆయన రెవెన్యూ శాఖపై తొలి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో భూ భారతి పెండింగ్ దరఖాస్తులను వీలైనంత త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా వాణి కార్యక్రమంలో ఎక్కువ శాతం భూ సమస్యలపైనే ఫిర్యాదులు వస్తున్నాయని, వాటిని మండల స్థాయిలోనే పరిష్కరిస్తే కలెక్టరేట్ కు వచ్చే పరిస్థితి ఉండదన్నారు. అలాగే సాదా బైనామా దరఖాస్తులను జీ ఓ 76,77 ప్రకారం నిబంధనల మేరకు పరిష్కరించాలని ఆయన తెలిపారు. జిల్లాలో అనుమతి లేకుండా అక్రమంగా తరలించే ఇసుక వాహనాలను పట్టుకుని సీజ్ చేసి తన , రెవెన్యూ అదనపు కలెక్టర్ అనుమతి లేకుండా సీజ్ చేసిన ఇసుక వాహనాలను వదలవద్దని తేల్చి చెప్పారు. ఇసుక అక్రమ రవాణా పై ప్రభుత్వం చాలా సీరియస్ గా ఉందని చెప్పారు. జిల్లాలో ప్రభుత్వ స్థలాలను సంరక్షించాలని, సోలార్ పవర్ ప్లాంట్లకు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ నిర్మాణానికి ప్రభుత్వ స్థలాన్ని గుర్తించాలని కలెక్టర్ సూచించారు. సమాచార హక్కు చట్టం కింద వచ్చిన దరఖాస్తులకు 30 రోజుల్లోపు సమాధానం ఇవ్వాలన్నారు. దరఖాస్తుదారులు అడిగిన వాటికి స్పష్టమైన సమాచారం ఇవ్వాలని, అప్పీలుకు వెళ్ళే ఆస్కారం ఇవ్వొద్దన్నారు. పెండింగ్ లో ఉన్న కల్యాణ లక్ష్మి/ షాదీ ముబారక్ పథకాల దరఖాస్తులను వెంటనే క్లియర్ చేయాలన్నారు. కుల ధ్రువీకరణ పత్రాల జారీ విషయంలో ఆలస్యం వద్దన్నారు. వీటితో పాటు లోకాయుక్త , బైండ్ ఓవర్ కేసుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దని ఆయన తెలిపారు. ఏప్రిల్ లో ఎస్. ఐ.ఆర్ ప్రారంభమవుతుందని, అంతలోపు రెవెన్యూ శాఖలో పెండింగ్ లో ఉన్న పనులన్నీ క్లియర్ చేసుకుంటే ఎస్. ఐ.ఆర్ ప్రారంభమైన తర్వాత ఒత్తిడి ఉండదన్నారు. రెవెన్యూ వ్యవస్థ పై ప్రజల్లో పూర్తి నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని తహసీల్దార్లకు కలెక్టర్ హితవు పలికారు.



# గిరిజన డిగ్రీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే

**ముద్ర ప్రతినిధి, మెదక్ :**

తెలంగాణ గిరిజన గురుకుల రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల మహిళ, మెదక్ 20222025 విద్యార్థుల గ్రాడ్యుయేషన్ డే కళాశాల నిర్వహించారు. ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ సెక్రెటరీ డాక్టర్ జె.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. డిగ్రీ పూర్తి చేసుకున్న ప్రతి విద్యార్థి ఉన్నత విద్యను అభ్యసించి భవిష్యత్తును చక్కగా తీర్చిదిద్దుకోవాలని సూచించారు. కేవలం విద్యానే కాకుండా సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ, నైపుణ్యాలను పెంపొదించుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఉమాదేవి మాట్లాడుతూ.. విద్యార్థులు తమ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు వివిధ యూనివర్సిటీలలో ర్యాంకులను సాధించి కళాశాలకు వారి తల్లిదండ్రులకు పేరు తీసుకొచ్చారని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం కూడా అట్టహాసంగా జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ కళ్యాణి కళాశాల వైస్ ప్రిన్సిపల్ బి విజయలక్ష్మి, ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ శరదీపిక, అల్యూమిని అసోసియేషన్ ఆఫీసర్ అర్చనకులకర్ణి తదితరులు పాల్గొన్నారు.

# బాలునిపై కుక్కల దాడి.. కన్ను గుడ్డు ఊడిపడింది

**ముద్ర ప్రతినిధి, భువనగిరి :**

యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరిలోని తారకరామ నగర్ లో హృదయ విధారక ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ప్రియాంష్ అనే 3 సంవత్సరాల బాలునిపై కుక్కల దాడి చేయగా కన్ను గుడ్డు ఊడిపడింది. గాయలతో అల్లాడుతున్న బాలుడుని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా డాక్టర్లు ప్రథమ చికిత్స చేసి హైదరాబాదుకు తరలించారు. ప్రభుత్వఆసుపత్రి వద్ద నిరసన చేసిన వార్డ్ ప్రజలు బాలునిపై కుక్కల దాడికి నిరసనగా వార్డ్ ప్రజలు ప్రభుత్వఆసుపత్రి వద్ద రాస్తారోకో చేశారు. వీధి కుక్కలతో ప్రజలు భయాందోళనకు గురి అవుతున్నారని వెంటనే చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రాస్తారోకోతో పట్టణంలో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.



సమగ్ర సమాచార పత్రిక
# ముద్ర
27.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



మీ వాడకం మీద అవగాహన పెంచుకోండి
సోషల్ మీడియా మీపై ఎలా ప్రభావం చూపుతుందో గమనించి అలవాట్లు మార్చుకోండి.





| Date | Start | Home | Away | Venue |
|---|---|---|---|---|
| 28-MAR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Sunrisers Hyderabad | Bengaluru |
| 29-MAR-26 | 7:30 PM | Mumbai Indians | Kolkata Knight Riders | Mumbai |
| 30-MAR-26 | 7:30 PM | Rajasthan Royals | Chennai Super Kings | Guwahati |
| 31-MAR-26 | 7:30 PM | Punjab Kings | Gujarat Titans | New Chandigarh |
| 01-APR-26 | 7:30 PM | Lucknow Super Giants | Delhi Capitals | Lucknow |
| 02-APR-26 | 7:30 PM | Kolkata Knight Riders | Sunrisers Hyderabad | Kolkata |
| 03-APR-26 | 7:30 PM | Chennai Super Kings | Punjab Kings | Chennai |
| 04-APR-26 | 3:30 PM | Delhi Capitals | Mumbai Indians | Delhi |
| 04-APR-26 | 7:30 PM | Gujarat Titans | Rajasthan Royals | Ahmedabad |
| 05-APR-26 | 3:30 PM | Sunrisers Hyderabad | Lucknow Super Giants | Hyderabad |
| 05-APR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Chennai Super Kings | Bengaluru |
| 06-APR-26 | 7:30 PM | Kolkata Knight Riders | Punjab Kings | Kolkata |
| 07-APR-26 | 7:30 PM | Rajasthan Royals | Mumbai Indians | Guwahati |
| 08-APR-26 | 7:30 PM | Delhi Capitals | Gujarat Titans | Delhi |
| 09-APR-26 | 7:30 PM | Kolkata Knight Riders | Lucknow Super Giants | Kolkata |
| 10-APR-26 | 7:30 PM | Rajasthan Royals | Royal Challengers Bengaluru | Guwahati |
| 11-APR-26 | 3:30 PM | Punjab Kings | Sunrisers Hyderabad | New Chandigarh |
| 11-APR-26 | 7:30 PM | Chennai Super Kings | Delhi Capitals | Chennai |
| 12-APR-26 | 3:30 PM | Lucknow Super Giants | Gujarat Titans | Lucknow |
| 12-APR-26 | 7:30 PM | Mumbai Indians | Royal Challengers Bengaluru | Mumbai |
| 13-APR-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Rajasthan Royals | Hyderabad |
| 14-APR-26 | 7:30 PM | Chennai Super Kings | Kolkata Knight Riders | Chennai |
| 15-APR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Lucknow Super Giants | Bengaluru |
| 16-APR-26 | 7:30 PM | Mumbai Indians | Punjab Kings | Mumbai |
| 17-APR-26 | 7:30 PM | Gujarat Titans | Kolkata Knight Riders | Ahmedabad |
| 18-APR-26 | 3:30 PM | Royal Challengers Bengaluru | Delhi Capitals | Bengaluru |
| 18-APR-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Chennai Super Kings | Hyderabad |
| 19-APR-26 | 3:30 PM | Kolkata Knight Riders | Rajasthan Royals | Kolkata |
| 19-APR-26 | 7:30 PM | Punjab Kings | Lucknow Super Giants | New Chandigarh |
| 20-APR-26 | 7:30 PM | Gujarat Titans | Mumbai Indians | Ahmedabad |
| 21-APR-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Delhi Capitals | Hyderabad |
| 22-APR-26 | 7:30 PM | Lucknow Super Giants | Rajasthan Royals | Lucknow |
| 23-APR-26 | 7:30 PM | Mumbai Indians | Chennai Super Kings | Mumbai |
| 24-APR-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Gujarat Titans | Bengaluru |
| 25-APR-26 | 3:30 PM | Delhi Capitals | Punjab Kings | Delhi |
| 25-APR-26 | 7:30 PM | Rajasthan Royals | Sunrisers Hyderabad | Jaipur |
| 26-APR-26 | 3:30 PM | Gujarat Titans | Chennai Super Kings | Ahmedabad |
| 26-APR-26 | 7:30 PM | Lucknow Super Giants | Kolkata Knight Riders | Lucknow |
| 27-APR-26 | 7:30 PM | Delhi Capitals | Royal Challengers Bengaluru | Delhi |
| 28-APR-26 | 7:30 PM | Punjab Kings | Rajasthan Royals | New Chandigarh |
| 29-APR-26 | 7:30 PM | Mumbai Indians | Sunrisers Hyderabad | Mumbai |
| 30-APR-26 | 7:30 PM | Gujarat Titans | Royal Challengers Bengaluru | Ahmedabad |
| 01-MAY-26 | 7:30 PM | Rajasthan Royals | Delhi Capitals | Jaipur |
| 02-MAY-26 | 7:30 PM | Chennai Super Kings | Mumbai Indians | Chennai |
| 03-MAY-26 | 3:30 PM | Sunrisers Hyderabad | Kolkata Knight Riders | Hyderabad |
| 03-MAY-26 | 7:30 PM | Gujarat Titans | Punjab Kings | Ahmedabad |
| 04-MAY-26 | 7:30 PM | Mumbai Indians | Lucknow Super Giants | Mumbai |
| 05-MAY-26 | 7:30 PM | Delhi Capitals | Chennai Super Kings | Delhi |
| 06-MAY-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Punjab Kings | Hyderabad |
| 07-MAY-26 | 7:30 PM | Lucknow Super Giants | Royal Challengers Bengaluru | Lucknow |
| 08-MAY-26 | 7:30 PM | Delhi Capitals | Kolkata Knight Riders | Delhi |
| 09-MAY-26 | 7:30 PM | Rajasthan Royals | Gujarat Titans | Jaipur |
| 10-MAY-26 | 3:30 PM | Chennai Super Kings | Lucknow Super Giants | Chennai |
| 10-MAY-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Mumbai Indians | Raipur |
| 11-MAY-26 | 7:30 PM | Punjab Kings | Delhi Capitals | Dharamshala |
| 12-MAY-26 | 7:30 PM | Gujarat Titans | Sunrisers Hyderabad | Ahmedabad |
| 13-MAY-26 | 7:30 PM | Royal Challengers Bengaluru | Kolkata Knight Riders | Raipur |
| 14-MAY-26 | 7:30 PM | Punjab Kings | Mumbai Indians | Dharamshala |
| 15-MAY-26 | 7:30 PM | Lucknow Super Giants | Chennai Super Kings | Lucknow |
| 16-MAY-26 | 7:30 PM | Kolkata Knight Riders | Gujarat Titans | Kolkata |
| 17-MAY-26 | 3:30 PM | Punjab Kings | Royal Challengers Bengaluru | Dharamshala |
| 17-MAY-26 | 7:30 PM | Delhi Capitals | Rajasthan Royals | Delhi |
| 18-MAY-26 | 7:30 PM | Chennai Super Kings | Sunrisers Hyderabad | Chennai |
| 19-MAY-26 | 7:30 PM | Rajasthan Royals | Lucknow Super Giants | Jaipur |
| 20-MAY-26 | 7:30 PM | Kolkata Knight Riders | Mumbai Indians | Kolkata |
| 21-MAY-26 | 7:30 PM | Chennai Super Kings | Gujarat Titans | Chennai |
| 22-MAY-26 | 7:30 PM | Sunrisers Hyderabad | Royal Challengers Bengaluru | Hyderabad |
| 23-MAY-26 | 7:30 PM | Lucknow Super Giants | Punjab Kings | Lucknow |
| 24-MAY-26 | 3:30 PM | Mumbai Indians | Rajasthan Royals | Mumbai |
| 24-MAY-26 | 7:30 PM | Kolkata Knight Riders | Delhi Capitals | Kolkata |

# ఐపీఎల్ పూర్తి షెడ్యూల్ వచ్చేసింది..

ఐపీఎల్ 2026 సీజన్‌కు సంబంధించి బీసీసీఐ పూర్తి షెడ్యూల్‌ను విడుదల చేసింది. మొత్తం 70 లీగ్ మ్యాచ్‌లతో టోర్నీ మార్చి 28న బెంగళూరులో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు-సన్‌రైజర్స్ హైదరాబాద్ మ్యాచ్‌తో ప్రారంభం కానుంది. మే 24న కోల్‌కతాలో కోల్‌కతా నైట్‌రైడర్స్-దిల్లీ క్యాపిటల్స్ మ్యాచ్‌తో లీగ్ దశ ముగియనుంది. లాజిస్టిక్స్, భద్రత, అంతర్జాతీయ షెడ్యూల్స్‌ను దృష్టిలో పెట్టుకుని బీసీసీఐ షెడ్యూల్‌ను రెండు దశల్లో ప్రకటించింది. ప్రతి జట్టుకు సమాన అవకాశాలు ఉండేలా హోమ్‌అవే ఫార్మాట్ కొనసాగుతోంది. అయితే ప్లేఆఫ్స్ వేదికలను ఇంకా ప్రకటించలేదు. ఈ సీజన్‌లో జట్ల మధ్య పోటీ మరింత ఉత్కంఠభరితంగా ఉండనుండగా, అభిమానులకు రెండు నెలల పాటు క్రికెట్ వినోదం కరువు ఉండదని స్పష్టమవుతోంది.

# 2027 వన్డే వరల్డ్ కప్: ఓపెనర్ స్థానం కోసం హోరాహోరీ పోటీ



2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా దేశాల్లో సెప్టెంబర్‌అక్టోబర్ నెలల్లో జరగనుంది. ఈ మెగా టోర్నీ కోసం బీసీసీఐ ఇప్పటికే 20 మంది ప్రాబబుల్స్‌ను గుర్తించినట్లు సమాచారం. ఈ జాబితా నుంచే తుది 15 మంది జట్టును ఎంపిక చేయనున్నారు. కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు శుభ్‌మన్ గిల్ ప్రధాన ఓపెనర్లుగా కొనసాగడం ఖాయంగా కనిపిస్తున్నప్పటికీ, బ్యాకప్ ఓపెనర్ స్థానం కోసం తీవ్ర పోటీ నెలకొంది. అభిషేక్ శర్మ, యశస్వి జైస్వాల్, ఇషాన్ కిషన్ మధ్య గట్టి పోటీ కొనసాగుతోంది. యువ ఆటగాడు అభిషేక్ శర్మ తన అగ్రెసివ్ బ్యాటింగ్‌తో ఆకట్టుకుంటున్నాడు. వేగవంతమైన పిచ్‌లపై అతని ఆట జట్టుకు ప్లస్ అవుతుందని భావిస్తున్నారు. అయితే వన్డేల్లో స్థిరంగా రాణించిన యశస్వి జైస్వాల్ మంచి సగటుతో సెలెక్టర్ల విశ్వాసం గెలుచుకున్నాడు.మరోవైపు ఇషాన్ కిషన్ ఓపెనర్‌గా మాత్రమే కాకుండా రిజర్వ్ వికెట్ కీపర్‌గా కూడా జట్టుకు అదనపు ప్రయోజనం కలిగిస్తాడు. అతని డబుల్ సెంచరీ మరియు వేగవంతమైన బ్యాటింగ్ అతన్ని రేసులో ముందంజలో నిలిపాయి. మొత్తానికి, ఈ ముగ్గురిలో ఎవరిని ఎంపిక చేయాలనేది సెలెక్టర్లకు పెద్ద సవాల్‌గా మారింది. జట్టు సమతుల్యతను దృష్టిలో ఉంచుకుంటే ఇషాన్ కిషన్‌కు అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నప్పటికీ, భవిష్యత్ దృష్టితో జైస్వాల్ లేదా అభిషేక్ శర్మకు ఛాన్స్ రావొచ్చు. రాబోయే సిరీస్‌లలో వారి ప్రదర్శనే ప్రపంచకప్ అవకాశాలను నిర్ణయించనుంది.



## 14 ఏళ్లయినా చెక్కు చెదరని 11 సిక్సర్ల రికార్డ్

అది ఏప్రిల్ 3, 2010.. చెన్నైలోని ఎంఏ చిదంబరం స్టేడియం. రాజస్థాన్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో మురళీ విజయ్ ఆకాశమే హద్దుగా చెలరేగిపోయారు. కేవలం 56 బంతుల్లో 127 పరుగులు చేసిన ఆయన, ఆ ఇన్నింగ్స్‌లో ఏకంగా 11 సిక్సర్లు బాదారు. ఆ సమయంలో అది ఒక సంచలనం. విజయ్ విధ్వంసంతో చెన్నై సూపర్ కింగ్స్ 246 పరుగుల భారీ స్కోరు సాధించింది. అప్పటి నుండి ఇప్పటివరకు ఎందరో హేమాహేమీలు వచ్చినా, ఈ 11 సిక్సర్ల రికార్డును ఏ భారతీయుడూ అధిగమించలేకపోయారు. దాదాపు 14 ఏళ్ల పాటు ఎవరికీ అందనంత ఎత్తులో ఉన్న ఈ రికార్డును ఐపీఎల్ 2025లో ఒక 14 ఏళ్ల కుర్రాడు టచ్ చేశాడు. రాజస్థాన్ రాయల్స్ తరపున ఆడుతున్న వైభవ్ సూర్యవంశీ, గుజరాత్ టైటాన్స్‌పై జరిగిన మ్యాచ్‌లో కేవలం 38 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఈ మెరుపు ఇన్నింగ్స్‌లో వైభవ్ కూడా 11 సిక్సర్లు బాది మురళీ విజయ్ రికార్డును సమం చేశాడు. అతి చిన్న వయసులోనే ఈ ఘనత సాధించి క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. అయితే రికార్డు సమమైంది కానీ, ఇంకా బద్దలు కాలేదు. ఐపీఎల్‌లో క్రిస్ గేల్ (17 సిక్సర్లు), బ్రెండన్ మెకల్లమ్ (13 సిక్సర్లు) వంటి విదేశీ ఆటగాళ్లు ఒకే ఇన్నింగ్స్‌లో ఎక్కువ సిక్సర్లు బాదినప్పటికీ, భారతీయులలో మాత్రం 11 అనేది ఒక లక్కీ నంబర్‌గా మారిపోయింది. సంజు శామ్సన్ (2018లో 10 సిక్సర్లు), శుభ్‌మన్ గిల్ (2023లో 10 సిక్సర్లు), అభిషేక్ శర్మ (2025లో 10 సిక్సర్లు) ఈ రికార్డుకు అత్యంత సమీపంలోకి వచ్చి ఆగిపోయారు. ఆ ఒక్క సిక్సర్ అదనంగా బాది 12 మార్కును చేరుకోవడం భారత బ్యాటర్లకు ఒక కలగానే మిగిలిపోయింది.

## ఆరో ట్రోఫీపై కన్నేసిన ముంబై ఇండియన్స్

ఐపీఎల్ చరిత్రలో అత్యంత విజయవంతమైన జట్లలో ముంబై ఇండియన్స్ ముందువరుసలో నిలుస్తుంది. ఇప్పటికే ఐదు సార్లు ట్రోఫీని అందుకున్న ఈ జట్టు, ఈసారి ఆరో టైటిల్‌పై దృష్టి పెట్టింది. హార్దిక్ పాండ్యా నాయకత్వంలో సమతుల్యమైన జట్టుతో బరిలోకి దిగుతున్న ముంబై, అన్ని విభాగాల్లో బలంగా కనిపిస్తోంది. బ్యాటింగ్ విభాగం ముంబైకి ప్రధాన బలం. రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, హార్దిక్ పాండ్యా వంటి స్టార్ ప్లేయర్లు ఉండడంతో టాప్ నుంచి మిడిల్ ఆర్డర్ వరకు బలమైన లైనప్ ఉంది. అవసరమైతే డికాక్, విల్ జాక్స్ వంటి ఆటగాళ్లు కూడా మ్యాచ్‌ను మలుపుతిప్పగలరు. బౌలింగ్‌లో జస్ప్రీత్ బుమ్రా ప్రధాన ఆయుధం కాగా, దీపక్ చాహర్, శాంట్నర్, హార్దిక్ వంటి ఆల్‌రౌండర్లు జట్టుకు మరింత బలం అందిస్తున్నారు. అయితే వికెట్ కీపింగ్ లోపం, గాయాల సమస్యలు ముంబైకి సవాల్‌గా మారవచ్చు.2013, 2015, 2017, 2019, 2020 సంవత్సరాలలో ముంబై జట్టు విజేతగా ఆవిర్భవించింది. ఈ జట్టులో డికాక్, హార్దిక్ పాండ్యా, తిలక్ వర్మ, రోహిత్ శర్మ, సూర్య కుమార్ యాదవ్, బుమ్రా ఇటువంటి వారు కీలక ప్లేయర్లుగా ఉన్నారు.మొత్తంగా చూసుకుంటే, సరైన ప్రదర్శన కనబరిస్తే ముంబై ఇండియన్స్ ఈసారి ఆరో ట్రోఫీ సాధించడం ఆశ్చర్యం కాదు.




## ఐపీఎల్ 2026 ఓపెనింగ్ సెర్మనీ రద్దు..





- **బీసీసీఐ కీలక నిర్ణయం..**

**ముద్ర, స్పోర్ట్స్ డెస్క్:**

గతేడాది జరిగిన విషాదం నేపథ్యంలో ఐపీఎల్ 2026 ఓపెనింగ్ సెర్మనీని బీసీసీఐ రద్దు చేసింది. మార్చి 28న ఆర్‌సీబీ, ఎస్‌ఆర్‌హెచ్ మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. మే 31న జరిగే ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ సందర్భంగా గ్రాండ్ క్లోజింగ్ సెర్మనీని నిర్వహించాలని బీసీసీఐ ప్లాన్ చేస్తోంది. ఐపీఎల్ 2026 సీజన్ మరికొద్ది గంటల్లో ప్రారంభం కాబోతోంది. మార్చి 28న బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (RCB), సన్‌రైజర్స్ హైదరాబాద్ (SRH) మధ్య తొలి పోరు జరగనుంది. అయితే ప్రతి ఏటా అట్టహాసంగా జరిగే ఐపీఎల్ ఓపెనింగ్ సెర్మనీని ఈసారి రద్దు చేస్తున్నట్లు బీసీసీఐ సంచలన నిర్ణయం తీసుకుంది. ఆడంబరాలు, ఆర్భాటాలకు దూరంగా ఈ సీజన్ ప్రారంభం కానుంది. ఐపీఎల్ ప్రారంభోత్సవాన్ని రద్దు చేయడానికి గల కారణాన్ని బీసీసీఐ సెక్రటరీ దేవజీత్ సైకియా వెల్లడించారు. గతేడాది జూన్ 4న ఆర్‌సీబీ విజయోత్సవ వేడుకల సమయంలో చిన్నస్వామి స్టేడియం వెలుపల జరిగిన తొక్కిసలాటలో 11 మంది ప్రాణాలు కోల్పోయారు. ఆ మృతుల పట్ల గౌరవం, వారి కుటుంబాల పట్ల సానుభూతిని ప్రకటిస్తూ.. ఎటువంటి వినోద కార్యక్రమాలు లేకుండా లీగ్‌ను ప్రారంభించాలని బోర్డు నిర్ణయించింది. కేవలం ఆటపైనే దృష్టి సారించి, బాధితుల జ్ఞాపకార్థం ఈ నిర్ణయం తీసుకున్నట్లు మీడియాతో మాట్లాడుతూ ఆయన ధృవీకరించారు.

## శాసనసభ్యుల క్రీడా పోటీలతో రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తికి నాంది

- **మొదటి ఎడిషన్ లెజిస్టేటర్ స్పోర్ట్స్ మీట్ 2026**

**హైదరాబాద్, ముద్ర ప్రతినిధి:**

రాష్ట్రంలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడం, ప్రజల్లో క్రీడల పట్ల అవగాహన కల్పించడమే లక్ష్యంగా శాసనసభ్యుల క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి తెలిపారు. ఈ నెల 28, 29 తేదీల్లో జరగనున్న “లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026” తొలి ఎడిషన్ నిర్వహణపై గురువారం అసెంబ్లీ కమిటీ హాల్లో సన్నాహక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ రాజకీయాలతో నిత్యం బిజీగా ఉండే శాసనసభ, శాసనమండలి సభ్యులకు ఈ క్రీడా పోటీలు ఉల్లాసం, ఉత్సాహం నింపుతాయని చెప్పారు. అలాగే ప్రజల్లో క్రీడల పట్ల ఆసక్తి పెంచడం, యువతకు ప్రేరణ కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఈ తరహా పోటీలు మొదటిసారిగా నిర్వహించడం విశేషమన్నారు. పార్టీలకు అతీతంగా అన్ని శాసనసభ్యులు, మండలి సభ్యులు ఈ పోటీల్లో పాల్గొననున్నారని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వయస్సుల వారికి క్రీడల ప్రాముఖ్యతను తెలియజేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. శాసనసభ సచివాలయం, తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర సాంస్కృతిక శాఖతో పాటు పలు శాఖల సమన్వయంతో వివిధ క్రీడా పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.ఈ సమావేశంలో శాసనమండలి విప్ అద్దంకి దయాకర్, ఎమ్మెల్యేలు ఎంఎస్ రాజ్ ఠాకూర్, యశస్విని రెడ్డి, పాల్వాయి హరీష్ రావు, ఎమ్మెల్సీలు తాత మధుసూదన్ రావు, భాను ప్రసాద్ రావు, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ డా. సోనీ బాలాదేవి, శాసనమండలి కార్యదర్శి నరసింహాచార్యులు, శాసనసభ కార్యదర్శి ఆర్. తిరుపతి తదితరులు పాల్గొన్నారు.



**28న ప్రారంభం**

“లెజిస్లేటర్ స్పోర్ట్స్ మీట్ 2026” ప్రారంభ వేడుకలు ఈ నెల 28న మధ్యాహ్నం 3.30 గంటలకు ఎల్బీ స్టేడియంలో జరగనున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, ఉభయ సభల పక్ష నేతలు, విప్‌లు, అన్ని పార్టీల ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

సమగ్ర సమాచార పత్రిక
ముద్ర
27.03.2026 శుక్రవారం, హైదరాబాద్
www.mudranews.in | @mudranews



# రెడ్ గ్లామ్‌లో కొత్త ట్రెండ్ సెట్ చేసిన రకుల్

ముద్ర, సినిమా డెస్క్:

బాలీవుడ్ అవార్డ్ వేడుకలో రకుల్ ప్రీత్ సింగ్ తన అద్భుతమైన రెడ్ లుక్‌తో అందరి దృష్టిని తనవైపు తిప్పుకుంది. సింపుల్‌గా కనిపించినప్పటికీ ఎంతో స్టైలిష్‌గా ఉన్న ఈ లుక్ సోషల్ మీడియాలో కూడా మంచి స్పందన అందుకుంటోంది. రకుల్ ఎప్పటిలాగే స్మార్ట్ స్టైలింగ్‌తో ఈసారి కూడా ప్రత్యేకంగా కనిపించింది. ఈ ఈవెంట్‌లో ఆమె ఆఫ్ షోల్డర్ రెడ్ డ్రెస్‌లో మెరిసింది. బాడీకి అచ్చొచ్చినట్టుగా ఫిట్ అయిన ఈ డ్రెస్‌కు పేప్లమ్ స్టైల్ ఫ్లేర్ ఉండటం వల్ల లుక్‌కు కొత్త టచ్ వచ్చింది. నడుము వద్ద ఉన్న స్లీక్ బెల్ట్ అవుట్‌ఫిట్‌కు మంచి స్ట్రక్చర్ ఇచ్చింది. బోల్డ్ రెడ్ కలర్ ఆమె స్కిన్ టోన్‌కు బాగా సూట్ అవుతూ మరింత ఆకర్షణీయంగా చూపించింది. స్టైలింగ్ విషయంలో కూడా రకుల్ చాలా మినిమల్‌గా కనిపించింది. హెవీ ఆభరణాలు వాడకుండా లుక్‌ను క్లీన్‌గా ఉంచింది. సాఫ్ట్ గ్లామ్ మేకప్, న్యూడ్ టోన్స్, ఫ్రింజ్ హెయిర్ స్టైల్ ఆమె లుక్‌కు ఫ్రెష్ ఫీల్ ఇచ్చాయి. బోల్డ్ అవుట్‌ఫిట్‌ను సాఫ్ట్ మేకప్‌తో బ్యాలెన్స్ చేయడం ఈ లుక్‌లో ప్రత్యేకంగా కనిపించింది. రకుల్ ప్రీత్ సింగ్ ఇలాంటి లుక్స్‌ను చాలా ఈజీగా క్యారీ చేయగలదని మరోసారి నిరూపించింది. ఎలాంటి ఓవర్ స్టైలింగ్ లేకుండా సింపుల్ లుక్‌ను కూడా పవర్‌ఫుల్‌గా మార్చడం ఆమె ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఈ రెడ్ గ్లామ్ లుక్‌తో రకుల్ మరోసారి ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకుంది



# మెర్మెయిడ్ స్టైల్ లెహంగాలో మెరిసిన దిశా పటాని

ముద్ర, సినిమా డెస్క్:

'కల్కి 2898 AD' సినిమాలో రాక్సీ పాత్రతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకున్న దిశా పటాని మరోసారి తన స్టైలిష్ లుక్‌తో వార్తల్లో నిలిచింది. సినిమాలతో పాటు ఫ్యాషన్ ప్రపంచంలో కూడా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ బ్యూటీ, ఇప్పుడు ర్యాంప్ నుంచి ఎక్కడ చూసినా తన గ్లామర్‌తో ఆకట్టుకుంటోంది. లాక్మే ఫ్యాషన్ వీక్ 2026 వేదికపై దిశా నిజంగానే డ్రీమీ లుక్‌తో మెరిసిపోయింది. ప్రముఖ డిజైనర్ అమిత్ అగర్వాల్ కోసం ఆమె ర్యాంప్ వాక్ చేసింది. ఈ ఈవెంట్‌లో దిశా ధరించిన హెవీ ఎంబెలిష్డ్ లెహంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మెర్మెయిడ్ స్టైల్‌లో డిజైన్ చేసిన ఈ లెహంగా ఆమె ఫిగర్‌కు అచ్చొచ్చినట్టుగా ఫిట్ అయి మరింత గ్లామరస్‌గా చూపించింది. మెటాలిక్ షైన్, స్కల్ప్టెడ్ డిజైన్, లేయర్డ్ టెక్స్చర్స్ కలిపి ఆ అవుట్‌ఫిట్‌కు ఫాంటసీ స్టైల్ ఫీల్ ఇచ్చాయి. తాజా ఫోటోషూట్‌లో దిశా తన స్టైల్‌ను ఇంకో లెవల్‌కు తీసుకెళ్లింది. బ్రాలెట్ స్టైల్ బ్లౌజ్‌తో పాటు డీటైల్డ్ స్కర్ట్‌లో కనిపించి తన టోన్డ్ ఫిగర్‌ను హైలైట్ చేసింది. స్టేట్‌మెంట్ జ్యువెలరీ, స్టైలిష్ స్టైలింగ్, ఆమె కాన్ఫిడెంట్ అటిట్యూడ్ ఈ లుక్‌కు సల్ట్రీ టచ్ ఇచ్చాయి. గ్లామర్‌తో పాటు ఎలిగెన్స్‌ను కూడా బ్యాలెన్స్ చేయడం ఈ ఫోటోషూట్‌లో ప్రత్యేకంగా కనిపించింది. ఇటీవల షాహిద్ కపూర్‌తో కలిసి 'ఓ రోమియో' అనే స్పెషల్ సాంగ్‌లో కూడా దిశా కనిపించింది. దీంతో ఆమె పేరు మళ్లీ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇక ముందు 'అవారపన్ 2', 'వెల్‌కమ్ టు ది జంగిల్' వంటి ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లు కూడా ఆమె చేతిలో ఉన్నాయి. గ్లామర్, స్టైల్, కాన్ఫిడెన్స్ కలిపి దిశా పటాని మరోసారి ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకుంది.





# కుర్రకారుకు కునుకు లేకుండా చేస్తున్న ప్రజ్ఞ

ముద్ర సినిమా డెస్క్:

యువ నటి ప్రజ్ఞా నగ్రా 'వరలారు ముక్కియం' చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. అనంతరం తమిళ, తెలుగు, మలయాళ భాషల్లో కొన్ని చిత్రాల్లో నటించి ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించింది. 'లగ్గం' సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఆమెకు ఆ చిత్రం ఆశించిన విజయాన్ని అందించకపోయినా, సోషల్ మీడియాలో మాత్రం మంచి గుర్తింపు సంపాదించుకుంది. సినిమాలతో పాటు సామాజిక మాధ్యమాల్లో కూడా ప్రజ్ఞా నగ్రా చురుకుగా ఉంటోంది. తరచూ తన ఫొటోలను అభిమానులతో పంచుకుంటూ ఆకట్టుకుంటోంది. ఆమె పోస్ట్ చేసే చిత్రాలు నెట్టింట వేగంగా వైరల్ అవుతూ అభిమానులను అలరిస్తున్నాయి. తాజాగా లైట్ కలర్ గౌన్‌లో స్టైలిష్ లుక్‌లో కనిపించిన ప్రజ్ఞా నగ్రా కొత్త ఫొటోలను షేర్ చేసింది. ఈ చిత్రాల్లో ఆమె ఆకట్టుకునే స్టైల్, ఆభరణాలు ప్రత్యేకంగా నిలిచాయి. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతూ అభిమానుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

# అన్నయ్యా‌నా.. బావగారా?'..

ముద్ర సినిమా డెస్క్:



పవన్ కల్యాణ్ సతీమణి అన్నా లెజినోవా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లోకి అడుగుపెట్టిన విషయం తెలిసిందే. తాజాగా చిరంజీవి, నాగబాబులతో కలిసి దిగిన ఫొటోలను పంచుకుంటూ తన అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. 'అన్నయ్యనా.. బావగారా?' అంటూ చేసిన ఈ పోస్ట్ ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. మెగా కుటుంబంలోకి దాదాపు 15 ఏళ్ల క్రితం వచ్చినప్పుడు ఎలా ఉండాలో, ఎవరిని ఎలా పిలవాలో తొలుత అర్థం కాలేదని అన్నా తెలిపారు. దీంతో తన భర్త పవన్ కల్యాణ్ వారిని ఎలా పిలుస్తున్నారో గమనించి తాను కూడా అలాగే పిలవడం ప్రారంభించానని చెప్పారు. మొదట చిరంజీవిని అన్నయ్యగా పిలిచానని, తర్వాత ఆ బంధం గొప్పతనం తెలుసుకున్నాక బావగారు అని పిలవడం అలవాటు చేసుకున్నట్లు వివరించారు. తనకు సోదరులు లేనప్పటికీ చిరంజీవి, నాగబాబుల రూపంలో ఇద్దరు సోదరులు దొరికినట్లు భావిస్తున్నానని పేర్కొన్నారు. ఇక ఆమె ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ప్రారంభించిన కొద్ది సమయంలోనే లక్షల్లో ఫాలోవర్లు చేరగా, ఆమె చేసిన తాజా పోస్ట్‌కు కూడా భారీ స్పందన లభిస్తోంది.

# జెంటిల్ మెన్ చేయకపోవడానికి కారణమిదే: రాజశేఖర్

ముద్ర సినిమా డెస్క్:



అర్జున్ హీరోగా తెరకెక్కిన 'జెంటిల్ మెన్' సినిమాలో ముందుగా తానే నటించాల్సి ఉన్నట్లు రాజశేఖర్ తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల ఆ అవకాశం చేజారిపోయిందని వెల్లడించారు. అదే సమయంలో 'అల్లరి ప్రియుడు' సినిమాకు ఇప్పటికే తన తేదీలు ఖరారై ఉండటంతో రెండు చిత్రాల్లో ఒకదాన్ని ఎంచుకోవాల్సి వచ్చినట్లు చెప్పారు. ఆ పరిస్థితుల్లో 'అల్లరి ప్రియుడు' సినిమానే చేయాలని నిర్ణయించుకున్నట్లు వివరించారు. దర్శకుడు శంకర్ తొలి చిత్రంగా రూపొందిన 'జెంటిల్ మెన్' సినిమా తర్వాత భారీ విజయాన్ని సాధించగా, తాను చేయలేకపోవడం అప్పటి పరిస్థితుల కారణంగానే జరిగిందని రాజశేఖర్ పేర్కొన్నారు.



# ఎమరాల్డ్ గ్రీన్ గౌన్‌లో మెరిసిన కృతి సనన్

ముద్ర, సినిమా డెస్క్ :

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కృతి సనన్ మరోసారి తన స్టైలిష్ లుక్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది. ఇటీవల ఆమె చేసిన ఫోటోషూట్‌లో ఎమరాల్డ్ గ్రీన్ గౌన్‌లో కనిపించి ఫ్యాషన్ లవర్స్‌ను ఆకట్టుకుంది. గ్లామర్‌ను క్లాస్‌తో బ్యాలెన్స్ చేయడం కృతి ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. ఈ తాజా లుక్‌లో కూడా ఆమె ఎంతో కాన్ఫిడెంట్‌గా కనిపించింది.ఈ ఫోటోషూట్‌లో కృతి ధరించిన గ్రీన్ గౌన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. డీప్ నెక్ డిజైన్, నడుము వద్ద ఉన్న బోల్డ్ కట్‌ఔట్ డీటైల్స్ అవుట్‌ఫిట్‌కు స్టైలిష్ టచ్ ఇచ్చాయి. సిల్కీ ఫ్యాబ్రిక్‌తో తయారైన ఈ డ్రెస్ ఆమె ఫిగర్‌కు అచ్చొచ్చినట్టుగా ఫిట్ అయి మరింత గ్లామరస్‌గా చూపించింది. సాఫ్ట్ గ్లోయింగ్ మేకప్, లూజ్ వేవ్స్‌లో వదిలిన జుట్టు మొత్తం లుక్‌ను మరింత అందంగా మార్చాయి. ఇక సినిమాల విషయానికి వస్తే, కృతి సనన్ ప్రస్తుతం 'కాక్టెయిల్ 2' సినిమాతో వార్తల్లో నిలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన పాట గ్లింప్స్ ఇప్పటికే యూత్‌లో మంచి స్పందన తెచ్చుకున్నాయి. ఫ్యాషన్ లుక్స్‌తో పాటు ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌లతో కృతి మరోసారి ఫుల్ ఫామ్‌లోకి వచ్చిందని అభిమానులు అంటున్నారు.



# బాడీకాన్ గౌన్‌లో మెరిసిన కియారా

ముద్ర, సినిమా డెస్క్:

బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కియారా అద్వాని మరోసారి తన గ్లామర్ లుక్‌తో సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గత ఏడాది తల్లితనాన్ని ఆస్వాదించిన తర్వాత, ఇప్పుడు ఆమె పూర్తిగా కొత్త లుక్‌తో అభిమానుల ముందుకు వచ్చింది. ఈ తాజా ఫోటోలు చూస్తే కియారా మరింత ఆత్మవిశ్వాసంతో, ఎంతో స్టైలిష్‌గా కనిపిస్తున్నది. ఈ ఫోటోషూట్‌లో కియారా చాక్లెట్ కలర్ బాడీకాన్ గౌన్‌లో మెరిసిపోయింది. ఆమె శరీరాకృతికి అచ్చొచ్చినట్టుగా డిజైన్ చేసిన ఈ గౌన్‌లో కార్సెట్ స్టైల్ బాడీస్, డీప్ నెక్ డిజైన్ ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయి. సింపుల్‌గా కనిపించినప్పటికీ, ఆ డ్రెస్ ఆమె లుక్‌కు క్లాసీ మరియు బోల్డ్ టచ్ ఇచ్చింది. పై నుంచి సాఫ్ట్‌గా ఫిట్ అవుతూ కిందికి కొద్దిగా ఫ్లేర్ అవ్వడం వల్ల ఆమె అవర్‌గ్లాస్ ఫిగర్ మరింత హైలైట్ అయింది. ఈ లుక్‌లో ముఖ్యంగా కనిపించేది ఆమె స్టైలింగ్. ఎక్కువ ఆభరణాలు లేకుండా చాలా మినిమల్‌గా రెడీ అయింది కియారా. కేవలం ఒక చిన్న చోకర్‌తో లుక్‌ను కంప్లీట్ చేసింది. మేకప్ కూడా చాలా సాఫ్ట్‌గా, గ్లోయింగ్‌గా ఉండటం వల్ల ఆమె సహజ అందం మరింత వెలిగిపోయింది. జుట్టును లూజ్ వేవ్స్‌లో వదిలేయడం వల్ల మొత్తం లుక్‌కు స్టైలిష్‌గా ఉండే కూల్ ఫీల్ వచ్చింది. డ్రెస్‌లోని రిచ్ బ్రౌన్ టోన్ ఆమె లుక్‌కు వెచ్చదనం తీసుకువచ్చింది. ఎక్కువగా ప్రయత్నించకుండా, చాలా నేచురల్‌గా గ్లామర్‌ను చూపించడం ఈ ఫోటోషూట్‌లో ప్రత్యేకంగా కనిపిస్తోంది. తల్లితనం తర్వాత కూడా కియారా తన స్టైల్, గ్లామర్ ఏమాత్రం తగ్గలేదని ఈ తాజా ఫోటోలు మరోసారి నిరూపించాయి.

Printed and published by Executive Director Aliminati Indra Reddy, on behalf of M/s Networth Media Private Limited. Printed at Colour Dot Graphics, Ali cafe X Road, Amberpet, Hyderabad-500013. Published at H. No. 6-3-569/2, unit 4A Fourth Floor, Kamadhenu, Rockdale compound, Somajiguda, Hyderabad-500082. Editor: Y. Narender Reddy. RNI No: TELTEL/2013/50413. email: mudradaily@gmail.com